నవల

# ఆమ్‌స్టర్‌డాంలో అద్భుతం



మధురాంతకం నరేంద్ర



## ఆమ్‌స్టర్‌డాంలో

# అద్భుతం

నవల


మధురాంతకం నరేంద్ర

కథాకోకిల ప్రచురణలు

15-54/1, శ్రీ పద్మావతి నగర్

తిరుపతి (పడమర) - 517 502

ఫోన్: 0877 - 2241588



Kathakokila Prachuranalu
15-54/1, Padmavathi Nagar,
Tirupati West - 517 502
Phones : 0877-2241588

# Amsterdomlo Adbhutham

A Novel serialised in Navya Weekly

Copyright c Madhuranthakam Narendra
All rights reserved. No part of this book may be reproduced in any form or by any means, Electronics or Mechanical including photo coping recording or by any information stories and retrieval system without permission in writing from the writer.

First Edition: October, 2013

Type setting: Girivarma

Printed by
Sri Sri Printer, 9490634849

Copies Available at
Kathakokila Prachuranalu,
15-54/1, Sri Padmavathi Nagar,
Tirupati - 2.
Visalandhra Publishing House (All Branches)
Ashok Book Shop, Vijayawada,
Navodaya Book Shop, Hyderbad.

Price
Ordinary Edition Rs. 60/- Libraray Edition Rs. 100/-, U.S. $ 7

for e-Book
www.kinige.com

అంకితం

మధ్యాహ్నమే ముంచెత్తిన సంధ్య
వెలిగిన స్వప్న జ్యోత్స్న
అర్ధాంతరంగా విడిచి వెళ్ళిపోయిన
ఆత్మీయ మిత్రుడు
**కె.ఎస్. రమణ**కు...



## **కృతజ్ఞతలు**

'నవ్య' సంపాదకులు **ఎ.ఎన్.జగన్నాథశర్మ** గారికి
**అడ్లూరు రఘురామరాజు** గారికి
**ఆర్.వసుంధరాదేవి** గారికి

"దేవుడు మన పక్షంలో వున్నాడా లేడా అన్నది గాదు నా ప్రశ్న. దేవుడి పక్షంలో వుండాలన్నది మాత్రమే నా లక్ష్యం; యెందుకంటే దేవుడెప్పుడూ మంచి వైపే వుంటాడు.

**– అబ్రహాం లింకన్**

☯

మతాలన్నింటిలోనూ ప్రేమ మతమే గొప్పది.

**– జలాలుద్దీన్ మహమ్మద్ రూమీ**

✠

నా మతం చాలా సామాన్యమైనది. కరుణే నా మతం

**–దలైలామా**

✡

కవిత్వం లాగే మతం గూడా వొక అభివ్యక్తి మాత్రమే! భగవంతుడి అభివ్యక్తి అనంతమూ, వైవిధ్యభరితమూ అయిన సృష్టిగానే వెల్లడవుతుంది. అనంతుడైన భగవంతుడి పట్ల మనకుండే దృష్టి గూడా అవధుల్లేని అనవరతమైన, వ్యక్తిగతమైన రీతిలోనే వుండాలి.

సహజమైన ఆలోచనలను సజీవంగా వుంచుతూ పెంపొందింపజేయాలి. అలా జరగకుండా వాటిని నిరోధించే సంకుచిత సరిహద్దుల్ని తయారు చేసే వాళ్ళు తమ మత ధర్మ శాస్త్రాల బలపుకు సంతోష పడుతూ చివరకు మతాన్నే చంపేస్తారు....

నేను దేవుడ్ని ప్రేమిస్తాను; యెందుకంటే దేవుడు తనను నిరాకరించే స్వాతంత్రాన్ని నాకిచ్చినందుకే!

**–రవీంద్రనాథ్ ఠాగూర్**


方正集团
方正集团

"ఆమ్‌స్టర్‌డాం!... ఆమ్‌స్టర్‌డాం!!......" అంటూ లక్షాయాభై ఆరోసారి కలవరించాడు ధమ్మలాల్ చోప్రా.

నేను విసుగ్గా తలతిప్పిచూడగానే, అరమోడ్పుకళ్లను పూర్తిగా తెరిచి "అబీ దో గంటా బాకీ హై ! బాద్‌మే ఆమ్‌స్టర్‌డాం....వుస్‌కే బాద్ ఆమ్‌స్టర్‌డాంమే హెూనేవాలా అద్భుత్!" అని గాలివీచినప్పుడల్లా కణకణ మండే కార్చిచ్చులా వుద్వేగంతో వూగిపోసాగాడు దమ్మలాల్ చోప్రా.

కె.యెల్.యెమ్ 686 విమానం వేలఅడుగుల యెత్తులో యెగురుతోంది. విమానపు కిటికీలోంచీ మేఘాల దొంతరలు బుర్రాగుహలోపల కనిపించే స్టలక్టయిస్ దొంతరల్లా కనబడుతున్నాయి. అవును, స్టలక్టయిస్‌ను తెలుగులో యేమంటారు? సున్నపు శిలాజాలా? 'గుహ మొదలైన వాటిపైకప్పు నుంచీ నీటిబొట్లు రాలిపడగా యేర్పడిన సున్నపుచారలు' అని అర్థం చెబుతాడు సీపీ బ్రౌన్. యింగ్లీషులో స్టలక్టయిస్ అనేది వొకేవొకమాట! తెలుగులో చెప్పాలంటే యింత చాటభారతం రాయాలి. భాషఅనేది యెంత బలహీనమైనదో నిరూపించి చూపించాలంటే 'చాటభారతం' అనే మాటను యింగ్లీషులోకి అనువదించి చెప్పమంటే చాలు. అంటే యేమిటి? భాష అనేది గూడా వొక కాంప్రమెయిజ్. అంటే సర్దుబాటు. యిప్పుడు నేనీ దమ్మలాల్ చోప్రాతో కాలంతోయడంగూడా సర్దుబాటే!

కేవలం హిందీ మాత్రమే వచ్చిన దమ్మలాల్ చోప్రాతో కలిసి మెక్సికోకు వెళ్ళడానికి కారణం ట్రావెలింగ్ యేజెంటు గాబ్రియల్ ముండా గారే! నాకు వచ్చిన హిందీ అంతంతమాత్రమే! నా వుర్దూను వుత్తర భారతదేశం వాళ్ళు యెగతాళి చేస్తారని నాకు బాగా తెలుసు. మేమిద్దరమూ మాట్లాడుకుంటూంటే నోరుతిరగని యిద్దరు చిన్నపిల్లలు మాట్లాడుకుంటున్నట్టే వుంది. యిలా మేమిద్దరమూ వొకరితో వొకరు వేగడమే పెద్ద సర్దుబాటు. యి గొడవంతా మీకు చెప్పాలనుకున్నాను చూడండి. యిది అంతకంటే పెద్ద సర్దుబాటు. ఆ సర్దుబాటు మీరూ చేసుకోవాలనుకుంటున్నాను చూడండి. అది మరీమరీ పెద్ద సర్దుబాటు. అవతల దమ్మలాల్ చోప్రాదేమో హిందీ.... నేనేమో సగం తెలుగూ, సగం యింగ్లీషూ.... మేము వెళ్తున్న మెక్సికో దేశంలో ప్రజలుమాట్లాడేది స్పానిష్.... యీదమ్మలాల్ చోప్రా కలవరిస్తున్న ఆమ్‌స్టర్‌డాంలో యేభాష మాట్లాడతారో నాకు తెలియదు. యిప్పుడు మాతోబాటూ ప్రయాణంచేస్తున్న యీ ప్రయాణీకులు యేయే భాషల వాళ్ళో వేరేవాళ్ళకు తెలియదు. వాళ్ళు మాట్లాడే భాషల్ని యధాతథంగా యేకసంతాగ్రాహిలాగా మీకు తిరిగీ వల్లించానే అనుకోండి. అప్పుడీ ప్రయాణం మొత్తం కిచిడీలా తయారౌతుంది. పర్వాలేదు, కిచిడీ గూడా రుచిగానే వుంటుందంటారా! కృతజ్ఞతలు మీకు! మీలాంటి వారికోసమనే యిలా చెప్పడం మొదలుపెట్టాను నేను.

సర్దుబాటును గురించిగదా చెబుతున్నాను. మళ్లీ అక్కడికే వస్తాను.

యీ కె.యెల్. యెమ్ విమానం పదిగంటలక్రితం మెక్సికో సిటీనుంచీ బయల్దేరింది గదా! అప్పుడు అక్కడి సమయం సాయంత్రం 7 గంటలా 45 నిమిషాలు. మేము మెక్సికోసిటీ నుంచీ ఆమ్‌స్టర్‌డాం చేరాలంటే పదిన్నర గంటలు ప్రయాణం చేయాలని మా టికట్టే చెబుతోంది. అంత సమయమూ ప్రయాణం చేసినా, మేము ఆమ్‌స్టర్‌డాం చేరేసరికి అప్పుడక్కడ సమయం మధ్యాహ్నం వొకటిన్నరయివుంటుందట! యిలా యిదే భూగోళం పైన వొకే సమయంలో, వేర్వేరు ప్రాంతాల్లో, వేర్వేరు ప్రాంతీయ సమయాలుంటాయన్న సంగతి యీ విమాన ప్రయాణం తర్వాతే నాకు తెలిసివచ్చింది.

యిప్పుడీ విమానంలో నాలుగైదు వందలమంది ప్రయాణికులు, యీ యిరుకిరుకు కుర్చీల్లో వాళ్ళ పాంట్లూ డ్రస్సులూ అరిగిపోయేటట్టుగా కూర్చున్నారు గదా! మేము మెక్సికోలో బయల్దేరిన తర్వాతోసారీ, యిప్పటికి గంటక్రితమొకసారీ యెయిర్‌హొస్టెస్‌లు మాచేత నానా చెత్తా తినిపించారు గదా! గతవారం మేము మెక్సికో నగరానికి అతిథులుగా అక్కడ చెడతిరిగాం గదా! అక్కడ మమ్మల్ని ఆదరించిన మనుషుల్నిగానీ, మార్గాయాసం మరిచేలా వినోదాల్ని యేర్పాటుచేసిన సంస్థల్నిగానీ, యిప్పుడీ దమ్మలాల్ చోప్రా తలచుకోవడం లేదు. మొహమాటపడకుండా యీ విమానంలో యెయిర్ హొస్టెసుల దగ్గరి నుంచీ అడిగి తీసుకున్న స్కాచ్ పెగ్గులు గూడా యితడికిప్పుడు జ్ఞాపకం రావడంలేదు. లోపల యిబ్బందేపడుతున్నా, పైకి కాగితంపువ్వుల్లాంటి నవ్వుల్ని చిందిస్తున్న యెయిర్‌హొస్టెస్‌లనూ యితను పట్టించుకోవడం లేదు. యింతకూ ఆమ్‌స్టర్‌డాం విమానాశ్రయమనే దొకటుందని యితడికి పదిరోజుల క్రితం వరకూ తెలియనే తెలియదు. అసలు ఆ ఆమ్‌స్టర్‌డాం అనే నగరం నెదర్లాండ్ అనే దేశానికి రాజధాని అనిగూడా దమ్మలాల్ చోప్రాకు తెలిసే అవకాశం లేదు.

"అవుర్ తోడీ సమయ్ బాకీహై... బాద్‌మే ఆమ్‌స్టర్‌డాం.... వహా క్యాహోగా కిస్‌కోబీ నై మాలూమ్.... సిర్ఫ్‌మేరే బినా...." కుర్చీలో నిటారుగా కూర్చుని, ముఖంలో యేదో తెలియని వుత్సాహం వెలిగిపోతూండగా దమ్మలాల్ చోప్రా పలవరించాడు.

ఆమ్‌స్టర్‌డాంలో యేం జరగబోతోంది?

యింతకూ యీ దమ్మలాల్ చోప్రా మొదటిసారి 'ఆమ్‌స్టర్‌డాం' పేరు విన్నదెప్పుడు?

# 1

"ఆమ్‌స్టర్‌డాం... ఆమ్‌స్టర్‌డాం!" అంటూనే తలపైకెత్తి నాకేసి తిరిగి, యింతలో చేతిలోని మంచినీళ్ల సీసా జారి కిందపడడంతో వులిక్కిపడి బెంబేలు పడుతూ, కళ్లార్పడం సైతం మరచిపోయి, కిందపడిన సీసాలోంచీ నేలపైకి బుడుంగు బుడుంగుమని పొర్లిపోతున్న నీటికేసి, భయం భయంగా చూడసాగాడతను.

ఢిల్లీ యిందిరాగాంధీ యింటర్నేషనల్ విమానాశ్రయం ప్రయాణికులతో కిటకిట లాడిపోతోంది. విద్యుద్దీపాలు సృష్టించిన కృత్రిమ పగటి వెలుతురులో యెయిర్‌లైన్సు కౌంటర్లూ, వాటి ముందున్న స్టాల్సూ రంగురంగుల్లో మెరుస్తున్నాయి. సంపద సృష్టించిన వుత్సాహ వాతావరణంలో డబ్బుతిని బలంగా తయారైన మనుషులందరూ ఆరోగ్యంగా నవనవలాడుతున్నారు.

"హీయిజ్ మిస్టర్  దమ్మలాల్ చోప్రా... హీయిజ్ యువర్ ఫెలో పాసింజర్..... హీయిజ్ ఆల్సో కమింగ్ విత్ యూ టూ మెక్సికో...." అంటూ అతడిని పరిచయంచేశాక "హీయిజ్ ప్రొఫెసర్ గుర్రపురౌతు ఫ్రం అనంతపూర్, ఆంధ్రప్రదేశ్..." అని నన్నతడికి పరిచయంచేశాడు, తామస్ కుక్ ట్రావెల్స్ వుద్యోగి గాబ్రియల్ ముండా.

"గ్లాడ్‌టూ మీట్యూ ...." అని నేను చేయిచాపుతున్నా పట్టించుకోకుండా, సీసాలోంచీ నేలపైకి పారుతున్న నీటిజాలునే చూస్తూ "ఆమ్‌స్టర్‌డాం... ఆమ్‌స్టార్‌డాం" అని పలవరిస్తున్నాడు దమ్మలాల్ చోప్రా.

గాబ్రియల్ ముండా మాయిద్దరి చేతుల్నీ తన రెండుచేతులతో పట్టుకుని, అవతలి వైపున్న వెయిటింగ్ పార్లర్ దగ్గరికి లాక్కెళ్ళాడు. దమ్మలాల్‌చోప్రానో కుర్చీలోకి తోసి "ఐవిల్ టేక్ టెన్ మినిట్స్ టూ యెక్స్‌ప్లెయిన్ యువర్ టూర్ యిటినరీ...." అని మొదలు పెట్టాడు. యింకా నేలపైకి వొలికిన నీటినే చూస్తున్న దమ్మలాల్ చోప్రాను పట్టించుకోకుండా "ఆఫ్టర్ నూన్ 12.50 పి.యం. యువర్ కె యెల్ యెమ్ 872 డిపార్చర్" అంటూ రికార్డయిన విషయాల్ని మీటనొక్కగానే వినిపించే టేపురికార్డరులా యాంత్రికంగా యింగ్లీషులో చెప్పుకుపోసాగాడతను. మా కె యెల్ యెమ్ 872 విమానం యింకాస్సేపటి తరువాత యిక్కడ బయల్దేరి, దాదాపు 8.30 గంటల తర్వాత ఆమ్‌స్టర్‌డాం స్కిపోల్ విమానాశ్రయంలో దిగుతుంది. అప్పుడక్కడి తేదీ అగష్టు 22, సమయం వుదయం 5.50 గంటలు. అక్కడో ఆరు గంటలు గడిపాక, అంటే అక్కడి ప్రాంతీయ సమయం మధ్యాహ్నం 12.30 గంటలకు కె యెల్ యమ్ 685లో మేం మెక్సికోకు బయల్దేరతాం. 11.30 గంటలు యేకధాటిగా ప్రయాణం చేశాక, మా విమానం, ఆగష్టు 22వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు మెక్సికోను చేరుతుంది. మా తిరుగు ప్రయాణం ఆగష్టు 28వ తేదీన, అంటే సరిగ్గా యెనిమిదిరోజుల తర్వాత నన్నమాట! తిరుగుప్రయాణంలో కె యెల్ యెమ్ 686 విమానం మెక్సికో సిటీ నుంచీ బయల్దేరి, 10.35 గంటల ప్రయాణం తర్వాత ఆమ్‌స్టర్‌డాం స్కిపోల్ విమానాశ్రయానికి, అక్కడి ప్రాంతీయ సమయం 1.30 గంటలకు వచ్చిచేరుతుంది. ఆ మధ్యాహ్నం నుంచీ మరునాటి మధ్యాహ్నం 11.30 వరకూ అక్కడ వేచివుండాలి. ఆ తర్వాత ఆగష్టు 30వ తేదీ 11.30 గంటలకు కె యెల్ యెమ్ 871లో మేంఢిల్లీకి తిరిగొస్తాం. అవీ మా ప్రయాణపు వివరాలు.

నేలపాలయిన సీసానీళ్లకోసమే యింకా వగస్తూన్న దమ్మలాల్ చోప్రాతో "మీరు ఆయన మాటల్ని జాగ్రత్తగా వినాలి. యీ విషయాలన్నీ నాకాయన నిన్న వాళ్ళ ఆఫీసుకెళ్ళి నప్పుడోసారి వివరంగా చెప్పాడు. మీరు నేరుగా విమానాశ్రయంలోనే కలుసుకోవడం వల్ల యిప్పుడు హడావుడిగా చెబుతున్నాడు. ఆయన చెబుతున్నదాన్నిబట్టి, మనం మన తిరుగుప్రయాణంలో ఆమ్‌స్టర్‌డాం యెయిర్‌పోర్టులో యిరవై రెండుగంటలు వెయిట్ చేయాలి. అక్కడినుంచీ వూళ్లోకి వెళ్లేందుకు మనకు వీసాలేదు. ఆదేశపు వీసాలేకపోతే, ఆ యెయిర్‌పోర్టులో వుండే హొటళ్ళలో గూడా మనకు రూము లివ్వరు. అంటే మనం అంత సమయమూ పాసింజెర్ల లౌంజ్‌లోనే గడపాలి..." అన్నాను నాకొచ్చిన అరాకొరా హిందీలో.

దమ్మలాల్ చోప్రా నేలపైన్నుంచీ చూపుల్ని మరల్చకుండా "దేఖో... ముజ్‌కో యేబాత్ మాలూమ్.... ఆమ్‌స్టర్‌డాంమే జరూర్‌సే కుచ్ హొనేవాలా!.... కోయీ అద్భుత్ నికలేగా!" అన్నాడు.

టికెట్లతో బాటూ విదేశీ కరెన్సీనీ అతడికిచ్చాక "యూహావ్‌టూ పేమీ ఫైవ్ తౌజాండ్..." అన్నాడు గాబ్రియల్ ముండా.

దమ్మలాల్ చోప్రా బిక్కమొగమేసుకుని, గాలిలో తారట్లాడుతున్నట్టున్న చూపుల్ని గాబ్రియల్ ముండాకేసి తిప్పాడు. తన పొడవాటి జుబ్బాపైన తగిలించుకున్న నీలిరంగు సంచిలోంచీ పర్సుతీసి, గాజుకళ్ళతోనే డబ్బుల్ని లెకబెట్టాడు. గాబ్రియల్ ముండా డబ్బులు లాక్కుని "రిమయినింగ్ డీటయిల్స్ ఆర్ ఆబియస్... కంటాక్ట్ హెల్ప్‌డెస్క్ వెనెవర్ యూనీడ్.... ఐవిష్ యూ బోత్ యేప్లెజెంట్ ట్రిఫ్... బోన్‌వాయేజ్..." అని వీడ్కోలు మాటలు వల్లించి, వెనుదిరిగి, బూట్లు టకటకలాడించుకుంటూ వెళ్ళిపోయాడు.

చోప్రా నీళ్ళు తిరుగుతున్న కళ్ళను నాకేసి తిప్పి, తడారిపోయిన పెదవుల్ని నాలుకతో తడుపుకుని "ఆమ్‌స్టర్ డాం... ఆమ్‌స్టర్‌డాం..." అన్నాడు.

"న్యూమెక్సికో యూనివర్సిటీ వాళ్ళు నాపేపరును సెమినారుకు ఆక్సెప్ట్ చెయ్యగానే, వీసాటికెట్లకోసం తామస్ కుక్ ట్రావెలర్స్‌ను కాంటాక్టు చేశాను. వారం తర్వాత వాళ్ళ ట్రావెలింగ్ యేజెంటు, యీ గాబ్రియల్ ముండా, నాలాగే మెక్సికో సెమినారుకు జైసల్మీర్ నుంచీ యింకో ప్రొఫెసరు గూడా వస్తున్నాడని చెప్పాడు. దేశంగాని దేశంలో మన దేశస్థుడొకడు తోడు దొరకడమంటే అదృష్టమే గదా! వెంటనే ఆవ్యక్తితో బాటూ నాటికెట్‌ను అదే ఫ్లయిట్‌లో యేర్పాటు చెయ్యమన్నాను. యీ ముండా చూసిరమ్మంటే కాల్చివచ్చేరకం. యేదో కన్సెషను వస్తోందని మన యిద్దరికీ జాయింట్ టికెట్ తీసేశాడు." అంటూ చోప్రాకు వివరాలు చెప్పాక" యింతకూ మీరు జైసల్మీర్‌లో యే యూనివర్సిటీలో పనిచేస్తున్నారు?" అని అడిగాను.

“నై బాయ్! మై టీచింగ్‌మే నైహూ! మై బ్యాపార్ మేహూ!” అన్నాడు దమ్మలాల్ చోప్రా నీరసంగా.

యూనివర్సిటీల్లో ప్రొఫెసరుగావుండే వ్యక్తికి, అంతర్జాతీయ సెమినార్లలో పరిశోధనా పత్రాలు సమర్పించడం చాలా అవసరం. ప్రతి సంవత్సరమూ యెన్ని పరిశోధనా పత్రాలనలా చదివారో, యెన్ని ప్రముఖ పత్రికల్లో వ్యాసాలు ప్రింటయ్యాయో లెక్కచెబితేనే ప్రమోషన్లుంటాయి. అందువల్ల వాళ్ళు చచ్చినట్టుగా యీ అంతర్జాతీయ సెమినార్లెక్కడ జరుగుతున్నాయో యింటర్నెట్‌లో తెలుసుకుని, వాళ్ళ ఆమోదం తెలిపాక ఖర్చులకోసం యూనివర్సిటీ అధికారుల కాళ్ళుపట్టుకుని, వాళ్ళు కొంత డబ్బులిచ్చినప్పుడు మిగిలిన ఖర్చులకు స్వంత డబ్బుల్నే వాడుకుని, విదేశాలకెళ్ళి సెమినార్లకు హాజరవుతూంటారు. నేను గూడా యిలాగే యూన్యూమెక్సికో యూనివర్సిటీలో జరుగుతున్న అంతర్జాతీయ బిజినెస్‌మానేజ్‌మెంటు సెమినారుకు బయల్దేరిన వాణ్ణే ! కానీ స్వంతంగా వ్యాపారం చేసుకుంటున్న చోప్రాలాంటి వ్యక్తి యిలా సెమినార్లకు అష్టకష్టాలూపడివెళ్ళడం ఆశ్చర్యంగానేవుంది. యితడి ఖర్చులనెవరు భరిస్తున్నారు? ఆ సంగతే అడిగాను.

దమ్మలాల్ చోప్రా జైసల్మీర్ యూనివర్సిటీలో పదేళ్ళక్రితం యెంబియ్యే చదివాక, స్వంతవ్యాపారం ప్రారంభించాడట! వ్యాపారం చేస్తూనే యెంబియ్యేలో పీహెచ్డీ చేశాడట! సబ్జెక్టును మరచిపోగూడదని అప్పుడప్పుడూ సెమినార్లకు వెళ్తూంటాడట! పదడుగుల దూరంలో నేలపైన పడిన నీళ్ల సీసానే చూస్తూ, యిది తనకు మొదటి విదేశీ ప్రయాణమనీ, యిలా విదేశీ సెమినారుకెళ్ళాలనే కోరిక తనకు రెండేళ్ళకు ముందెందుకో పుట్టిందనీ, తామస్ కుక్‌ట్రావెల్స్‌లో వుండే ఫ్రెండొకడు యీ యేర్పాట్లన్నీ చేశాడనీ, యిలా మొదటిసారిగా తాను విమాన మెక్కబోతున్నప్పుడు నీళ్ళు నేలపైకి వొలికిపోతాయని తానసలు వూహించనయినా వూహించలేదనీ చెప్పుకొచ్చాడతను.

నీళ్ళుతాగకుండా మనుషులెవరూ జీవించలేరు గదా! నీళ్ళుతాగుతున్నప్పుడు చేతిలోని సీసానో, గ్లాసో జారి కిందపడడం సామాన్యంగా జరుగుతూనే వుంటుంది గదా! దీనికోసం అంతగా కంగారుపడాల్సిన అవసరమేముంది?

తనకు రెండు రోజులుగా కలలో సంకేతాలేవో అందుతున్నాయట! నీళ్ళు వొలికి పోయే సమయంలో వినబడే కొత్త శబ్దంపైన ధ్యాసపెట్టమని ఆ సంకేతాలు మార్మికంగా చెబుతున్నాయట! అలా నీళ్ళు వొలుకుతున్నప్పుడు తాను విన్నమాట ‘ఆమ్‌స్టర్‌డాం’ అట! అందువల్ల ఆమ్‌స్టర్‌డాంలో యేదో అద్భుతం జరగబోతోందని దమ్మలాల్ చోప్రా వుద్వేగంతో రొప్పుతూ చెప్పాడు.

కలలో సంకేతాలు రావడమూ, ఆ సంకేతాలు నిజజీవితంలో అద్భుతాల్ని తేవడమూ, యిదంతా బిజినెస్ మానేజ్‌మెంటులో డాక్టరేటున్న విద్యావంతుడు చెప్పాల్సిన మాటలా చెప్పండి! యిటువంటి వ్యక్తితో కలిసి విదేశాలకు వెళ్తే నాగతేమవుతుంది?

విమానాశ్రయంలోకి వస్తున్న ప్రయాణికులందరూ తమతమ లగేజీలతో బాటూ స్కానింగ్ మిషన్ల ముందు వరసగా నిలబడుతున్నారు. యెయిర్‌లైన్స్ కౌంటర్లలోని ముదురు రంగు యూనిఫారాల వుద్యోగినుల ముందు రకరకాల ప్రయాణికులు తమ ట్రాలీ సూట్‌కేసుల్ని లాక్కుంటూ క్యూలో కదులుతున్నారు. చిత్రమైన రంగులదుస్తులతో యెయిర్‌హెూస్టెస్‌లూ, పైలట్లూ అక్కడక్కడా రంగుయీకల పక్షుల్లా సాగిపోతున్నారు. యెక్కడి నుంచో వెలువడుతున్న ప్రకటనలు స్పీకర్లెక్కడున్నాయో తెలుసుకొమ్మని సవాలుచేస్తున్నాయి.

“ముజ్‌కో చాయ్ పిలానా బాయ్! యేక్ సిగరెట్‌బీ పిలానా!” అన్నాడు దమ్మలాల్ చోప్రా నేల చూపులు చూస్తూ.

యీ విమానాశ్రయంలో టీ యాభైరూపాయలూ, సిగరెట్టుపెట్టె రెండు వందల రూపాయలూ అని చెప్పాను.

“గాడ్! ముజ్‌కో యితనా మజదార్ టీనక్కో.... క్యాకర్నా?” అతనిప్పుడే అక్కడినుంచీ కదిలేలాలేదు.

నేను విసుగ్గా ముందుకొచ్చి స్కానింగ్ మిషనుదగ్గర నిల్చున్నాను. నా సూట్‌కేసు స్కానింగ్ మిషన్లోంచీ యివతలికిరాగానే, దమ్మలాల్ చోప్రా సూట్‌కేసు మిషను పైకెక్కడం గమనించాను.

నేను కె.యెల్.యెమ్. కౌంటరుముందు కెళ్ళి నిల్చున్న కాస్సేపటికే అతనూ నావెనకకొచ్చి నిల్చున్నాడు. మా జాయింట్ బోర్డింగుపాసును తీసుకుని నేను పక్కకొచ్చినిల్చున్నాను. ముఖంనిండా ఆరని తడిమేకప్పుతో అప్పుడే గుడ్డు పగలగొట్టుకుని బయటికొచ్చిన కోడిపిల్లలాగున్న కౌంటర్లోని వుద్యోగిని బలవంతంగా నవ్వి “పాస్‌పార్ట్ .... టికెట్....” అంది. చోప్రా టూత్‌పేస్ట్ ప్రకటన కోసమన్నట్టుగా పల్లికిలించాడు. సిగరెట్ పొగల సాహచర్యంతో నల్లటి అంచుల్ని సంతరించుకున్న అతడి పలువరసను చూసి బయపడిపోయినట్టుగా “వీసా... పాస్‌పోర్టు.... టికెట్” అని అరిచిందామె. కౌంటరు పక్కనున్న వుద్యోగి చోప్రా చేతిలోని సూట్‌కేసును లాక్కుని, బరువును కొలిచాక, కన్వేయర్ బెల్ట్‌పైకి గిరవాటేశాడు. అది వెనక్కు వెళ్ళిపోతూండగా “మేరీ సూట్‌కేస్... మేరీ సూట్‌కేస్” అంటూ పెద్దగా ఘోషించాడు చోప్రా.

“డోన్ట్‌వర్రీ సార్! యూకెన్ కలెక్ట్‌యిట్ యిన్ మెక్సికో...” అని సముదాయిస్తూ చోప్రాచేతికి పాస్‌పోర్టు నందించిందా కౌంటర్లోని రంగుల అమ్మాయి. నేనతడ్ని బలవంతంగా వెయిటింగ్ పార్లర్‌కు లాక్కెళ్ళాను. అక్కడ కూచున్నాక గూడా “మేరీ సూట్‌కేస్... మేరీసూట్‌కేస్” అని విలపించసాగాడు చోప్రా.

మంచీ నీళ్ళ సీసానుంచీ అతడి దృష్టిని తప్పించిన లగేజీ బెల్టుకేసి నేను కృతజ్ఞతతో చూస్తూండగా, అవతలికుర్చీలో కూర్చున్న పాతికేళ్ళ యువకుడు “మీ సూట్‌కేసునిప్పుడు వాళ్ళు మీ విమానంలోకి తీసుకెళ్తారంకుల్! మీరు మీరెళ్ళాల్సిన యెయిర్‌పోర్టులో దిగాక, లగేజీ కలెక్టు దగ్గరికెళ్ళి తిరిగీ తీసుకుంటారు. దానికి మీ పేరూ, టికెట్టు నెంబరూ రాసిన పేపరు బాండు తగిలించారు గదా! యికదాన్ని మీరు తప్ప యింకెవ్వరూ తీసుకోరు. యిక మీరు బేఫికర్‌గా వుండొచ్చు...” అని హిందీలో వివరించాడు.

కన్వేయరు బెల్టుపైన్నే దూరంగా వెళ్ళిపోయన తన చూపుల్ని బలవంతంగా వెనక్కు లాక్కున్నాక “తుమ్ పూనాసే ఆయాక్యా? తుమ్‌హారా దక్కనీ హిందీ బహుత్ మీటా లగ్ తాహై బాయ్!” అన్నాడు దమ్మలాల్ చోప్రా.

“నేను పూనాలో రెండేళ్ళు వుద్యోగంచేశానంకుల్! యిప్పుడు ఆమ్‌స్టర్‌డాంలో వుద్యోగం... ఐటీ వుద్యోగాలంటే యిప్పుడు దేశాంతరాలకెళ్ళడమే గదా! మాది ఆంధ్రప్రదేశ్... నాది విజయనగరం జిల్లా సాలూరు. నాపైరు చైతన్య” అంటూ ఆ యువకుడు తనను పరిచయం చేసుకున్నాడు.

“మేమిద్దరమూ న్యూమెక్సికో యూనివర్సిటీలో జరగబోయే సెమినార్లో పేపర్లు ప్రజెంటుచేయడానికి బయల్దేరాం... యీ ధర్మపాల్ చోప్రా జైసల్మీర్‌లో బిజినెస్ చేస్తూంటాడు” అని నేనూ మాపరిచయం మొదలుపెట్టాను.

“ధర్మపాల్‌నై బాయ్! దమ్మలాల్.... దమ్మలాల్ చోప్రా!” అంటూ దమ్మలాల్ చోప్రా నన్ను సవరించాడు.

అతడి మాటలు వినిపించుకోకుండా “మీరూ తెలుగువాళ్ళేనా అంకుల్!” అంటూ చైతన్య కేరింతలుగొట్టాడు. యీ కుర్రాడింకా యిండియాను వదల్లేదు. అప్పుడే తెలుగువాడొకడు తగిలే సరికి సంబరపడిపోతున్నాడు.

అతడిపక్కన కూచున్న యువకుడు నా ట్రాలీ సూట్‌కేసు పైనున్న నాపేరు చదివి “గుర్రపురౌతు..... అదేనా పేరు? అదేంపేరంకుల్!” అని ఆశ్చర్యపోయాడు.

పాంటూ షర్టూ తొడుక్కున్న జిరాఫీలాగున్న ఆ పొడవాటి యువకుడికేసి చికిలి “చూపులు చూస్తూ” చాలా రేర్ నేమ్‌కదా! గుర్రంకొండ గుర్రపురౌతు.... అదీ నాపూర్తి పేరు...... మాయింటిదేవుడి పేరది” అన్నాను.

చైతన్య పది నిముషాలు గడిచేలోగా తనను గురించిన వివరాలన్నీ చెప్పేశాడు. అతను మూడువారాల సెలవుపైన స్వంత వూరికొచ్చాడు. పదిరోజుల క్రితం అతడికి పెళ్ళయింది. సెలవు పూర్తవగానే మళ్లీ ఆమ్‌స్టర్‌డాంకు బయల్దేరాడు. అతడిపెళ్ళికి ఆమ్‌స్టర్‌డాంలో పనిచేస్తున్న స్నేహితులు అయిదుమంది వచ్చారు. వాళ్ళు గూడా

యిప్పుడు అతడితోబాటూ వస్తున్నారు. సంవత్సరానికొకటి రెండుసార్లు యిలా విమాన ప్రయాణాలు చేయడంవల్ల వాళ్ళకీ యెయిర్‌పోర్టు తతంగాలన్నీ కొట్టిన పిండయి పోయాయి. యిప్పుడు వాళ్ళందరూ బోర్డింగు పాసులు జేబులోపెట్టుకుని యెయిర్‌పోర్టులో చక్కర్లు గొడుతున్నారు.

"బాప్ రే! తుమ్‌హారీ షాదీ హెూకర్ దస్‌దిన్ హెూగయాక్యా?" అని దమ్మలాల్ చోప్రా కంగారు పడ్డాడు.

"మీ పెళ్ళెప్పుడయ్యిందంకుల్" అని అడిగాడు చైతన్య హిందీలో.

"యెయిటీ నైన్‌మే!" అన్నాడు చోప్రా

"పది రోజుల శిక్ష అనుభవించిన నన్ను చూసి మీరంత పెద్దగా జాలిపడితే, పదహా రేళ్ళుగా యిదే పనిష్మెంటులో వుండే మిమ్మల్ని చూసి నేను యింకెంత పెద్దగా జాలిపడాలి?" అని రెట్టించాడు చైతన్య.

చోప్రా మరింతగా కంగారుపడుతూ తాను పెళ్ళిని పనిష్మెంటని అనలేదనీ, పెళ్ళ యిన పదిరోజులకే పెళ్ళాన్ని విడిచిపెట్టవలసి రావడమంటే కష్టంగదా అని బాధపడు తున్నాననీ సంజాయిషీ చెప్పాడు.

"పదిరోజుల సర్వీసుండే పెళ్ళాన్ని విడిచిపెట్టిరావడంకంటే పదిహేను సంవత్సరాల సర్వీసుండే భార్యను విడిచిపెట్టిరావడం యెక్కువ కష్టమైన పని గదా!" అంటూ చైతన్య మరోసారి ముట్టడించాడు. తోటితెలుగువాడి తెలివితేటలను మెచ్చుకుంటూ నేను అతడి భుజం చరచాను.

కె యెల్ యెం 872కు చెకిన్ ప్రారంభమవుతోందని ప్రకటించారు. లాప్‌టాప్ సంచుల్ని తగిలించుకున్న చైతన్య మిత్రులందరూ పెద్దగా నవ్వుకుంటూ వూడిపడ్డారు. పాతికేళ్ళక్రితం వొకపల్లెటూరి నుంచీ టిఫెనుకారియరు చేతబట్టుకుని ప్రతిరోజూ రైలెక్కి పదిమైళ్ళ దూరంలోవుండే టవునుకెళ్ళి చదువుకున్నాను నేను. అప్పుడు నేనూ, నాస్నేహితులూ పడినంత హడావుడిగూడా యీ ఐటీ యింజెనీర్లలో కనిపించడంలేదు.

కాలేజీలో రాగింగ్ చేసే సీనియర్ల వెంట బయపడుతూ వెళ్ళే జూనియర్ విద్యార్థుల్లా, ఐటీ యింజెనీర్లవెంట వెళ్ళి చెకిన్ క్యూలో నిల్చున్నాము మేమిద్దరమూ. సెక్యూరిటీ ఫ్రేముదగ్గరికొచ్చాక చైతన్య నంటిపెట్టుకున్నట్టుగా ముందుకెళ్ళిన చోప్రాతో "వహా ఠైరో..." అనిహుంకరించాడు తనకీ చేస్తున్న కాకీదుస్తులవుద్యోగి. చోప్రా అక్కడే ఆగిపోయి దీనంగాచూడసాగాడు.

"పీచేజావ్..." అని సెక్యూరిటీ వుద్యోగి గర్జించాడు. ఆఫీసరు చోప్రా భుజం పట్టి వెనక్కులాగి, సెక్యూరిటీ ఫ్రేము ముందున్న పసుపు గీతకేసి చేయిచాపి చూపెట్టాడు.

లక్ష్మణరేఖలా పాకుతున్న పసుపుగీతకేసి బెదరురుచూపులు చూస్తూ నిలబడ్డాడు చోప్రా. యీలోగా చైతన్యను తనకీ చేసి అవతలికి పంపిన సెక్యూరిటీ వుద్యోగి, యింకా గీత కవతలే నిల్చున్న చోప్రాకేసి కోపంగా చూస్తూ "కమాన్.... క్విక్" అని గద్దించాడు. లేడి పిల్లలా తడబడుతూ అడుగులేస్తున్న చోప్రా చేతిలోని మంచినీళ్ళ సీసాను తీసి, పక్కనున్న అట్టపెట్టెలోకి విసిరేశాక, అతను తగిలించుకున్న సంచిని లాగి స్కానింగ్ మిషను ముందున్న ట్రేలోకి గిరవాటేశాడు సెక్యూరిటీ వుద్యోగి.

"మేరీ వాటర్ బాటిల్" అని ఆక్రోశించాడు దమ్మలాల్ చోప్రా.

"యిప్పుడు నీళ్ళ సీసాలను గూడా అనుమతించడంలేదంకుల్!" అంటూ చెకిన్ కవతలి నుంచీ సమాచార మందించాడు చైతన్య.

"వుస్ మే పానీ పూరాహై!" అంటూ అట్టపెట్టెలోని రకరకాల సీసాల మధ్య తప్పిపోయిన తన నీళ్ళసీసాను చూపులతోనే వెదుక్కోసాగాడు చోప్రా.

చేతులుచాపి "స్టాండ్ అట్ యీజ్" భంగిమలో నిల్చోమని సైగచేసి చూపెట్టాక, చోప్రా జేబులనూ, దుస్తులనూ, బెల్టునూ తనికీ చేశాడు సెక్యూరిటీ వుద్యోగి. అతడి తర్వాత తనికీ చేయించుకుని వెళ్ళిన నన్నుచూసి "తుమ్ బహుత్ చలాకీ హైభయ్యా!" అని వాపోయాడు చోప్రా. చెకిన్‌కు అవతలే సీసాలోని నీళ్ళన్నీ తాగేసి వచ్చిన నాకు అభ్యంతరం చెప్పలేదు గానీ, అలాంటి సీసాతో అలాంటి నీళ్ళనే యివతలికి తీసుకురా బోయిన తనను అటకాయించడం న్యాయం గాదని అతను వాదించసాగాడు. పదహైదు రూపాయల నీళ్ళు! కడుపులో తేవడానికి లేని అభ్యంతరం, సీసాలో తేవడానికెందుకని చోప్రా లాపాయింటు లాగాడు.

"మీరు నీళ్ళసీసాకే అంత బాధపడితే యెలాగంకుల్! అక్కడ టేబులుపైన పడేసిన సామాన్లన్నీ చూడండి! అవన్నీ పాసింజెర్ల దగ్గరి నుంచీ లాగి పడేసినవే!" అన్నాడు చైతన్య.

స్కానింగ్ మిషను కవతలున్నటేబులుపైన ట్రేనిండా స్టీలుకత్తెరలు చచ్చిన చేప పిల్లల్లా నీల్గిపడివున్నాయి. వాటికటు వైపున టూత్ పేస్టులూ, మందుల ట్యూబులూ, పొడవాటి బాడీస్ప్రేడబ్బాలూ దిక్కులేకుండా పడివున్నాయి.

చెకిన్ కివతలున్న వెయిటింగ్ పార్లర్‌కు వచ్చాక "యిప్పుడివేవీ తీసుకొని రాగూడదంకుల్! సెప్టెంబరు 11తర్వాత సెక్యూరిటీ బాగా టయిటయిపోయింది. యిదంతా బిల్ లాడెన్ మహత్యం! యిప్పుడు టూత్ పేస్టు ట్యూబుల్లో గూడా బాంబులు తయారు చేసే కెమికల్స్ పట్టుకెళ్తున్నారట!... అందుకని..." అని వివరించాడు చైతన్య.

స్కానింగ్ మిషను దగ్గరి వస్తువులనే చూస్తూ, ఆ వస్తువులన్నింటినీ సెక్యూరిటీ వాళ్ళు అమ్ముకుని డబ్బు చేసుకుంటారని దమ్మలాల్ చోప్రా వాపోయాడు. అక్కడి

అట్టపెట్టెను తడిపేస్తున్న మంచినీళ్ళ సీసాకేసి బాధపడిపోతూచూసి "ముజ్‌కో అచ్చా మాలూమ్! వహీమేరా పానీహై... పానీ గిరానా బహుత్ బురా సంకేత్..... హమ్‌కో క్యాహెూగా భగవాన్!....." అని గింజుకోసాగాడు.

"సెప్టెంబర్ పదకొండు దెబ్బతో అమెరికా హడలిపోయిందంకుల్! వరల్డ్‌ట్రేడ్ సెంటర్ టవర్సును యెక్స్‌ట్రీమిస్టులు కూల్చేసినప్పటినుంచీ తొమ్మిదీ, పదకొండూ నెంబర్లంటే గూడా బెదిరిపోతున్నారు. యెక్స్‌ట్రీమిస్టులిప్పుడు యెయిర్‌పోర్టులనూ, ఫ్లయిట్‌లనూ వోచూపుచూస్తున్నారు. అక్కడక్కడా బ్లాస్టులు జరిగి పాసింజర్లు పాపం చచ్చిపోతున్నారు. యిప్పుడెక్కడ చూసినా జనమంతా వొకటే జపం... బిన్ లాడెన్ బిన్ లాడెన్ అని. ఆమ్‌స్టర్‌డాంలో అయితే యిప్పుడు సెక్యూరిటీ రూల్సు బాగా యెక్కువై పోయాయి" అన్నాడు చైతన్య పరవశంగా.

"మధ్యలో యీ బిన్‌లాడెన్ యెవడు? మనజోలికెందుకొస్తున్నాడు అనవసరంగా! యింకేమీ పనిలేదా ఆమనిషికి?" అని అడిగాను కంగారుతోనూ, విసుగుతోనూ.

"ఆయన పనేయిది అంకుల్" అన్నాడు చైతన్య మరింతగా నవ్వుతూ. "ఆయినెవరను కున్నారు మీరు? ఆల్‌ఖయిదా లీడరు. ఆఫ్ఘనిస్థాన్‌లో వుందట ఆయన డెన్.... యిస్లాం రాజ్యాలన్నీ కప్పంగట్టినట్టుగా ఆయనకు డబ్బులు పంపిస్తారట! ప్రపంచమంతా యిస్లాం రాజ్యాన్ని తయారు చేయడమే ఆయన గోల్! ఆయనదారి కడ్డంతగిలే వాళ్ళనంతా, వాళ్ళు ముస్లిములయినా సరే, కాల్చిపారేయడమే వాళ్ళపని. దాన్ని వాళ్ళు జిహాద్ అంటారటలెండి! ప్రపంచంలోవుండే అన్ని దేశాల వ్యవహారాల్లోకీ తలదూర్చేదెవరు? అమెరికానే గదా! తమ దేశాల గొడవల్లోకి కలగజేసుకుందని లాడెన్ యిప్పుడు అమెరికానే టార్గెట్‌చేసుకున్నాడు. సెప్టెంబర్ 11 తర్వాత అమెరికా వులిక్కిపడి బిన్ లాడెన్ కోసం గాలించిపారేస్తోంది. యెయిర్‌పోర్టుల్లో సెక్యూరిటీ రూల్సు మారిపోయాయి. డవుటొస్తేచాలు, యెత్తి మూసేస్తున్నారు. వాళ్ళూవాళ్ళూ కొట్టుకుంటున్నారు. మధ్యలో మనలాంటి వాళ్ళు అవస్థలు పడుతున్నాం".

చైతన్య మాటలు దమ్మలాల్ చోప్రాకు నచ్చినట్టులేవు. అతను "ఆమ్‌స్టర్‌డాం.. ఆమ్‌స్టర్‌డాం!" అని గొణుక్కుంటూ వెళ్ళి, దూరంగా మనుషులెవరూలేని చోట, వొంటరిగా వో కుర్చీలోకూచున్నాడు.

"మెక్సికోకు వెళ్ళేటప్పుడు యేడుగంటలూ, తిరిగొచ్చేటప్పుడు యిరవై రెండు గంటలూ ఆమ్‌స్టర్‌డాంలో వెయిట్ చెయ్యాలి మేము! అందుకే మాఫ్రెండు కంగారు పడుతున్నాడు" అన్నాను.

"ఆమ్‌స్టర్‌డాంలో కాలంగడపడమంటేనే అదొకపెద్ద అవకాశమంకుల్.... ఆ యెయిర్‌పోర్టొక మాయాబజార్.... యిక ఆవూరే పెద్ద అమ్యూజ్‌మెంట్ పార్కు. యెన్ని పార్కులూ, యెన్ని కాఫీషాపులూ, యెన్ని మ్యూజియంలూ... వొక్కరోజేంచాలుతుంది.?.. యూవార్ లక్కీ!..." అన్నాడు జిరాఫీ యువకుడు.

"వూళ్లోకెళ్ళడానికి మాకు వీసాలేదు.... యెయిర్‌పోర్టులోనే కాలంతోయాలి" అన్నాను చింతగా.

"అయినా పర్వాలేదంకుల్! వోన్లీట్వంటీహవర్స్.... వొక్కో షాపును చూడ్డానికో అరగంటవేసుకోండి. మీరెంత వేగంగా తిరిగినా షాపులే మిగిలిపోతాయి" అన్నాడు చైతన్య.

మాకెదురుగావున్న అద్దాలగోడకవతల, కె యెల్ యెమ్ విమానం చుట్టూ ట్రక్కులూ, వుద్యోగులూ గిరికీలు కొడుతున్నారు. దూరంగా రన్‌వే పైన అప్పుడేదిగిన విమానం ముందుకు పరిగెడుతోంది. యేదో విమానం ఆకాశంలోకి యెగిరిపోతూ, యెయిర్‌పోర్టు పైకప్పుపైన శబ్దాల జాతర చేసిపోతోంది. ప్రయాణికుల చూపులన్నీ ప్రకటనల బోర్డులపైన మోహరిస్తున్నాయి.

నేను పైకిలేచి, నా ట్రాలీ సూట్‌కేసును లాక్కుంటూ వెళ్ళి, దమ్మలాల్ చోప్రా భుజంపైన చేయివేశాను. అతనుధిగ్గున తలపైకెత్తాడు. అతడి కనుకొలుకుల్లోంచీ రెండు కన్నీటి బొట్లు కిందికి జారాయి. నేను కంగారుపడ్డాను.

"జరా ధ్యాన్ సే సునో బాయ్! ముజ్‌కో కల్ రాత్ నీంద్ మే సంకేత్ ఆయా! పానీగిరేతో బడా బురా హెూగా! యా బడా అద్భుత్ నికలేగా!.... ఆమ్‌స్టర్‌డాంకా నామ్ కాన్‌మే పడా, అవుర్ పానీ గిర్‌గయా! యేక్‌బార్‌నహీ.... దోబార్... హమ్‌కో బడీ ముసీబత్ హెూగా...."

నీళ్ళు కిందపడ్డ సమయంలో వినబడేమాటను కనిపెట్టివుండమని రాత్రి కలలో సంకేతమేదో అందిందట! అందువల్ల ఆమ్‌స్టర్‌డాంలో పెద్ద ప్రమాదమో, పెద్ద అద్భుతమో మాకోసం యెదురుచూస్తోందట!...

యీ యిరవయ్యొకటవ శతాబ్దంలో గూడా మనుషులింతగా అతీతశక్తుల్ని నమ్ముతారా? అందులోనూ యింత పెద్ద చదువులు చదివిన వ్యక్తి కిలాంటి నమ్మకాలుండడం సబబేనా? తాను బయపడ్డమే గాకుండా, నన్నుగూడా బయపెట్టాలని చూస్తున్నాడీ జైసల్మీర్ వ్యాపారి!

అదీ దమ్మలాల్ చోప్రా 'ఆమ్‌స్టర్‌డాం' అనే మాటను తొలిసారిగా విన్నప్పుడు జరిగిన సంగతి. యిక రెండవ సారేం జరిగింది?

# 2

ఢిల్లీ విమానాశ్రయంలో కె.యెల్.యెం 872 విమానంలోకి యెక్కగానే “ముజ్‌కో కిడికీ కీపాస్ సీట్‌హెూనా!” అంటూ దమ్మలాల్ చోప్రా తన ముందున్న ప్రయాణికుల్ని వెనక్కులాగుతూ, తాను ముందుకు పరిగెత్తబోయాడు.

“మీ సీటు నెంబరు మీ బోర్డింగుపాసులో వుంటుంది. మీనెంబరు సీట్లోనే మీరు కూర్చోవాలి” అని చైతన్య మిత్రుడొకడు హిందీలో వారించాడు.

“పర్వాలేదులే...మీరు నాసీట్లో కూచోండంకుల్... నేను మీ సీట్లో కూర్చుంటాను” అన్నాడు చైతన్య.

నాకూ, దమ్మలాల్ చోప్రాకూ మధ్య రెండు సీట్ల దూరం వుండిపోయింది. మామధ్యలోకూచున్న చైతన్యా, అతడి మిత్రుడూ, విమానం ఆకాశంలోకి వెళ్ళిపోతూనే తమ లాప్‌టాప్‌లు తెరుచుకునేశారు.

“యిప్పుడు గూడా లాడెన్ భయం తీరలేదా?” అంటూ చాలా సేపటినుంచీ నన్ను బెదిరిస్తున్న విషయాన్ని బయటపెట్టాను.

“తీరడమా? ఆప్రశ్నే లేదంకుల్!” అన్నాడు చైతన్య తనలాప్‌టాప్‌లోంచీ తలపైకెత్తి. “యిప్పుడు దేవుడ్ని తలవడం గూడా మరిచిపోవచ్చుగానీ సెప్టెంబరు పదకొండును చచ్చినా మరవలేం! మీరు జాగ్రత! మొదటిసారిగా విదేశాలకు బయల్దేరామంటున్నారు గదా! కొత్తవాళ్ళతో అనవసరంగా మాట్లాడకండి. యెయిర్‌పోర్టుల్లో గానీ, ఫ్లయిట్లల్లోగానీ యేవైనా వస్తువులు కనబడితే తాక్కండి. మీ బేగేజీని యెవరి చేతికీ యివ్వకండి. యెవరైనా తమ సామాన్లు కాస్సేపు కనిపెట్టమని అడిగితే వొప్పుకోకండి. అప్రమత్తంగా వుండండి. సాధారణంగా యేమీ జరగదనుకోండి. కానీ మన అదృష్టంబాగలేకుండా యేదయినా జరిగిందే అనుకోండి. యిక ఆపైన మిమ్మల్నెవ్వరూ కాపాడలేరు.”

చైతన్య పక్కన కూర్చున్న జిరాఫీ యువకుడు నేను భయపడుతున్నానని కనిపెట్టి నట్టున్నాడు. నాకేసి జాలిగా చూస్తూ “యిప్పుడిలా విమానాల్లో ప్రయాణం చేయడం పెద్దరిస్క్ అంకుల్! సెక్యూరిటీ వాళ్ళకు అనుమానమొచ్చేలా మనం బిహేవ్ చేయగూడదు. వాళ్ళకు అనుమానమే వచ్చిందో, యిక మీరేం ఆర్గ్యూ చేసినా వాళ్ళు వొప్పుకోరు. మీరు అమాయకులే గావచ్చు. కానీ అమాయకులని ప్రూవయ్యేలోపల పనిష్మెంట్లు పడిపోతాయి. యేదేశపు జైల్లో పెడతారో, అక్కడిలాయేమిటో, అక్కడసలు విచారణ లయినా జరగతాయోలేదో, జరిగినా న్యాయం జరుగుతుందో లేదో, తిరిగీ మనం మనవూరి కసలు వెళ్తామోలేదో, యెవరూ చెప్పలేరు. యేపుట్టలో యేపాముందో! తీరా చేతులు కాలాక యేంచెయ్యగలం? దేనికైనా ముందుజాగ్రత్త పడ్డమే మనం చేయగల్గింది. టేక్‌కేర్!” అన్నాడు.

కిటికీ కవతలున్న దృశ్యాలు దమ్మలాల్ చోప్రాను కట్టిపడేశాయి. మధ్యలో యెయిర్ హెూస్టెస్‌లు భోజనం తీసుకొచ్చినప్పుడు మాత్రమే అతను నాకేసి చూసి పలకరింపుగా నవ్వాడు. యిప్పుడు విమానంలో కూచున్న వాళ్ళందరూ నాకు అనుమానితులుగానే కనిపిస్తున్నారు. యింతకూ యీ ఐటీ యింజెనీర్లను మాత్రం యెంత వరకూ నమ్మొచ్చు? యెవరితోమాట్లాడాలన్నా బెరుకుగానేవుంది. నాదృష్టిలో పడిన ప్రతి వ్యక్తినీ అనుమానంగా పరిశీలించి చూస్తూ చూస్తూ అలసిపోయి, నాకు తెలియకుండానే నిద్రలోకి జారి పోయాను.

నేను నిద్రమేలుకునే సరికి విమానం వూగుతూకిందికి దిగుతోంది.

దమ్మలాల్ చోప్రాతో "అదే అంకుల్ ఆమ్‌స్టర్‌డాం... వచ్చేశాం!" అంటున్నాడు చైతన్య.

"ఆమ్‌స్టర్‌థాం.... ఆమ్‌స్టర్‌డాం!" అని పలవరిస్తూ నాకేసి దీనంగా చూశాడు దమ్మలాల్ చోప్రా. నేనువెంటనే అతడి చేతులకేసి చూశాను. అతడి చేతిలో మంచినీళ్ల సీసాగానీ, గ్లాసుగానీ లేవు.

"చూడండంకుల్! చుట్టూనదులున్నాయి గదా! వూరు వూరంతా నదిలో తేలేపడవ లాగుంది గదా! ఆమ్‌స్టర్‌డాం అంటే ఆమ్‌స్టర్ నదికి కట్టిన డాం అనే అర్థం..." చైతన్య స్నేహితుడొకడు గమ్యాన్ని చేరిన ఆనందంలో కేరింతలు కొట్టసాగాడు.

"పానీ.... పానీ....." అంటూ దమ్మలాల్ చోప్రా కళ్ళుమూసుకుని, ముఖాన్ని యివతలికి తిప్పేశాడు.

"ఆమ్‌స్టర్‌డాం అంటే నీళ్ళేగాదకుంల్... యింకా చాలావున్నాయ్. యిప్పుడు ప్రపంచమంతా వొకేదేశంలా మారిపోయిందిగదా! అందువల్ల యీకొత్త పరిణామానికి ఆమ్‌స్టర్‌డామ్మే కాపిటల్ అంటారు అందరూ! యెన్ని ఐటీ కంపెనీలూ, యెన్ని స్టాక్ యెక్స్ఛేంజీలూ, యెన్ని మ్యూజియాలూ, యెన్ని పెయింటింగ్ గేలరీలూ, యెన్ని కాఫీ షాప్‌లూ... యివన్నీ వొక యెత్తు... యిక్కడికి దగ్గర్లోనే పెద్ద రెడ్‌లైట్ జిల్లానే వుంది. నాలుగు యూరోడాలర్లు మీవి కాదనుకున్నారనుకోండి.... స్వర్గం అప్సరసలతో బాటుగా మీకోసం దిగొచ్చేస్తుంది" జిరాఫీ యువకుడు పరవశంగా నవ్వసాగాడు.

"వూరుకోరా! చుట్టూ అన్నీవున్నా లాభంలేదు. అంకుల్ వాళ్ళకు యెయిర్ పోర్టులోనుంచీ బయటికిరావడానికి వీసాదొరకలేదు, పాపం!" మరో యువకుడు జాలిపడ్డాడు.

పాసింజర్ ట్యూబు గుండా విమానాశ్రయంలోకి మేము చేరేసరికి అక్కడి గడియారాలు వుదయం ఆరుగంటల సమయాన్ని చూపెడుతున్నాయి.

లగేజీలు కలెక్టుచేసుకున్నాక ఆరుగురు ఐటీ యింజెనీర్లూ మెట్రోరైలుకేసి వెళ్ళ బోతుండగా “మై టాయిలెట్ కో జానా బాయ్!” అన్నాడు దమ్మలాల్ చోప్రా.

తాము వెళ్ళేదారిలో రెస్టురూములున్నాయనీ, తమతో రమ్మనీ చైతన్య పిలిచాడు. చోప్రా తన ట్రాలీ సూట్‌కేసును నాకప్పగించి, వాళ్ళతో వెళ్ళిపోయాడు.

విమానాశ్రయంలోపల చల్లటి వాతావరణాన్ని బంధించినట్టున్నారు. చాలా రోజులుగా మంచులో కూరుకుపోయి తెల్లబడిపోయినట్టున్న యాత్రీకులు కొందరు, రంగురంగుల దుస్తులు తొడుక్కుని, తమకంటే పెద్దవిగావున్న ట్రాలీ సూట్‌కేసుల్ని లాక్కుంటూ పోతున్నారు. షాపింగ్ మాల్స్ మధ్యా, విమానాశ్రయపు గేట్ల మధ్యా సర్దుకున్న లౌంజ్‌లలో కూర్చున్న యాత్రీకులు, బర్గర్‌లను నెమరేస్తూ, కాఫీగ్లాసుల్ని జుర్రు కుంటున్నారు. గార్బేజీని శుభ్రం చేస్తున్న చిన్న ట్రాలీలు కొన్ని విమానాశ్రయంలోపలే బొమ్మల్లా తిరుగుతున్నాయి. దూరంగా యెప్పుడూ శుభ్రతకే అలవాటు పడుతున్న రెస్టారెంటులో వెయిటర్ వొకడు రొబోట్‌లా కూర్చునివున్నాడు. పగటినీ రాత్రినీ తెలుసు కోలేని విమానాశ్రయపు దీపాలు బలహీనంగా, పాలిపోతున్నాయి.

నా భుజంపైన చేయిపడగానే వులిక్కిపడి తిరిగి చూశాను. “జరా సమాల్‌కే దేఖోభయ్యా! యహా యే షహర్ జల్‌దిగ్బంద్ మేహై! యహా జరూర్‌సే అద్భుత్ హెూగా!” అన్నాడు దమ్మలాల్ చోప్రా.

ఆ విషయం అతడికెలా తెలిసింది? తనకేమైనా భవిష్యత్తును ముందుగా తెలుసు కోగలిగే మానవాతీతమైన శక్తులున్నాయా? అని అడగబోయాను.

“జరా ధ్యాన్‌సే సునో భయ్యా!” అంటూ చెప్పడం మొదలుపెట్టాడు దమ్మలాల్ చోప్రా. యీ విషయాన్నింతవరకూ యితరులెవరికీ తాను చెప్పలేదన్నాడు. మొదటిసారిగా వినే అదృష్టం నాకుదక్కుతోందని వూరించాడు. బహుశా అందుకు నేను పూర్వజన్మలో చేసుకున్న పుణ్యమే కారణమయివుండవచ్చునని వూహించాడు. నాలుగైదు యెలివేటర్లు యెక్కిదిగీ, నేలపైన పరిగెత్తే యెలిలేటర్లను దాటి, G 7 గేటు దగ్గరికొచ్చి, వెయిటింగ్ లౌంజ్‌లో కూచునేలోగా దమ్మలాల్ చోప్రా చెప్పిన విషయాలను, యీ భూమండలంపైన, నేనుతప్పయింకెవరూ, యింతవరకూ వినివుండరని నేను నిస్సంకోచంగా చెప్పగలను.

యీ దమ్మలాల్ చోప్రా పుట్టింది జైసల్మీర్ నగరానికి యాభై రెండు కిలోమీటర్ల దూరంలో వుండే చిన్నవూరు. చుట్టూ యెడారే! యెడారిలోపుట్టి పెరగడం వల్ల అతడికి బాల్యంనుంచీ భూమితోనూ, ఆకాశంతోనూ, నిప్పుతోనూ, గాలితోనూ మాట్లాడే శక్తులు వచ్చాయిట! చిన్నప్పుడంటే యేవయస్సులో? ఆ సంగతి అతడికే తెలియదట! ఆశక్తులు తనకు వచ్చిన చాలాకాలం తర్వాతే తనకది అర్థమయిందట! తెలుసుకున్న తర్వాత ఆ శక్తులు తనకు మాత్రమే యెందుకొచ్చాయని ఆలోచించాడట! చిన్నప్పుడెప్పుడో వాళ్ళ

నాన్న యెప్పుడూ అబద్ధం చెప్పగూడదనీ, సత్యమే మాట్లాడాలనీ చెప్పాడట. అప్పటి నుంచీ అతనెప్పుడూ అబద్ధమే చెప్పలేదట! పన్నెండేళ్ళు సత్యమే మాట్లాడిన వ్యక్తి, ఆ తరువాత యేంమాట్లాడినా అది సత్యమైపోతుందని రుషులు చెప్పారట యెప్పుడో... అలా యీ దమ్మలాల్ చోప్రా సత్యవ్రతంలోనే వున్నాడట యిప్పటికీ.... మెక్సికోకు వీసా వచ్చిన రోజురాత్రి కలలో మొదటిసారిగా నీళ్ళు మాట్లాడాయట... అంతవరకూ పంచభూతాల్లోని భూమి, ఆకాశం,గాలీ, నిప్పులతో మాత్రమే మాట్లాడుతూ వుండిన తాను, యిప్పుడున్నట్టుండి నీళ్ళుగూడా మాట్లాడడం మొదలుపెట్టేసరికి అప్రమత్తుడై పోయాడట. ఆమ్‌స్టర్‌డాం అనే మాట అతడి చెవిలో పడుతూండగా సీసాలోని నీళ్ళు కిందపడిపోతూ రెండవ సంకేతాన్ని పంపాయట! రెండవసారి ఆపేరు విన్నప్పుడూ నీళ్ళు కిందపడుతూ హెచ్చరించాయట! ఆరెండూ చిన్నసంకేతాలని తానెక్కడ పట్టించుకోక పోతానో అన్న అనుమానంతో యిప్పుడు నీళ్ళు ఆమ్‌స్టర్‌డాం నగరాన్ని చుట్టూ క్రమ్మేశాయట! అదీ దమ్మలాల్ చోప్రా చెప్పిన మాటల సారాంశం.

యింతకూ పంచభూతాలు మాట్లాడ్డమేమిటి? అవి పంపే సంకేతాలెలావుంటాయి? ఆమ్‌స్టర్‌డాంలో అద్భుతమేదో జరగవచ్చుననే యీ దమ్మలాల్‌చోప్రా నమ్మకానికి హేతువేమిటి? నేనతడిదగ్గరి నుంచీ పైకిలేచి, దూరంగా వచ్చి కూచుని, అతడికేసి కళ్ళార్పకుండా చూడసాగాను.

విమానాశ్రయంలోపలి గడియారాలు వుదయం యేడుగంటలయినట్టుగా చెబుతున్నాయి. మాముందున్న లేత నీలిరంగు అద్దాల గోడలోంచీ అవతల విమానాల రన్‌వేలూ, వాటి చివరలో గుబురుగా పెరుగుతున్న చెట్లూ కనబడుతున్నాయి. గేట్లదగ్గర ఆగిన విమానాలు తిమింగిలాల్లా, వాటి చుట్టూ తిరుగుతున్న లగేజీ ట్రాక్టర్లూ, యిందనాల టాంకర్లూ పిల్లచేపల్లా కనబడుతున్నాయి.

"అంకుల్! అంకుల్!" అన్న పిలుపు వినగానే తలతిప్పిచూశాను.

"మరోలా అనుకోకండంకుల్! మీరేమైనా మా చైతన్య వాలెట్ చూశారా?..." అంటూ కంగారుపడుతూ అడిగాడు జిరాఫీ ఐటీ యువకుడు.

అంత వరకూ మరేదో లోకంలో జీవిస్తున్న దమ్మలాల్ చోప్రా వులిక్కిపడి "వాలెట్.... వాలెట్...." అంటూ ఆమాటల్ని ఆధారంగా చేసుకుని, యీలోకంలోకి రావడానికి ప్రయత్నించసాగాడు.

"డోన్ట్‌మిస్టేక్ అస్ అంకుల్.... మీరు ఫ్లయిట్‌లో చైతన్య పక్కనే కూర్చున్నారు గదా! అప్పుడేమైనా వాడి వాలెట్ జారికిందపడిందేమో అనీ.... మీరేమైనా చూశారేమో అనీ...."" మరో ఐటీ యువకుడు అందుకున్నాడు.

"వాలెట్టా! పోయిందా? అందులో యేముంది?" అని అడిగాను.

"డాలర్లూ, క్రెడిట్ కార్డులూ.... ఐడెంటిటీ కార్డులూ.... డ్రైవింగ్ లైసెన్సులూ... అన్నీ దాన్లోనే వున్నాయంకుల్.... ఢిల్లీలో ఫ్లయిటెక్కేముందు వాటర్ బాటల్ కొన్నాడట! అప్పుడుంది. తర్వాత యేమయిందో తెలియదు. యిప్పుడు చూస్తే లేదు" అన్నాడు జిరాఫీ యువకుడు.

"ఫ్లయిట్‌లో పడిపోయిందేమో!" అన్నాను.

"ఫ్లయిట్ యింకా గేటుదగ్గరే వుందంకుల్! దాన్లో వెతకడం కోసం చైతన్య యెయిర్‌పోర్టు ఆఫీసర్ల దగ్గర స్పెషల్ పర్మిషన్ తెచ్చుకోవాలని వెళ్ళాడు..." అన్నాడా యువకుడు.

"యెయిర్‌పోర్టులో దిగాక మీతో బాటూవాడూ రెస్ట్‌రూంకెళ్ళాడు గదా! అక్కడేమైనా పడిపోయిందేమోనని డవుటొచ్చింది. యింతకూ ఆ రెస్ట్‌రూమేదో మీరేమైనా చూపెడతారే మోనని వెదుక్కుంటూ వస్తున్నాము.." అన్నాడు జిరాఫీ యువకుడు.

"అడుగుతున్నది మిమ్మల్నే! మీరేగదా చైతన్యతో బాటూ రెస్ట్‌రూంకెళ్ళింది? వెళ్ళి ఆ రెస్ట్‌రూమెక్కడో చూపించి రారాదా?" యింకా అయోమయంగా చూస్తున్న దమ్మలాల్ చోప్రాను హెచ్చరించాను.

"మై... అవుర్ రెస్ట్‌రూం.... అవుర్ పానీ...." అంటూ చోప్రా బిక్కమొహంపెట్టేశాడు.

"టాయిలెట్ అంకుల్.... దాన్ని యిక్కడ రెస్ట్‌రూం అంటారు.." ఐటీ యువకుడు వివరించాడు.

"టాయిలెట్ .... రెస్ట్‌రూం..." అని పలవరిస్తూ పైకిలేచాడు దమ్మలాల్ చోప్రా. నిద్రలోనడుస్తున్నట్టుగా అతను ముందుకు కదలగానే ఐటీ యువకులిద్దరూ అతణ్ణి వెంబడించారు.

విమానాశ్రయపు గడియారం కష్టపడుతూ యేడుగంటలా నలభై అయిదు నిము షాలకు చేరి, యింకా మేము యీచోట్లో అయిదు గంటలు వేచి వుండాల్సిందేనని హెచ్చరిస్తోంది.

బద్ధకంగా ఆవులిస్తూ వొళ్ళు విరుచుకున్నాను. పోగొట్టుకున్న పర్సును వెతుక్కుంటున్న చైతన్యను తలచుకోగానే బాధేసింది. డాలర్లూ, క్రెడిట్ కార్డులూ, ఐడెంటిటీకార్డులూ, డ్రైవింగ్ లైసెన్సులూ అన్నీ ఆవాలెట్‌లోనే పెట్టుకోకపోతే, వేరే యెక్కడైనా దాచు కోగూడదా? యిప్పుడా పాడూ వాలెట్ దొరక్కపోతే, ఆ క్రెడిట్ కార్డులను సీజ్‌చేయించాలి. మళ్లీ కొత్త క్రెడిట్ కార్డులొచ్చేదాకా యిబ్బందులుపడాలి. దేశంగానిదేశంలో, యీ

కుఱ్ఱాళ్ళెలా కష్టాలు పడుతున్నారో తలచుకుంటే కడుపు తరుక్కుపోతోంది. వుద్యోగికి దూర భూమిలేదని పెద్దవాళ్ళు అనేవాళ్ళు. అయితే ఆ వుద్యోగాలు మనుషుల్నిలా ఖండాంతరాలకు విసిరేస్తాయని వాళ్ళు వూహించివుండరు.

దూరంగా కనబడుతున్న షాపింగ్‌మాల్స్‌లో సేల్స్‌మాన్‌లూ, కస్టమర్లూ బొమ్మల్లాగే కదులుతున్నారు. గాజుగోడ కవతల ఆగిన విమానాల చుట్టూ ట్రక్కులూ, ట్రాక్టర్లూ, మనుషులూ గిరికీలు గొడుతున్నారు. విమానాశ్రయపు చివర్లో గాలివాటు తెలుసుకోవడం కోసం యెగరేసిన గాలిగుమ్మటాలు యేటవాలుగా నిలబడిపోయివున్నాయి.

యెక్కడి అనంతపురం! యెక్కడి అమ్‌స్టర్‌డాం నగరం! అనంతపురంలో, మాయింట్లో, నాభార్య యిప్పుడేం చేస్తూంటుంది? యిప్పుడక్కడింకా తెల్లవారలేదేమో! ఆదమరచి నిద్రపోతూ వుంటుందేమో! నిద్రలో తన అస్తిత్వాన్ని మరచిపోయిన ఆమెకూ, మెలకువలో యిలా నా అస్తిత్వాన్ని మోస్తున్న నాకూ తేడా యేమిటి? నన్నునేనూ, తనను నా భార్యా మరచిపోయినా, యీలోకం తన అస్తిత్వాన్ని తాను మరవదేమో! యింతకూ లోకానికి గూడా అస్తిత్వమంటూ వొకటుంటుందా? వుంటే ఆ అస్తిత్వానికీ, నా అస్తిత్వానికీ సంబంధమేమిటి?

వెంటనే నాకు చైతన్య వాలెట్ గుర్తొచ్చింది. యిప్పుడీ అస్తిత్వాల గొడవెందుకు? తీరికదొరికితే మనిషి యిలాంటి పిచ్చి ఆలోచనలే చేస్తాడేమో! యిప్పుడు కావల్సినదల్లా చైతన్యవాలెట్.. అదిదొరికి, ఆకుఱ్ఱాడు సంతోషంగా ఆమ్‌స్టర్‌డాం నగరంలోకెళ్ళి, మళ్ళీ తనపాత ఐటీ వుద్యోగంలో కూరుకుపోతే అంతేచాలు! తిరుగుతున్న గాడిలో యీ లోకమూ, పనిచేస్తున్న పద్ధతిలో యీ విమానాశ్రయమూ, నడుస్తున్న దిశలో యీ విమానాలూ, సాగవలసిన రీతిలో నా ప్రయాణమూ సాగితే అదేచాలు... యేదీ గతి తప్పకూడదు... నాకసలు యీ అస్తిత్వగిస్తిస్వాలను గురించి ఆలోచించే తీరికే దొరకగూడదు.

పెద్దగా అవులిస్తూ మరోసారి వొళ్ళువిరుచుకున్నాను.

దమ్మలాల్ చోప్రా ట్రాలీ సూట్‌కేసు నాముందు దిగాలుగా కనబడుతోంది. యింకా అతనా రెస్ట్‌రూంలో యేంచేస్తున్నాడు? అక్కడ చైతన్య వాలెట్ దొరికిందా? యీ చోప్రాను వొంటరిగా పంపడమే నా పొరబాటు. యిప్పుడు నేనిలా అతడికోసం యెంతసేపని యెదురు చూడాలి?

చుట్టూ ఆమ్‌స్టర్‌డాం విమానాశ్రయం మాయాబజార్లాగే కవ్విస్తోంది. దువ్వెనల దగ్గరినుంచీ సెంట్లదాకా, తినుబండారాల దగ్గరి నుంచీ పడక కుర్చీల వరకూ, పుస్తకాలనుంచీ కంప్యూటర్లదాకా, యిక్కడి షాపుల్లో సర్వమూ ప్రదర్శిస్తున్నారు గదా! వొకసారి ఆ తిరణాలలో తిరిగొస్తే కాలం యిట్టే గడచిపోతుంది. కానీ నన్నిలా

తిరగనియ్యకుండా, యిలా తనకోసం యెదురుచూసే పనిపెట్టిపోయాడీ చోప్రా! యింతకూ నాకీ పని అప్పగించింది చోప్రానేనా? చైతన్యా? లేకపోతే కంటికి కనిపించని యేదైనా శక్తా?

వొక్కసారిగా ముఖం విదిలించుకుంటూ పైకిలేచాను. చుట్టూ రెండుసార్లు తిరిగాక మళ్లీ వచ్చికూర్చున్నాను. ఆమ్‌స్టర్‌డాంలో అద్భుతమేదో జరగబోతోందన్న సంకేతమేదో తనకు అందిందన్నాడు గదా దమ్మలాల్ చోప్రా. మనిషికి తన పంచేంద్రియాలద్వారానే సమాచారం అందుతుంది. యివికాకుండా సమాచారాన్నందించే ఆ ఆరవ యింద్రియ మేమిటి? వుంటే గింటే దానికాశక్తి యెక్కడి నుంచీ వచ్చింది? జైసల్మీర్‌లో బియ్యం యెగుమతి దిగుమతి వ్యాపారం చేస్తున్న యీ ఫక్తు వ్యాపారికి, రెండుమూడు యింగ్లీషు మాటలకంటే యెక్కువగా మాట్లాడలేని యీ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీకి, వ్యాపారం చేస్తున్నప్పటికీ చదువుకున్న చదువుపైన మమకారం వదలక పోవడంతో యిలా విదేశీ సెమినార్లకు బయల్దేరిన యీ విచిత్రమైన పరిశోధకుడికి – యితగాడికి అతీంద్రియ శక్తులపైన వున్న నమ్మకంలోని శాస్త్రీయత యేమిటి?

కళ్ళు మూసుకుని, సంకేతాల్లాంటివి నాకు గూడా అందుతాయేమోనని ప్రయత్నించి చూశాను. కళ్ళు మూసుకోగానే, నాముందున్న రెండు ట్రాలీ సూట్‌కేసులు జ్ఞాపకం వచ్చాయి. నేను అప్రమత్తంగా లేని సమయంలో యెవడైనా వాటిని లాక్కుపోతే నాగతేంకావాలి? తన సూట్ కేసును జాగ్రత్తగా అప్పగించకపోతే దమ్మలాల్ చోప్రా నా ప్రాణం తోడేయడా చెప్పండి! అతడి సూట్‌కేసుమాత్రం కనిపించకుండాపోయి, అదలా మాయంగావడానికి నా కందిన రహస్య సంకేతాలే కారణమని చోప్రాతో చెప్పాలని వుంది. అప్పుడతడి ముఖమెలా తయారవుతుందో వూహించుకోడానికే ఆనందంగా వుంది. నేను కళ్ళు మూసుకున్న సమయంలో యెవరైనా వచ్చి నా సూట్‌కేసులో బాంబులు పెట్టేశారే అనుకోండి! ఆ తరువాత అది పేలినా ప్రమాదమే! పేలకుండా సెక్యూరిటీ వాళ్ళకు దొరికినా ప్రమాదమే! నాకెందుకో యిప్పుడు నాసుట్‌కేసును చూసినా భయమేస్తోంది.

దమ్మలాల్ చోప్రా రెస్ట్‌రూంకేసి వెళ్లి గంటవుతోంది. యింతసేపూ అతనక్కడేం చేస్తున్నాడు?

విమానాశ్రయంలో నత్తగుల్లలా పాకుతున్న కాలాన్ని నా అసహనం పెద్దపులిగా మారుస్తోంది. యీరెండు ట్రాలీసూట్ కేసుల్ని కాపలాగాస్తూ, యిలా యిక్కడ వొంటరిగా నేనెంత సేపని పడిగాపులుపడాలి? యీసరికే యెవరైనా నా సూట్ కేసులో బాంబులు అమర్చేశారా? వోసారి తెరిచిచూస్తే బాగుండును. కానీ నా సూట్‌కేసును తెరవాలంటే నాకిప్పుడు భయమేస్తోంది. యితరులెవరు కనిపించినా భయమేకలుగుతోంది. యెవడు

తీవ్రవాదో, యెవడు హ్యూమన్‌బాంబో! యింతగా సర్వ వ్యాప్తమైన భయంతో యెంత కాలం వేగాలి నేను?

సెకండ్లు గంటలుగా, నిముషాలు యుగాలుగా సాగుతున్నాయి. చుట్టూ మాయా బజారులాంటి ఆమ్‌స్టర్‌డాం విమానాశ్రయం. యెప్పుడో జీవితానికోసారి వచ్చే అవకాశం యిది. పంచభక్ష్యపరమాన్నాల్ని ముందే పెట్టి, ఆకలితో నకనకలాడుతున్నా తిననివ్వకుండా అడ్డు తగిలినట్టుంది నా పరిస్థితి. యిక యిలా కాదని పైకిలేచి, రెండు చేతులతోనూ రెండు ట్రాలీ సూట్‌కేసుల్ని లాక్కుంటూ రెస్టురూమును వెతకడంకోసం బయల్దేరాను. కాస్త దూరంవెళ్ళగానే పెద్ద హాలొకటి వచ్చింది. దానికి రెండు చివరల్లోనూ షాపింగ్ మాల్స్ వున్నాయి. వాటి ముందు అక్కడక్కడా వెయిటింగ్ లౌంజ్‌లున్నాయి. లౌంజ్‌ల నిండా ప్రయాణీకుల రంది యెక్కువగా వుంది. దాదాపు నలభై అడుగుల యెత్తున్న పైకప్పు నీలిరంగు ప్లాస్టిక్ రేకులతో కృత్రిమమైన ఆకాశాన్ని సృష్టిస్తోంది. అంతటా వొకేరకంగా పరుచుకున్న విద్యుద్దీపాల వెలుతురులో విమానాశ్రయం పెద్ద యింకుబేటరు లాగుంది.

చుట్టూ తిరుగుతున్న మనుషులపైన గానీ, బేరాలుసాగుతున్న షాపింగ్ మాల్స్ పైనగానీ నా చూపులు నిలవడంలేదు. నీలిరంగు జుబ్బాతొడుక్కున్న వో నడిప్రాయపు మనిషికోసం, వెలిసిన జీన్సుపాంటు కింద తెల్లబూట్లు తొడుక్కున్న అయిదున్నర అడుగుల శాల్తీకోసం, పెళ్లాం కడుపుతోన్నప్పుడు గడ్డంగీసుకోరాదన్న ఆంక్షను బలవంతంగా పాటిస్తున్నట్టున్న సాదాసీదా వ్యక్తికోసం, చిన్న గుంపులో సైతం సులభంగా తప్పిపోగల సర్వసామాన్యమైన ప్రయాణీకుడికోసం, నేను కళ్లార్పకుండా వెతుకుతూ, అసహనంగా నడవసాగాను.

నాధ్యాసంతా వేరే చోట వుండడంతో దారిపొడుగునా సర్దుకున్న షాపింగ్ మాల్స్ అన్నీ వొకేలా కనబడుతున్నాయి. యెదురైన మనుషులందరూ వొకేలా కనబడసాగారు. క్రమంగా నేను లాగుతున్న సూట్‌కేసులు రెండూ రెండులోకాల్లా బరువెక్కిపోయినట్టు తోచసాగింది. యెదురైన గడియారాలన్నీ కాలాన్ని లెక్కబెట్టడం మానేసి, నానడకను వెక్కిరిస్తున్నట్టుగా కనిపిస్తున్నాయి.

వొకచోట వరసగా అయిదు మెటల్‌డిటెక్టింగ్ ద్వారాల్ని నిలబెట్టి, మిగిలిన దారిని రిబ్బన్లు కట్టిన బారికేడ్లతో మూసేసివున్నారు. ఆ ద్వారాల గుండా అటూ యిటూ వెళ్తున్న ప్రయాణీకుల్ని పరిశీలిస్తూ యూనిఫారాల సెక్యూరిటీ ఆఫీసర్లు నిలబడివున్నారు. నేనో ఆఫీసరు దగ్గరికెళ్ళి "రెస్ట్‌రూం....రెస్ట్‌రూం" అని కలవరించాను.

అతను ముఖం చిట్లించుకుంటూ చేయిని ముందుకు చాపాడు. నేనటుకేసి నడచాను. అక్కడొక పెద్ద కౌంటరు ముందు బూడిదరంగు యూనిఫాం తొడుక్కున్న బూడిద

గుమ్మడికాయలాంటి వ్యక్తి కనిపించాడు. అతని ముందు "మే ఐ హెల్ప్ యూ" అనే బోర్డుంది. నేనతడి ముందు నిలబడి "రెస్ట్‌రూం... రెస్ట్‌రూం" అని పలవరించాను.

బూడిద గుమ్మడికాయగారు తపస్సు చేసుకుంటున్న వ్యక్తిలా యెక్కడో ఆలోచిస్తూ, చేతిని పైకెత్తి అర్ధచంద్రాకారంలో తిప్పాడు. తర్వాత నాముందో చిన్నకాగితాన్ని విసిరేశాడు. "ఆమ్‌స్టర్‌డాం యెయిర్‌పోర్ట్ స్కిపోల్ – యెయిర్‌లైన్ లౌంజెస్" అనే యింగ్లీషు అక్షరాలున్న ఆ విమానాశ్రయపు ప్లానుకాగితంలో "రెస్ట్‌రూం' అనే మాటకోసం వెతుకుతూ బయల్దేరాను.

రెండు పెద్ద హాల్లను కలుపుతున్న నడవా మధ్యలో మగ, ఆడ మనుషుల ఆకారాల్ని సూచించే బొమ్మల బోర్డులున్న రెండు ద్వారాలు కనిపించాయి. యింత వరకూ నేను నడచివచ్చిన దారిలో అలాంటి బోర్డులు చాలా కనిపించాయనీ, అవన్నీ రెస్ట్‌రూములేననీ స్ఫురించడంతో కంగారుపడుతూ అక్కడే ఆగిపోయాను.

యింతకూ దమ్మలాల్ చోప్రా యే రెస్ట్‌రూంకెళ్ళాడు? అతను వెళ్ళి యిప్పటికి రెండు గంటలు దాటుతోంది. యింకా అతను అక్కడే యెందుకుంటాడు? తిరిగివచ్చి వుంటే, నేను కూచున్నచోటికిరాకుండా, యింకెక్కడికెళ్ళివుంటాడు? తొందరపడి నేనా చోటునుంచీ వచ్చేశానేమో! యీ సరికతడు అక్కడికెళ్ళి, నాకోసం యెదురు చూస్తున్నాడేమో! యింతకూ, యిదివరకూ నేను యెదురు చూస్తూకూర్చున్న స్థలం యీ మాయాబజారులో యెక్కడుంది?

యీ విమానాశ్రయంలో తూర్పేదో పడమరేదో తెలియడం లేదు. యేవైపున యేముందో, యెవరెవరు యెక్కడెక్కడికివెళ్తున్నారో అర్థంగావడం లేదు. మా మెక్సికో విమానానికి బోర్డింగు యింకో గంటలో ప్రారంభంగావచ్చు. యీలోగా దమ్మలాల్ చోప్రా తిరిగి రాకపోతే నేనేం చేయాలి?

యీదమ్మలాల్ చోప్రా అనే వ్యక్తి పేరు గూడా నాకు వారంక్రితం తెలియదు. యితడిని నేను కలిసి కొన్నిగంటలు మాత్రమే అయింది. యింత చిన్న పరిచయముండే మనిషికోసం వెతకవలసిన అవసరమెందుకొచ్చింది నాకు?

నేను లాగుతున్న రెండు ట్రాలీ సూట్‌కేసులూ, రెండు అనవసరపు బాధ్యతల్లా పీడిస్తున్నాయి. యీ విమానాశ్రయంలోకి నేను కొన్ని యుగాల క్రితం వచ్చినట్టుగానూ, అప్పటినుంచీ యిలాగే యెవరికోసమో వెతుకుతున్నట్టుగానూ వొక వింత ఆలోచన రాగానే నేను కలవరపడిపోయాను. యీవెతుకులాట యెప్పటికీ ముగియకుండా నేనిలా నిరంతరంగా తిరుగుతూనే వుండిపోతానేమో ననిపించడంతో మంరింతగా వివశు డనయిపోయాను. క్రమంగా నా చుట్టూ వున్న ప్రపంచమంతా చీకటైపోయి, ఆ చీకట్లో దిక్కూదరీ తెలియకుండా, అగమ్యగోచరమైన పరిస్థితిలో, మరో గత్యంతరంలేకుండా

నేను నడుస్తున్నట్లు తోచడంతో పెద్దగా బెంబేలు పడసాగాను. యింతలో E23 అనే మాట గుర్తుకురావడంతో నా చీకటి ప్రపంచంలోకి చిన్న నక్షత్రపు వెలుతురేదో ప్రవేశించినట్టయింది. మా మెక్సికో విమానం E23 అనే గేటునుంచీ బయల్దేరుతుంది. యెక్కడ తిరిగినా చివరకు దమ్మలాల్‌చోప్రా అక్కడికే వచ్చి తీరాలి.

గేటునెంబర్లున్న బోర్డులను వెతికిపట్టుకున్నాక, అవి చూపెట్టిన దారిలో, గాలంవెంట పరిగెత్తే చేపపిల్లలా దూసుకెళ్ళసాగాను. దారులన్నీ వ్యాకోచిస్తున్నట్టుగా కవ్విస్తున్నాయి. యీ పాడూ విమానాశ్రయం ప్రపంచంకంటే పెద్దదిగా తయారవుతున్నట్టుంది. బాణం గుర్తులు దారిని చూపెట్టడానికి బదులుగా పైకి దూసుకొచ్చి గాయాల్ని చేస్తున్నట్టున్నాయి.

E23 ద్వారం కనిపించగానే విభ్రమంతో నాకు కళ్ళు బైర్లుకమ్మాయి., రంగురంగుల దుస్తులు తొడుక్కున్న ప్రయాణీకులతో ద్వారం ముందున్న లౌంజ్, తోడేలుదూరిన ముళ్ళపొదలా తత్తరించిపోతోంది. నీలిరంగుదుస్తులు తొడుక్కున్న KLM వుద్యోగులు నీటి యేనుగుల్లా దిట్టంగా నిలబడి, తమ పనులు చేసుకుపోతున్నారు. ద్వారంముందున్న నల్లబోర్డుపైన తెల్లటి అక్షరాలు, బోర్డింగు పదిన్నరకని బిడియంగా ప్రకటిస్తున్నాయి. దానికటువైపున్న యెలక్ట్రానిక్ గడియారంలోని అక్షరాలు యెరుపురంగులో మినమిన మంటూ పొదకవతలదాక్కున్న మృగపు కళ్ళల్లా బెదరుపుట్టిస్తున్నాయి.

బడితె కొయ్యల్లాంటి సూట్ కేసుల్ని పక్కన పడేసి, వో కుర్చీలో కూర్చుని రొప్ప సాగాను. ద్వారం దగ్గరి కౌంటరుముందు నిలబడ్డ నీలిదుస్తుల తెల్లపిల్ల కాగితాలేవో సర్దుకుంటోంది. పెద్ద వాకీటాకీ పట్టుకున్న నీలిదుస్తుల తెల్లవుద్యోగొకడు ద్వారం పక్కనుంచీ వే బ్రిడ్జిలోకి నడచిపోతున్నాడు. వో ముసలావిడ కూచున్న చక్రాల కుర్చీని తోసుకుంటూ, వో ముసలాయిన ద్వారం దగ్గరికెళ్తున్నాడు. ముడతలు తేరిన శరీరంతో ఆవిడ వుడికించిన టమేటో పండులాగుంది. గిచ్చినా కండలేని బక్కపలచటి శరీరంతో ఆయన యెండిపోయిన ములక్కాడలాగున్నాడు.

బోర్డింగు మొదలుపెట్టేలోగా యీ దమ్మలాల్‌చోప్రా వస్తాడో రాడో! మాకిద్దరికీ కలిపి వొకే జాయింట్ టికెట్టు యేర్పాటుచేసిన గాబ్రియల్ ముండా గుర్తుకొస్తున్నాడు. అతడికి నేనేమపకారం చేశాను? నన్నెందుకిలా యిరికించాడు? నేను వొంటరిగా వెళ్తే, టికెట్టుచూసి, ఆ బోర్డింగు సెక్యూరిటీవాళ్ళు, యింకొక పేసింజరెక్కడని తప్పకుండా అడుగుతారు. అప్పుడు నేనేమని సమాధానం చెప్పాలి? తప్పిపోయిన వాళ్ళను గురించి ప్రకటన యిచ్చే సౌకర్యమేదయినా యిక్కడుందా? యెవరిని అడగాలి?

యీ ఆమ్‌స్టర్‌డాంలో అద్భుతమేదో జరగబోతోందని అన్నాడు గదా చోప్రా! అతను కనబడకుండా మాయమైపోవడమేనా ఆ అద్భుతం! యేదో మాయజరిగి అతనో పక్షిలామారి ఆకాశంలోకి యెగిరిపోలేదు గదా! లేకపోతే సూక్ష్మ శరీరాన్ని ధరించి,

యీా సరికే ఆ విమానంలోకెక్కి కూచోలేదు గదా! నేను చిన్నప్పుడు చూసిన జానపద సినిమాలన్నీ గుర్తుకొస్తున్నట్టున్నాయినాకు. యే అద్భుతం జరిగిందిక్కడ? లేకపోతే, యేం జరగబోతోంది?

KLM 685 విమానానికి బోర్డింగు ప్రారంభమవుతోందన్న ప్రకటన వినబడింది. ప్రయాణీకులందరూ ద్వారం ముందు వరసగా నిల్చున్నారు. నేను వెనక్కూ, ముందుకూ, యిటువైపుకూ, అటువైపుకూ, రోగమొచ్చిన కోడిపుంజులా తలతిప్పసాగాను. యీ దమ్మలాల్ చోప్రా నన్నిలా నడిసముద్రంలోకి విసిరేసి యెలాపోయాడు? యేమయ్యాడు?

ద్వారంముందున్న నీలిదుస్తుల సెక్యూరిటీ ఆఫీసరు మళ్లీవోసారి తన మెటల్ డిటెక్టర్‌తో ప్రయాణికుల శరీరాలనంతా పరీక్షిస్తున్నాడు. ద్వారానికవతలున్న స్కానింగ్ మిషన్ ప్రయాణికుల సూట్‌కేసుల్నీ, చేతి సంచులనూ తరచి చూస్తోంది. దాని పక్కనున్న ప్లాస్టిక్ తట్టలోకి షేవింగ్ కత్తెరలూ, టూత్‌పేస్టు ట్యూబులూ, మందుల గొట్టాలూ నిస్సహాయంగా చేరుకుంటున్నాయి.

ద్వారంముందున్న ప్రయాణికుల క్యూ చిన్నదై పోతోంది. చివరివ్యక్తి కదిలేవరకూ వేచి చూచిన తర్వాత, నేనూ వెళ్ళి క్యూలో నిల్చున్నాను. నాగుండె వేగంగా కొట్టుకోవడం నాకు స్పష్టంగా వినబడుతోంది. నా జేబులోని బోర్డింగుపాసుతీసి బయంబయంగా సెక్యూరిటీ ఆఫీసరు చేతిలో పెట్టాను. అతను దాన్నొకసారి తిప్పి చూశాక, తన ముందున్న కాగితంలో వో చోట నమోదు చేసుకుంటూ తలపైకెత్తాడు. నుదురు చిట్లించుకుని, పెదవులు తడుపుకుంటూ, మెటల్ డిటెక్టరును నా శరీరంపైన మంత్రదండంలా తిప్పాడు. తరువాత ముందుకు కదలమన్నట్టుగా సైగచేశాడు. నేనో అడుగు ముందుకేసి, నా వెనక యెవరో కదులుతున్నట్టుగా తోచగానే తిరిగి చూశాను.

నీలిరంగు జుబ్బాకింద వెలిసిన నీలిరంగు జీన్సుపాంటూ, రెండువారాల వయస్సున్న నలుపూ తెలుపూ గడ్డం, భుజానికి తోలు సంచీ... దమ్మలాల్ చోప్రా నాకేసి చూడనయినా చూడకుండా సెక్యూరిటీ చెక్ చేయించుకుంటున్నాడు.

నేను విసుగ్గా అతడి ట్రాలీ సూట్ కేసును అవతలే వదలిపెట్టి, నా సూట్ కేసును పైకెత్తి స్కానింగ్ మిషను ముందుంచాను. యింతసేపూ నేనతడికోసం వెతికి వెతికీ వేసారిపోయానన్న సంగతి అతడి బుర్రకెక్కి నట్టేలేదు. యేమీ జరగనట్టుగా, యింతసేపూ నాతోనే వున్నవాడిలా, యధాలాపంగా వున్నాడు చోప్రా. యితగాడిదిదేం బుద్ధి?

నేను నా ట్రాలీ సూట్‌కేసును లాక్కుంటూ వే బ్రిడ్జీగుండా విమానం లోకి వచ్చేశాను. ద్వారం దగ్గర నిల్చున్న యిద్దరు యెయిర్‌హోస్టెస్‌లు పాత నవ్వునే కొనసాగిస్తూ 'గుడాఫ్టర్‌నూన్' చెప్పారు. నేనో అడుగులోపలి కేయగానే, మూడో యెయిర్‌హోస్టెస్

నాచేతిలోని బోర్డింగు పాసును లాక్కుని "N12- దట్‌సైడ్.." అంటూ వుదారంగా దారి చూపెట్టింది.

విమానం లోపల లేత పసుపు రంగు కాంతిలో, లేలేత తెల్ల పొగలు గిరికీలు తిరుగుతున్నాయి. సీట్లపైనున్న లగేజీల స్టాండ్లు తలుపులు తెరుచుకుని, ప్రయాణికుల సరంజామాకు స్వాగతం చెబుతున్నాయి. కొందరు ప్రయాణికులు సామాన్లు సర్దుకుంటూంటే, మరికొందరు తమ కుర్చీలను వాటంగా వాల్చుకుంటున్నారు. నేను నా సూట్‌కేసును స్టాండులోకి తోసేశాక, కుర్చీలో కూచున్నాను.

దమ్మలాల్ చోప్రా రెండు నిముషాల తర్వాత లోపలికొచ్చాడు. తన సూట్‌కేసును పైకెత్తి స్టాండులో సర్దాడు. తర్వాత నా పక్కన కూర్చుని, దీర్ఘంగా నిట్టూర్చి "హాల్ కైసాహై జనాబ్ !" అన్నాడు.

నేను వురిమిచూసి "క్యాకయాల్‌హై ఆప్ కా?" అని మొరిసాను.

చోప్రా పకాలున నవ్వి "తుమ్‌కోబీ హిందీ ఫిల్మ్ సాంగ్‌కా షౌక్ హైనా!" అని సరాయించాడు.

నేను మరింత కోపంతో పళ్ళుకొరికి "హాల్ కైసా హై జనాబ్ కా? – అని అడగాల్సింది నేను?" అని గద్దించాను.

చోప్రా ప్రసన్నంగా నవ్వి తనతోతాను మాట్లాడుకుంటున్నట్టుగా చెప్పుకుపోయాడు. ఐటీ యువకుడితో బాటూ చెడ తిరిగాక చైతన్యతో కలిసి వెళ్ళిన రెస్టరూమును చివరకు కనిపెట్టాడట! అక్కడంతా గాలించి చూశారట! వాలెట్ దొరకలేదట... ఆపైన ఆ ఐటీ యువకుడు నిరుత్సాహంగా తిరిగెళ్ళిపోయాడట! ఆ తరువాత యితగాడు రెస్టరూంలో తనకున్న పనులన్నీ తీరిగ్గా ముగించుకుని బయటికి రావడానికి వెనుదిరిగాడట! కానీ రెస్టరూం తలుపులెంత లాగినా వెనక్కురాలేదట! అప్పుడు వాటిని బయటనుంచీ మూసేశారని అర్థమయిందట! లోపలినుంచీ యెంత బాదినా తలుపులు తెరుచుకోలేదట! బాదీబాదీ విసుగొచ్చాక, లోపలికేవెళ్ళి, ఖాళీగావున్న చోటులో టవలొకటి పరుచుకుని దానిపైన కూచున్నాడట! ఆమ్‌స్టర్‌డాంలో జరగబోయే అద్భుతానికదే నాందిలా స్ఫురించిందట! వెంటనే కళ్ళు మూసుకుని, దృష్టిని లోపలికి పంపి, అనంతంలోంచీ రాబోయే సంకేతాలకోసం యెదురుచూస్తూ కూచున్నాడట! అలా యెంతసేపు గడిచిందో అతడికే తెలియదట! అలా అంతర్ముఖుడై వున్నప్పుడు కాల మసలు అతడిని తాకలేకపోతుందట! అలా స్థలకాలాదుల కతీతంగా అతడక్కడుండి పోయాడట! యెవరో తలుపులు తెరిచి లోపల కొచ్చినప్పుడు కళ్ళు తెరిచాడట. పైకిలేచి నేరుగా E23 ద్వారం దగ్గరి కొచ్చాడట. అంతా చెప్పాక దమ్మలాల్ చోప్రా కళ్ళు అరమోడ్చి "అద్భుత్ ... అద్భుత్..." అని గొణిగాడు.

అయితే విమానం బయల్దేరే సమయానికి సరిగ్గా రెస్ట్‌రూం తలుపులు తెరవ బడడమేనా ఆమ్‌స్తర్‌డాంలో జరిగిన అద్భుతం! లేకపోతే ఆ తలుపులు తెరిచేవరకూ, రెండుమూడు గంటల పాటూ, యెటువంటి ఆందోళనా పడకుండా యీ చో(ప్రా అనంతంలో సంకేతాల్ని వెదకడమేనా అసలైన అద్భుతం! కాకపోతే అంతసేపూ నేను విమానా(శయపు వింతల్ని చూడలేకపోయి, భయాందోళనలతో అనంతానంతమైన ఆమ్‌స్టర్‌డాం యెయిర్‌పోర్టులో ప్రదక్షిణాలు చేయడమే నిజమైన అద్భుతమేమో!

నా యెడమవైపున కూచున్న తెల్లముసలాయిన పైకిలేచి ముందుకు నడవబోయాడు. యెయిర్ హెూస్టెస్ గబగబా ముందుకువచ్చి ఆయనను పట్టుకుని ఆపింది. త్వరగా రెస్ట్‌రూం కెళ్ళాలని మొత్తుకున్నాడాయన. "డయాబిటెస్... ఐకాంట్ వెయిట్ ఫరదర్..." అని గింజుకున్నాడు. విమానం యింకా టేకాఫ్‌లోనే వుందనీ, కాస్సేపు ఆగమనీ అందావిడ.

యెయిర్‌పోర్టులో గంటసేపటినుంచీ రెస్ట్‌రూం కెళ్ళాలని ప్రయత్నించాడట ఆయన. కానీ అవన్నీ మూసేసి వున్నాయిట!వెంటనే యూరినల్స్ కెళ్ళకపోతే తట్టుకోలేనన్నాడాయన.

యెయిర్‌హెూస్టెస్ అనునయంగా చూస్తూ, విమానా(శయంలో యెక్కడో బాంబులు న్నాయని వార్త వచ్చిందనీ, అందువల్ల కాస్సేపు రెస్ట్‌రూముల్ని మూసేసి అంతా గాలించారనీ అంది . "సెక్యూరిటీ యీజ్ మోర్ యింపార్టెంట్‌సార్... ప్లీజ్ కో ఆపరేట్..." అంటూ ఆవిడ ఆ ముసలాయిన చేయి పట్టుకుని, జా(గ్రత్తగా టాయిలెట్‌కేసి తీసుకెళ్ళింది.

వెనక కుర్చీలో కూచున్న వ్యక్తి "యెక్స్‌ట్రీమిజమ్ యీజ్యే వెరీ బిగ్ త్రెట్... వుయార్ హెల్ప్‌లెస్..." అని వాపోయాడు.

యెయిర్‌పోర్టులో యిటువంటి తనఖీ యేదో జరుగుతోందని ప్రకటించివుంటే సరిపోయేది. అప్పుడు నేను దమ్మలాల్ చో(ప్రాకోసం అంతగా కంగారుపడివుండే వాణ్ణిగాను గదా! వొకవేళ నేను విమానా(శయంలో చో(ప్రాకోసం వెతుకుతున్నప్పుడు, బాంబుల తనఖీ జరుగుతోందని తెలిస్తే యెలావుండేది? అప్పుడు నేను పడే ఆందోళన, యీ దమ్మలాల్ చో(ప్రా కనబడలేదనే కంగారుకంటే ఎక్కువగా వుండేదా? యేమో!

నేను చో(ప్రాకేసి తిరిగి, ఆమ్‌స్టర్‌డాం విమానా(శయంలో బాంబులున్నాయని తెలిసిందనీ, అందుకే సెక్యూరిటీవాళ్ళు రెస్ట్‌రూముల్ని కూడా వదలిపెట్టకుండా గాలించారనీ చెప్పాను. అతను కాస్సేపు మౌనంగా వుండిపోయాడు. తర్వాత బాంబుల భయంతో రెస్ట్‌రూములు మూతబడ్డం నిజమేగావచ్చుగానీ, సరిగ్గా మా విమానం బయల్దేరబోయే ముందు వాటిని తెరిచిందెవరని ప్రశ్నించాడు.

అయితే అలా సరిగ్గా సమయానికి రెస్ట్‌రూం తలుపులు తెరవబడడమే ఆమ్‌స్టర్‌డాంలో జరిగిన అద్భుతమని యితననుకుంటున్నాడా?

టాయిలెట్ నుంచీ తిరిగొచ్చి, నా యెడమవైపు కుర్చీలో కూచున్న ముసలాయిన తన వణుకుడు గొంతుతో "యిస్లాం యెక్స్ ట్రీమిజమ్... సెప్టెంబర్ యిలెవన్... బిల్ లాడెన్..." అని కలవరిస్తున్నాడు.

వున్నట్టుండి "ఆమ్‌స్టర్‌డాంమే అద్భుత్‌హోగా! యే సబ్ వుస్‌కీ ఝలక్..." అన్నాడు చోప్రా.

యిప్పుడు జరిగింది చిన్న 'జలక్' మాత్రమేననీ, అసలైన అద్భుతమేదో ముందు ముందు జరగబోతోందనీ చోప్రా అంటున్నాడు. సరిగ్గా విమానం బయల్దేరబోయేముందు రెస్ట్‌రూం తలుపులు తెరవబడడమే అందుకు వుదాహరణగా చూపిస్తున్నాడు.

నిజమేగావచ్చు! అలా జరిగివుండకపోతే యేమయివుండేది? యింకా యితను ఆ రెస్ట్‌రూంలోనే, అనంతం లోంచీ రాబోయే సంకేతాల్ని వెతుక్కుంటూ వుండేవాడు... నేనా విమా నాశ్రయంలో దిక్కుతోచకుండా తిరుగుతూవుండే వాణ్ణేమో! లేకపోతే యితను లేకుండా విమానమెక్కివుండేవాణ్ణి! అంటే, అద్భుతమేదో జరిగినందువల్లనే, ఈ దమ్మలాల్ చోప్రా, యిప్పుడు నా పక్కన కూర్చుని, మెక్సికోకు వస్తున్నాడు. అంతేగదా! యింతకూ యిప్పుడు జరిగింది కేవలం చిన్న 'జలక్' అయితే, యిది యే పరమాద్భుతానికి అవతారికగాబోతోంది?

# 3

"ఆమ్‌స్టర్‌డాం..... ఆమ్‌స్టర్‌డాం" అంటూ లక్షా తొంభైతొమ్మిదోసారి కలవరించాడు దమ్మలాల్ చోప్రా. యిప్పుడు మళ్లీ మొదలుపెట్టిన చోటికే తిరిగొచ్చానుగదా నేను! మెక్సికో నగరంలో మావారం రోజులపర్యటన యీ దమ్మలాల్‌చోప్రాలో ఆవగింజతయినా మార్పును తెచ్చినట్టులేదు. మేము అక్కడికి బయల్దేరినప్పుడు మొదలుపెట్టిన అద్భుతాలవేటను యిప్పుడు కూడా కొనసాగిస్తున్నాడు. అతను కళ్ళను అరమోడ్చి, "అబ్ ఆదాగంటా బాకీహై.... బాద్‌మే ఆమ్‌స్టర్‌డాం... అవుర్ వహా అద్భుత్ నికలేగా!" అంటూ పైన యెక్కడో వానలు కురిస్తే, యిక్కడికి వరదల్ని మోసుకొచ్చేనదిలా, వుద్వేగంతో బుసలు గొట్టసాగాడు.

కె యెల్ యెమ్ విమానం యింకా వేల అడుగుల యెత్తులోనే యెగురుతోంది. విమానపు కిటికీ కవతల స్టలక్టయిస్‌ల లాంటి మేఘాల జాతర జరుగుతూనే వుంది. విమానంలో కూర్చున్న యాత్రికులందరూ అవేకుర్చీల్లో పుట్టి, అక్కడే పెరుగుతున్న వ్యక్తుల్లా, ఆ విమానమే తమకు శాశ్వతమనుకున్నట్టుగా, సోలిపోయివున్నారు.

యెయిర్‌హెూస్టస్‌లు కుర్చీల వరసల మధ్యలో తిరుగుతూనే ముసలి వాళ్ళయిపోయే టట్టున్నారు.

యీదమ్మలాల్ చోప్రా దాసరిలా పాసిపోయిన పాతపాటే పాడుతున్నాడు.

ట్రాలీ తోసుకుంటూవస్తున్న యెయిర్ హెూస్టెస్ కనిపించగానే "పానీ...పానీ!" అంటూ పెద్దగా అరిచాడు చోప్రా. యితగాడికీ నీళ్ళకూ వుండే విచిత్రమైన సంబంధ మేమిటో నాకర్థంగావడంలేదు. లేకపోతే ఆవిడ తోసుకొస్తున్న ట్రాలీలో వున్న రకరకాల పళ్ళరసాలూ, మధ్యాలూ యితడినెందుకు ఆకర్షించడంలేదు?

చుట్టూ కూర్చున్న ప్రయాణికులందరూ తిరిగి చూస్తున్నారు. బహుశా దమ్మలాల్ చోప్రా మాట్లాడుతున్న భాషేమిటో తెలియకపోవడంతో వాళ్ళు వులిక్కిపడివుంటారు.

యెయిర్ హెూస్టెస్ మాకేసి వస్తూండగా, అప్పటికప్పుడేదో అత్యవసరమైన విషయం గుర్తుకొచ్చినట్టుగా, నా వైపుకు వొంగి "వో ఐటీ వాలా... చేతన్య... వుస్‌కా వాలెట్ అబీబీ యెయిర్‌పోర్ట్‌మే... వహా..." అంటూ తనను తరుముతున్న ఆలోచనలతో పోటీబడుతున్నట్టుగా మాటలవెంట మాటలను నాకేసి విసరసాగాడు చోప్రా. యెయిర్ హెూస్టెస్ అందిస్తూన్న నీళ్ళ గ్లాసును అటువైపుకు తిరగకుండానే అందుకోబోయి, అది జారి వొళ్ళో పడ్డంతో వొక్కసారిగా పైకి గెంతాడు. గ్లాసు పూర్తిగా తిరగబడి, నీళ్ళు అతడి గోధుమ రంగు జుబ్బాను పూర్తిగా తడిపేశాయి.

"సారీ... సారీ... ఐవిల్ గెట్ యే నేప్‌కిన్ ఫార్‌యూ..." అని చెబుతూనే యెయిర్ హెూస్టెస్ పరిగెత్తి వెళ్ళిపోయింది.

యెప్పుడో వారం రోజులక్రితం పోగొట్టుకున్న వాలెట్‌కోసం చైతన్య యింకా ఆమ్‌స్టర్‌డాం విమానాశ్రయంలో వెతుకుతూనే వుంటాడని అనుకుంటున్నాడా యీ దమ్మలాల్ చోప్రా? మిగిలిన ప్రపంచంలో పరిగెత్తేకాలం, ఆమ్‌స్టర్‌డాం విమానాశ్రయంలో కుంటుతూంటుందని అనుకుంటున్నాడా యితను? యిదేం పిచ్చి?

కిందపడిన ఖాళీ ప్లాస్టిక్ గ్లాసుకేసి భయం భయంగా చూస్తూ చోప్రా వణికి పోతున్నాడు.

మూడు నాలుగు వందల యూరో డాలర్లూ, నాలుగైదు రకాల క్రెడిట్‌కార్డులూవున్న వాలెట్ కనిపించకపోయినా, డీలాపడిపోకుండా, ధైర్యంగా, తిరిగీ వాటిని సంపాదించుకో గలనన్న ధీమాతో వెళ్ళిపోయిన చైతన్యరూపం క్రమంగా నా వూహల్లోంచీ కరిగిపోయి, గ్లాసెడు నీళ్ళు పైన వొలకడంతోనే కిందుమీదులై పోతున్న దమ్మలాల్ చోప్రా ఆకారం నాముందు బలంగా నిలచిపోసాగింది.

మరికాస్సేపటిలో ఆమ్‌స్టర్‌డాం విమానాశ్రయంలో దిగబోతున్నామనీ, ప్రయాణికులందరూ సీటు బెల్టులు తగిలించుకోవలసిందనీ ప్రకటన వెలువడింది. వొక్కసారిగా ప్రయాణీకులందరూ అప్రమత్తులైపోయారు.

విమానమంతా హడావుడిపడుతున్న ప్రయాణికులతో తేనెతుట్టెలా తత్తళించిపోసాగింది. దమ్మలాల్ చోప్రా మాత్రం రాణి యీగలా నిమ్మకు నీరెత్తినట్టుగా కూర్చున్నాడు. నాప్‌కిన్ తీసుకొచ్చియిచ్చిన యెయిర్ హోస్టెస్ బెల్టుపెట్టుకోమని అతణ్ణి హెచ్చరించింది. చూపుడువేలును తన తడిసిన జుబ్బాకేసి నిగుడించి, కళ్ళుపైకెత్తి, రెప్పలల్లార్చి "పానీ... పానీ" అని పలవరించాడు చోప్రా. అతడి జుబ్బాలోని తడిసిన భాగం ముదురుగోధుమ రంగులోకి మారి, బరువైపోయి, కిందికి లాగుతోంది. దాని కొసల్లోంచీ యింకా నీటి బిందువులు రాలుతున్నాయి. విమానమంతా పరుచుకున్న చల్లటి వాతావరణాన్ని యెద్దేవా చేస్తున్నట్టుగా, చోప్రా నుదుటిపైన చెమట బిందువులు పొటమరించివున్నాయి. తడిసిన జుబ్బాకేసి చూపుతున్న అతడి చూపుడువేలు తొండతలలా వూగుతోంది. 'చూశావా, మళ్లీ సంకేతాలు అందాయి నాకు... కింద పడిన గ్లాసులోంచీ వైబ్రేషన్లు వస్తున్నాయి' అని అతడి చూపులు చెప్పకనే చెబుతున్నాయి.

విమానం మేఘాల దొంతరలను చీల్చుకుంటూ కిందికి దిగసాగింది. కిటికీలోంచీ కనబడుతున్న భూమి క్రమంగా దగ్గరవసాగింది. నగరాన్ని పాయలు పాయలుగా కమ్ముకున్న నదీ, నదిపాయలమధ్య పెరుగుతున్న చెట్లూ, చెట్ల మధ్యలో యిండ్లూ, యిండ్ల మధ్యలో యెండిన కాలవల్లాంటి రోడ్లూ, రోడ్లపైన పరిగెడుతున్న వాహనాలూ, అన్నీ క్రమంగా దగ్గరకు వచ్చాక, నిర్జనమైన విమానాశ్రయపు రన్‌వే పైకొచ్చిన విమానం, అలవోకగా టైర్లు దించి, రోడ్డుపైన పరిగెత్తసాగింది.

వున్నట్టుండి విమానంలో కలరవమేదో చెలరేగింది. ప్రయాణికులందరూ తలలు తిప్పి అటూ యిటూ చూస్తున్నారు. మాకు అయిదారు వరసల కవతల, రెండు వరసల మధ్య వో ముసలావిడ లేచి నిలబడివుంది. ఆరమగ్గిన దోసపండులా వడలిపోయిన ఆవిడ అరవయ్యేళ్ళ శరీరానికి ఆకుపచ్చరంగు టీ షర్టూ, పసుపురంగు పాంటూ యేమాత్రం నప్పడంలేదు. చాలాసేపటిక్రితం రాసుకున్న క్రీము పాలిపోయి యెండిపోవడంతో, ఆమె ముఖం బీటలు వారిన నేలలా వికృతంగా వుంది. ఆవిడ రెండు భుజాలనూ గట్టిగా పట్టుకున్న బలిష్టులైన యిద్దరు వ్యక్తులు యేదో వాకబు చేస్తున్నారు.

మా ముందున్న సీట్ల వరసల్లోంచీ యువకుడొకడు పైకి లేచాడు. మరో బలమైన వ్యక్తి అతడికేసి పరిగెత్తాడు. యెయిర్ హోస్టెస్‌లు ముగ్గురు దూరంగా గేట్ల దగ్గర నక్కి చూస్తున్నారు. విమానం రన్‌వేపైన పాకుతోంది.

ప్రయాణికులందరూ కదలకుండా కూచోవాలనీ, పైకిలేచిన వాళ్ళకు ప్రమాదమనీ ప్రకటన వెలువడింది. ప్రకటన చెబుతున్న మగకంఠంలోని వణుకుడు స్పష్టంగా వినబడుతోంది.

దమ్మలాల్‌చోప్రా నా చేయిపట్టుకుని లాగాడు. 'చూశావా, అందుకే నాకు చెడు సంకేతాలు అందాయి' అంటున్నట్టుగా వున్నాయి అతడి చూపులు. నేను పరవా లేదన్నట్టుగా తల వూపగానే "చూశావా, ఆ ముసలావిడను పహిల్వాన్లలాంటి మనుషులెలా యిబ్బంది పెడుతున్నారో?" అని హిందీలో నొచ్చుకున్నాడు.

యింతలో పొడుగ్గా, ధృడంగా వున్న మరో వ్యక్తి, యెక్కడినుంచో వచ్చి ముసలావిడ వెనక వరసలో కూర్చున్న వో కుర్రాడి చేతిలోని తోలుసంచిని లాక్కున్నాడు. నూనూగు మీసాలతో, యింకా పసితనపు ఛాయలుపోని ఆ కుర్రాడు పెద్దగా చేతులు తిప్పుతూ యేదో వాదిస్తున్నాడు.

విమానంలోని సంచలనం క్రమంగా పెరగసాగింది. ప్రయాణికుల గుసగుసలన్నీ కలిసి పెద్ద కలకలారావం తయారవుతోంది.

విమానం కదలడం మానగానే "అందరూ కదలకుండా కూచోండి. దయచేసి యెయిర్ మార్షల్స్‌కు సహకరించండి. యెవరూ భయపడవలసిన అవసరంలేదు. యిప్పుడు విమానం యెయిర్‌మార్షల్స్ చేతిలో సురక్షితంగా వుంది" అని మరో ప్రకటన వినవచ్చింది.

దమ్మలాల్ చోప్రా తల గుండ్రంగా తిప్పాక "యెయిర్ మార్షల్... వో బుడాపన్...?" అని అడిగాడు.

నేను చూపుడు వేలును పెదవులపైన ఆనించి, మౌనంగా వుండమని సైగచేశాను. అతను యింకా యేదో అడగబోయి, నేను వురిమి చూడగానే, నోరు మూసుకున్నాడు.

కుర్రాళ్ళిద్దరూ లాప్‌టాప్ సంచుల్ని తగిలించుకున్నారు. నలుగురు బలమైన వ్యక్తులు వాళ్ళను బలవంతంగా నెడుతూ ద్వారం దగ్గరికి నడిపిస్తున్నారు. ముసలావిడ కాబినెట్ తెరిచి, తన ట్రాలీ సూట్‌కేసును కిందికి దించుకున్నాక, వాళ్ళ వెనకే ద్వారం దగ్గరికెళ్ళింది. బలమైన వ్యక్తులు వాళ్ళను ద్వారంలోకి నెట్టాక, తలుపు ముందున్న తెరను అడ్డంగా లాగేశారు.

అందరూ కదలకుండా కూచోవాలనీ, యెవరూ లేవగూడదనీ మళ్ళీ ప్రకటన వచ్చింది. యెయిర్‌హోస్టెస్‌లు గూడా తెరవెనక్కు వెళ్ళిపోయారు.

విమానం కిటికీలోంచీ ఆమ్‌స్టర్‌డాం విమానాశ్రయంలో ఆగిన విమానాలూ, వాటి చుట్టూ తిరుగుతున్న ట్రక్కులూ, ట్రక్కుల పక్కన అటూయిటూ తిరుగుతున్న యూనిఫారాల

వుద్యోగులూ కనబడుతున్నారు. దూరంగా రన్‌వే పక్కనున్న గడ్డిగుములతో నీరెండ దోబూచులాడుతోంది.

"వో బుడ్డీ యెయిర్ మార్షల్ బహుత్ చలాకీహైనా! వో సబ్‌కో అచ్చా మేనేజ్ కియానై?" అని ప్రశ్నించాడు దమ్మలాల్ చోప్రా.

నేనతడికేసి విస్తుపోయి చూశాను.

విమానం మళ్లీ కదిలి, పక్కకు తిరిగి, నెమ్మదిగా ముందుకు పాకసాగింది. యింతకూ యిదివరకూ జరిగిందేమిటో నాకే గాదు, యితర ప్రయాణికులకు గూడా అర్థమయి నట్టులేదు. అందరూ గుసగుసలాడుతూనే వున్నారు. యిద్దరు యూనిఫారాల వ్యక్తులు కుర్చీల మధ్యనున్న దారిలో అటూయిటూ తిరుగుతూ ప్రయాణికులను జాగ్రత్తగా గమనించసాగారు. వో నడివయసు వ్యక్తి, కోటూబూటుతో యేదో పెద్ద కంపెనీ యెండీలా కనిపిస్తున్నవాడు – తెల్లటి చర్మంతో యూరోపియన్ అని చెప్పకనే చెబుతున్నవాడు – యూనిఫాం యువకుడిని దగ్గరకు రమ్మని సైగ చేశాడు. అతను దగ్గరికి రాగానే, కాబినెట్ వైపుకు చేయిచాపి యేదో చెబుతున్నాడు. యూనిఫాం మనిషి అంతపెద్దవాణ్ణి పురుగును చూసినట్టుగా చూసి, "షటప్... కీప్ క్వయిట్" అని దులిపి పారేశాడు.

కిటికీ కవతల మైదానంలోకి స్టెన్‌గన్‌లు చేతబట్టుకున్న సైనికుల ట్రక్కొకటి వచ్చి ఆగింది. దానిలోని యూనిఫారాల వ్యక్తులందరూ కిందికిదిగి విమానంచుట్టూ నిలబడసాగారు. విమానంలో కొనసాగుతున్న అత్యాయిక పరిస్థితికీ, బయట మూగుతున్న ఆయుధాలవ్యక్తులకూ మధ్య సంబంధముందన్న విషయం అర్థమైపోయినట్టుగా ప్రయాణికులందరూ బుద్ధిగా కుర్చీల్లో సర్దుకుని కూచున్నారు. విమానాశ్రయంలోని కాలమానానికీ, మా విమానంలోని కాలమానానికీ మధ్య సంబంధాలు తెగిపోయినట్ల నిపించసాగింది.

విమానపు మైకులోంచీ ప్రకటన రాబోయేముందు వెలువడే సంగీతం పలకరిం చింది. యిలాగే ప్రయాణికులు సహకరిస్తే యింకో పది నిముషాల్లో విమానం తలుపులు తెరుస్తామని పైలట్ చెబుతున్నాడు.

ప్రయాణికుల చూపులన్నీ విమానద్వారం దగ్గరి తెర దగ్గరే మోహరించి వున్నాయి. మా వోపికను వీలయినంత యెక్కువగా పరీక్షించిన తర్వాత, తెర తొలగించుకుని ఆర్మీ ఆఫీసరులా కనబడుతున్న వ్యక్తి వొకతను యివతలికొచ్చాడు. అతడి బూడిదరంగు యూనిఫాంపైన నలుపురంగు బెల్టూ, ఆ బెల్టుకున్న తోలు సంచుల్లోని రెండు పిస్టోళ్ళూ, తళతళా మెరుస్తున్నాయి. ఘనీభవించిన కాఠిన్యంలా అతడి ముఖం తీర్చిదిద్దినట్టుంది.

అతను యెగ్జిక్యూటివ్ సీట్లలో కూర్చున్న వాళ్ళను ముందుగా పైకిలేవమన్నాడు. వాళ్ళు వే బ్రిడ్జి దాటిపోయాక మొదటి అయిదువరసల వాళ్ళను వెళ్ళమన్నాడు.

కాబినెట్‌లోంచీ తమ సూట్‌కేసుల్ని లాక్కున్నాక వాళ్ళు తిరిగి చూడకుండా ముందుకు పరిగెత్తారు. ఆ తరువాత మరో పది వరసల్ని కదలమన్నాడు. మా సామాన్లు చేతికి తీసుకున్నాక మేమంతా జైలు తలుపులు తెరవగానే పరిగెత్తే ఖైదీల్లా ముందుకు దూసుకెళ్ళాము. యింత జరిగినా విమానపు ద్వారం దగ్గర నిల్చున్న యెయిర్ హొస్టస్ 'థాంక్యూ... హాపీటయిమ్" అని వీడ్కోలు చెబుతూ కనబడేసరికి నాకు యేడవాలో నవ్వాలో తోచలేదు.

విమానద్వారం దాటి బయటకు రాగానే, వేబ్రిడ్జి లోపల ప్రయాణికులందరూ క్యూలో నిల్చుని కనిపించారు. వేర్వేరు ప్రాంతాల్లో పండిన రకరకాల కూరగాయలతో కలిపి కుట్టిన హారం లాగున్న క్యూ నెమ్మదిగా కదులుతోంది. వేబ్రిడ్జి వొంపులు తిరగడం వల్ల ముందేం జరుగుతోందో మాకు తెలియడంలేదు. యెంతకూ మేము వేబ్రిడ్జి అవతలి ద్వారాన్ని చూడలేకపోవడంతో మేము నిల్చున్న క్యూ యీ భూగోళంనుంచీ మరేదో గ్రహం వరకూ పాకుతున్నట్టుగా అనిపించసాగింది.

"వో బుడ్డీ కహా గయా?" నా భుజంపట్టి వెనక్కు లాగుతూ దమ్మలాల్ చోప్రా కంగారుతో వణుకుతున్న గొంతుతో అడుగుతున్నాడు.

చాలాసేపు మా యెదురు చూపుల్ని వూరించీ, కవ్వించిన తర్వాత G13 గేటు తెరుచుకున్న రాక్షసి నోరులా భీకరంగా ప్రత్యక్షమయ్యింది.

G13 గేటు కవతల కుర్చీల్లో కూర్చున్న యూనిఫాం సెక్యూరిటీ వుద్యోగులు ప్రయాణికులందరి పాస్‌పోర్టులూ, వీసాలూ తీవ్రంగా పరీక్షిస్తున్నారు. మరో సెక్యూరిటీ ఆఫీసరు చేతిలోని మెటల్ డిటెక్టర్ ప్రయాణికుల శరీరాలనంతా తరచిచూస్తోంది. ద్వారం దగ్గర నిల్చున్న బూడిదరంగు యూనిఫాం యువతి తన యెక్స్‌రే కళ్ళతో ద్వారంనుంచీ వస్తున్న ప్రయాణికులను శల్య పరీక్ష చేస్తోంది. యూనిఫాంను చించుకుని బయటపడేలా పెరిగిన ఆమె లేత గులాబీరంగు శరీరం నవనవలాడుతూ, యెప్పుడో చిన్నప్పుడు నేను సైన్సు పుస్తకాల్లో చూసిన మాంసాహార పుష్పాల బొమ్మను జ్ఞాపకం చేస్తోంది. ఆమె కాళ్ళ దగ్గర నిలబడిన అల్షేషియన్ కుక్క, నోటిలోంచీ కిందికి జారిన పొడవాటి నాలుకతో, విద్యుద్దీపాల్లా మెరుస్తున్న యెర్రటి కళ్ళతో, భీకరంగా వినబడుతున్న రొప్పులతో బెదిరిస్తోంది.

తనికీలు జరుగుతున్న చోటుకు చేరగానే గబాలున నన్ను వెనక్కులాగి, తానే ముందుగా తనపాస్‌పోర్టునుసెక్యూరిటీ ఆఫీసరు ముందుంచాడు దమ్మలాల్ చోప్రా.

తన బట్టతలపైన పడిన దీపాలకాంతిని మా ముఖాలపైన ప్రతిఫలించేలా తలపైకెత్తిన సెక్యూరిటీ ఆఫీసరు "యిండియా?" అని ప్రశ్నించాడు.

దమ్మలాల్‌చోప్రా తల అడ్డంగా తిప్పుతూ “జై సల్మీర్... రాజస్థాన్...” అన్నాడు.

బట్టతల ఆఫీసరు తన ముందున్న ఫైలునోసారి తిప్పి చూశాక, చోప్రా పాస్‌పోర్టును మూడోసారి తిరగేశాడు. పాస్‌పోర్టులోని ఫోటోనూ, చోప్రానూ మార్చిమార్చి చూశాక, అతను తగిలించుకున్న తోలుసంచిని తీసివ్వమన్నట్టుగా సైగచేశాడు.

“యిస్ మే మెడిసన్... అవుర్... కితాబే...” అన్నాడు దమ్మలాల్‌చోప్రా, ఆఫీసరుకంద కుండా తన సంచిని వెనక్కు లాక్కుంటూ. టేబులు పక్కన నిల్చున్న మరో సెక్యూరిటీ ఆఫీసరు బలవంతంగా చోప్రా చేతిలోని సంచిని లాక్కున్నాడు.

“దవా అవుర్ కితాబే!” అంటూ చోప్రా పెద్దగా యేడవబోయాడు.

సెక్యూరిటీ ఆఫీసరు తోలుసంచిలోని వస్తువులనంతా టేబులుపైన బోర్లించాడు. మాత్రల స్ట్రిప్పులూ, రెండు పుస్తకాలూ, రెండు సిగరెట్టు పెట్టెలూ కిందపడ్డాయి. సెక్యూరిటీ ఆఫీసరు మాత్రల స్ట్రిప్పుల పైనున్న రాతలన్నీ జాగ్రత్తగా చదివాక, పుస్తకాల పేజీలు తిప్పసాగాడు. తలపంకిస్తూ సిగరెట్టు పెట్టెలోంచీ సిగరెట్లుపైకితీసి, వాటి వాసనలను పరీక్షిచసాగాడు. యేడుపు ముఖం పెట్టుకున్న దమ్మలాల్ చోప్రాకేసి చూడనయినా చూడకుండా, ఆ వస్తువులనంతా తిరిగీ సంచిలోకి తోసేస్తూ “యూ గో అండ్ స్టాండ్ దేర్...” అని చేతిని దూరంగా చాపాడు.

“మేరీ పాస్‌పార్ట్...అవుర్ డైరీ... సిగరెట్” అని ఘోషించాడు చోప్రా.

పక్కన నిల్చున్న సెక్యూరిటీ ఆఫీసరు అతణ్ణి ముందుకునెట్టాక, నన్ను ముందుకులాగి, నా చేతిలోని పాస్‌పోర్టును తీసి టేబులుపైన పడేశాడు. బట్టతల ఆఫీసరు దాన్నోసారి తిప్పి చూశాక నాకేసి విసిరి “నెక్స్ట్... ” అన్నాడు. నేను నా పాస్‌పోర్టును తీసుకుని ముందుకు నడచాను. వెయిటింగ్ పార్లర్‌కెళ్ళి కుర్చీలో కూలబడ్డాను.

నూరు అడుగుల దూరంలో, G13 గేటు దగ్గర నిల్చున్న దమ్మలాల్‌చోప్రా నాకేసి దీనంగా చూడసాగాడు. యిద్దరు ముసలివాళ్ళు – బహుశా భార్యభర్తలయివుంటారు – తమ తనికీ ముగిశాక వచ్చి, నా పక్కనున్న కుర్చీల్లో కూర్చుని, సెక్యూరిటీవాళ్ళు తీసి పడేసిన వస్తువులను తమ సంచుల్లోకి సర్దుకోసాగారు.

నేను వాళ్ళకేసి బెదురుచూపులు చూస్తూ, ‘యేమిటీ హడావుడి? యేమయ్యింది?’ అని యింగ్లీషులో వాకబు చేశాను. ముసలాయిన పెద్దగా పెదవులు చప్పరించాక, విషయాన్నంతా రెండు ముక్కల్లో తేల్చి పారేశాడు. ఆయన మాటల్ని విన్నాక నేను దమ్మలాల్ చోప్రాకేసి భయంభయంగా చూశాను.

దమ్మలాల్ చోప్రా అయిదడుగులకుపైన ఆరో, యేడో యించీల పొడవుంటాడు. లావుగాలేడుగానీ దృఢంగా వ్యాయామంచేస్తున్న వాడిలావుంది అతడి ఆకారం.

గోధుమరంగు శరీరమే అయినా యీశాన్య భారతదేశపు మనుషులకుండే తెలుపుదనపు పాలు కొంత కలిసేవుంది. యాభై సంవత్సరాల వాడయివుంటాడని తెలిపే బట్టతల ప్రారంభపు సూచనలు స్పష్టంగానే వున్నాయి. ముళ్ళలా సెంటిమీటరు పొడవున్న నలుపూ తెలుపూ గడ్డం... లేత నీలిరంగు జీన్సుపాంటుపైన గోధుమరంగు జుబ్బా... అత్యవసరమైనప్పుడు, అతికష్టంపైన రెండుమూడు యింగ్లీషు ముక్కలు మాత్రమే మాట్లాడే యితగాడిని, అఫ్ఘనిస్తాన్‌నుంచీ వచ్చాడని అంటే యెవరూ సందేహించరు.

G13 గేటుముందున్న అద్దాలగోడలోంచీ కనబడుతున్న ఆమ్‌స్టర్‌డాం విమానాశ్రయపు రన్‌వేలు శుభ్రంగా, నిర్మానుష్యంగా, యేవో అమానుష శక్తుల్ని ఆవాహన చేసుకుంటున్నట్టుగా కనబడుతున్నాయి. పైనున్న ఆకాశంలో తెల్లగా, బారులు బారులుగా, నీళ్ళపైన తేలాడే రాక్షసబల్లుల్లాగున్న మేఘాలు కదులుతున్నాయో లేదో తెలియడంలేదు. గేటు ముందు నిలబడిన తనిఖీ అధికారిణి భంగిమనైనా మార్చుకోవడంలేదు. ఆమెకాళ్ళ దగ్గర నిలబడి తలవూపుతున్న నల్ల అల్సేషియన్ కుక్క నాలుకపైన్నుంచీ జొల్లు బిందువులుగా బిందువులుగా కిందికి రాలుతోంది. గేటు దగ్గర తనిఖీ ముగించుకున్న యువజంట వొకటి గానుగెద్దును అనుకరిస్తున్న యెస్కలేటర్ పైకెళ్ళి నిల్చుంటోంది.

విమానం నుంచీ వేబ్రిడ్జి మీదుగా విమానాశ్రయంలోకి కొనసాగుతున్న క్యూ క్రమంగా చిన్నదై, చివరకు సెక్యూరిటీ ఆఫీసర్ల టేబులు దగ్గర అంతమైపోయింది. ఆఫీసర్లు టేబులుపైనున్న వస్తువుల్ని సర్దుకోసాగారు. అల్సేషియన్ కుక్క ముందుకు లాగుతూండగా సెక్యూరిటీ అధికారిణి ముందుకు కదిలింది.

“మేరీ పాస్‌పోర్ట్... వీసా...” అని గింజుకుంటూ దమ్మలాల్‌చోప్రా ఆఫీసర్లముందుకు పరిగెత్తాడు.

“గోదేర్... వియ్‌వాంటూ హేవ్యేక్లోజ్ చెక్...గోదేర్” అంటూ సెక్యూరిటీ ఆఫీసరు కసిరాడు.

తన పాస్‌పోర్టును తెరిచి అవతలి సెక్యూరిటీ ఆఫీసరుకు చూపెడుతున్న మొదటి సెక్యూరిటీ ఆఫీసరుకేసి దీనంగా చూస్తూ, నేలకు అతుక్కుపోయినట్టున్న పాదాల్ని బలవంతంగా పైకెత్తి బరువుగా అడుగులు వేస్తూ వచ్చి, నా పక్కన కూలబడ్డాడు దమ్మలాల్ చోప్రా. నాకేసి కొరకొరాచూసి “మేరీ పాస్‌పోర్ట్‌మే వుస్‌కో క్యా తమాషా దిక్‌లాతాహై?” అని రుసరుసలాడాడు. తర్వాత “మై వుస్ బుడ్డీ యెయిర్ మార్షల్‌కో కంప్లయింట్ కరూంగా!”అంటూ పిడికిళ్ళు బిగించాడు.

నేను వులిక్కిపడ్డాను. యెయిర్‌మార్షల్ అంటే విమానంలో ప్రయాణంచేసే పోలీసులని అర్థమనీ, వాళ్ళు మఫ్టీలో వుంటారనీ, యెవరైనా విద్రోహులున్నారని

అనుమానం వచ్చినప్పుడు మామూలు ప్రయాణీకుల్లా విమానమెక్కుతారనీ, అదను చూసుకుని పనిలోకి దూకతారనీ వివరించాను.

అంతా విన్నాక, అందుకనే ఆ ముసలావిడకు పిర్యాదు చేయబోతున్నానని మళ్లీ దబాయించాడు చోప్రా.

విమానంలో అలజడిరేపిన ముసలావిడను యెయిర్ మార్షల్ అని యీ దమ్మలాల్ చోప్రా తప్ప యింకెవరూ వూహించలేరు. దుబాయ్‌నుంచీ ఆపరేషన్లు చేస్తే అనుమానం వస్తుందని తీవ్రవాదులు యిప్పుడు వేరే దేశాలనుంచీ తమ దుర్మార్గపు పనుల్ని మొదలు పెడుతున్నారట! ఆ ముసలావిడపైన మెక్సికోలోనే అనుమానమొచ్చిందట! ఆవిడతో బాటూ ప్రయాణం చేసిన కుర్రాళ్ల ధోరణి గూడా అనుమానాస్పదంగా వుందట! వాళ్ళు వొకరి దగ్గరి నుంచీ యింకొకరు చీటీలేవో పంపుకుంటున్నారట! వెంటనే యెయిర్ మార్షల్స్ అప్రమత్తులైపోయి, వాళ్ళను వాళ్ళ సంచులూ, లాప్‌టాప్‌లతో బాటూ లాక్కెళ్ళిపోయారు. యిదివరకూ నా పక్కన కూర్చున్న ముసలాయిన చెప్పిన వివరాలు యివి.

నా మాటలు విన్నాక “మై వుస్ బుడ్డీకో యెయిర్ మార్షల్ సమజా! అవుర్ సబీలోగ్ చోర్ సమజా!” అన్నాడు దమ్మలాల్ చోప్రా దిగాలుగా. యితడి కళ్ళకు దొంగలు పోలీసుల్లా, పోలీసులు దొంగల్లా కనబడుతున్నారు. పామును తాడనుకోవడం యెంత సహజమో, తాడునుచూసి పామని భ్రమించడం కూడా అంతే సహజమని వేదాంతులు చెబుతుంటారు. ప్రజలందరూ చూసినట్టుగా కాకుండా, వాళ్ళకు విరుద్ధంగా చూసేవాళ్ళకే వింత సంకేతాలూ, అనుభవాలూ దొరుకుతాయేమో!

“వో చీటీమే క్యా లిఖా హై!”అంటూ దమ్మలాల్ చోప్రా మరో సందేహాన్ని లేవనెత్తాడు.

యెవరికి తెలుసు? అది అరబ్బీనో, వుర్దూనో, యే భాషో? ఆ సెక్యూరిటీ ఆఫీసర్లు యిప్పుడు యితగాడి డైరీల్లో యేం రాసుందో తెలుసుకోడానికి తంటాలు పడుతూ వుంటారు.

“మేరీ డైరీ మే క్యాహై! వోసబ్ పొయిట్రీ ....” అని విస్తుపోయాడు దమ్మలాల్ చోప్రా.

యీ జైసల్మీర్ వ్యాపారికి బిజినెస్ మేనేజ్‌మెంట్ చదువులతో బాటూ కవిత్వం రాసే పిచ్చిగూడా వుందని యెవరూహించగలరు?

ఆ ముసలావిడకు గూడా కవిత్వంరాసే అలవాటుందేమోననీ, యిప్పుడా సెక్యూరిటీ ఆఫీసర్లు యేది కవిత్వమో, యేది విద్రోహమో తెలియకపోవడంతో జుట్టు పీక్కుంటూ వుంటారనీ అన్నాను.

"పానీ గిరానా అచ్చా సంకేత్‌నై... కుచ్ తో హోగా!" అన్నాడు దమ్మలాల్ చోప్రా తడిసిన తన జుబ్బాకేసి చూస్తూ.

యింతలో బట్టతల ఆఫీసరు మాకేసి చరచరావచ్చి, పాస్‌పోర్టునూ, తోలుసంచినీ దమ్మలాల్ చోప్రా ముందు పడేసి వెళ్ళిపోయాడు. అతడితో బాటూ మిగిలిన సెక్యూరిటీ ఆఫీసర్లు గూడా పరిగెడుతున్న యెస్కలేటర్‌పైన కదనుతొక్కుతున్నట్టుగా నడచిపోయారు.

తన వస్తువులనంతా సర్దుకున్నాక "మేరీ డైరీ... మేరీ డైరీ" అని గొల్లుమన్నాడు దమ్మలాల్ చోప్రా.... రెండు నిముషాలు గడచాక ఆ డైరీలనిండా తన కవితలున్నాయనీ, అవి యింకా ప్రచురించబడలేదనీ, ఆదొంగ సెక్యూరిటీ ఆఫీసర్లు వాటిని తస్కరిస్తే తన గతేమిటనీ పెద్దగా వాపోయాడతను.

యెక్కడో కవిని పిచ్చివాడని చదివినట్టు గుర్తుంది. మరెక్కడో తీవ్రవాదాన్ని గూడా పిచ్చితనమని రాశారు. అయితే వొక పిచ్చిని, మరో పిచ్చిగా గుర్తించడం మాత్రం నేనిప్పుడే చూశాను.

"బహుత్ ప్యాసాలగ్‌తాహై! పానీ హోనా!" అన్నాడు దమ్మలాల్ చోప్రా అనాలోచితంగా. నేను సూటిగా చూడగానే వులిక్కిపడి, "పానీ గిరానా బురా సంకేత్... బహుత్ బురా సంకేత్!" అన్నాడు. సెక్యూరిటీ ఆఫీసర్లు తన డైరీ లాక్కుపోవడంతో తనకందిన చెడు సంకేతం నిరూపించబడిపోయిందని దమ్మలాల్ చోప్రా భావిస్తున్నట్టున్నాడు.

మావూళ్లో పిల్లి యెదురైతే బయల్దేరినపని సానుకూలంగా జరగదని నమ్మేవాళ్ళున్నారు. ఆమెరికా దేశంలో డైనింగ్ టేబులుపైన వుప్పు చిందడం దుశ్శకునమని నమ్ముతారని విన్నాను. అయితే మంచినీళ్ళు వొలికిపడడం చెడ్డ శకునమని నమ్మేవాళ్ళున్నారని నాకు వారం క్రితమే తెలిసింది.

అయితే మనకు తెలియని చోటునుంచీ సంకేతాలు అందుకునే ప్రత్యేకమైన శక్తివుండే యీ దమ్మలాల్ చోప్రా, తాను డైరీని పోగొట్టుకోవడమన్నది చిన్న నష్టమేమీగాదనీ, యీ నష్టం మరేదో గొప్ప అద్భుతానికి మూలకారణమవుతుందనీ గట్టిగా నమ్ముతున్నాడట!

యింతకూ యీ ఆమ్‌స్టర్‌డాం విమానాశ్రయంలో యే అద్భుతం జరగబోతోందని యితననుకుంటున్నాడు?

# 4

తనకు చాలా దాహంగా వుందనీ, యీ అధ్వానం విమానాశ్రయంలో తనకు నీళ్ళెక్కడ దొరుకుతామో తెలియడం లేదనీ మళ్ళీమళ్ళీ వాపోసాగాడు దమ్మలాల్ చోప్రా.

తామస్‌కుక్ ట్రావెలింగ్ యేజెంటు గాబ్రియల్ ముండా, మేము ఢిల్లీలో బయల్దేరి నప్పుడు కొంత మెక్సికన్ కరెన్సీగూడా యిచ్చాడు. మెక్సికోలో మేము ఖర్చు పెట్టింది చాలా తక్కువ. అక్కడినుంచీ తిరిగి వచ్చేటప్పుడు మా దగ్గర మిగిలిన మెక్సికన్ కరెన్సీని, విమానాశ్రయంలోని యెక్స్చేంజీ కౌంటర్‌లో యిచ్చి డాలర్లుగా మార్చుకున్నాము. అయితే యీ ఆమ్‌స్టర్‌డాం విమానాశ్రయంలో యూరో డాలర్లకు తప్ప మరో కరెన్సీకి విలువున్నట్టులేదు. సముద్రంలో నీళ్ళున్నా అవి తాగడానికి పనికిరావు. సరిగ్గా అలాగే వుంది యిప్పుడు మా యిద్దరి పరిస్థితి.

"యిప్పుడు యిక్కడి లోకల్ టైం మధ్యాహ్నం రెండున్నర. మన ఢిల్లీ విమానంరేపు మధ్యాహ్నం పదకొండు గంటలకు. అంటే యిప్పుడు మనం యీ విమానాశ్రయంలో యేకధాటిగా యిరవై గంటలు గడపాలి" అన్నాను.

ఆలోచనలోపడిపోయి నేను తెలుగులో మాట్లాడినట్టున్నాను. దమ్మలాల్‌చోప్రా విస్తుపోయి "క్యా? క్యా?" అని నోరు తెరిచేశాడు.

నేను విసుగ్గా "ట్వంటీ అవర్స్ యిన్ ఆమ్‌స్టర్‌డాం స్కిపోల్ యెయిర్‌పోర్టు..." అన్నాను.

"వుతనా సమయ్ కైకో...?" అన్నాడు దమ్మలాల్ చోప్రా ముక్తసరిగా. బహుశా అద్భుతం జరగడానికంత సమయం అవసరం లేదన్నది అతడి భావంగావచ్చు

విమానాశ్రయపు అద్దాలగోడలోంచీ దూరంగా నేలపైకి వాలుతున్న నీలి ఆకాశం మేఘాలులేకుండా ప్రశాంతంగా కనబడుతోంది. విమానాశ్రయపు అంచుకూ, దిగంతరేఖ దగ్గరున్న ఆకుపచ్చని చెట్లకూ మధ్య కదులుతున్న చుక్కల్లాంటి వాహనాలు, అక్కడొక రోడ్డుందని తెలుపుతున్నాయి. దూరంగా పొడవాటి స్థంభాలకు కట్టిన గాలి గుమ్మటా ల్లాంటి పతాకాలు గాలివాటుకు నెమ్మదిగా వూగుతున్నాయి. విమానాశ్రయంలో ఆగిన విమానాలచుట్టూ ట్రక్కులూ, వుద్యోగులూ గౌరవంతో ప్రదక్షిణలు చేస్తున్నారు. విమానాశ్రయంలోపల విద్యుద్దీపాల వెలుతురు సమతౌల్యంగా పరుచుకుంటోంది. అవతలి రెస్టురూములోంచీ పొడవాటి ప్లాస్టిక్ చీపురు పట్టుకుని వస్తున్న నీలిదుస్తుల వుద్యోగికూడా అద్దంపైన కదిలే నీడలా నిశ్శబ్దంగా కదులుతున్నాడు. మేమిద్దరమూ తప్ప యీ మూలున్న లౌంజ్‌లో యింకెవరూలేదు.

లౌంజ్ కటుచివరలో, రిబ్బన్లు వేలాడుతున్న బారికేడ్ల కవతల, పెద్ద యినుపకమ్ముల గుండ్రటి పరికరమొకటి భూగోళపు అస్థిపంజరంలా కనబడుతోంది. దానిముందు "చిల్డ్రన్స్ ప్లేజోన్" అనే బోర్డుండడంతో అది పిల్లలు ఆట్లాడుకునే వస్తువని తెలిసిపోతోంది. ఆడుకునేటంత తీరికున్న పిల్లలెవరూ అక్కడికి రాలేదేమో, అది బిక్కుబిక్కుమంటూ బోసిపోతోంది.

పిల్లలు ఆడుకునే చోటికి దగ్గరగా కూచోవడంతో నాలో చిన్నప్పుడెప్పుడో ఆగి పోయిన ఆటలధ్యాస మెల్లగా చివుర్లు తొడుగుతున్నట్టుగా అనిపించసాగింది. మావూర్లో కోతీ కొమ్మా ఆటలో నేను పెద్ద మేటీ! (మేటీ అంటే అప్పటి మా చిన్నపిల్లల పరిభాషలో గొప్ప ప్రవీణుడని అర్థం) బహుశా మన పూర్వీకుల అంశేదో నాలో యింకా కొంత మిగిలినట్టుంది. అందుకే చెట్లెక్కడమంటే నాకు చిన్నప్పుడెంతో యిష్టంగా వుండేది.

"పానీ... గిరానా... ప్యాసా... సంకేత్" అంటూ దమ్మలాల్ చోప్రా యింకా అరిగి పోయిన పాత పాటే పాడుతున్నాడు. పదిరోజులక్రితం ఢిల్లీ విమానాశ్రయంలో కలిసిన వ్యక్తికీ, యిప్పుడు నా పక్కన కూర్చున్న వ్యక్తికీ మధ్య మార్పేదైనావుంటే అది మెక్సికో దేశపు సత్తా అని అర్థం. యీ ప్రమాణంతో కొలిస్తే మెక్సికో నగరమే పరాజయం పాలవుతోందియిప్పుడు.

తొమ్మిదిరోజులక్రితం మెక్సికో విమానాశ్రయంలో దిగినప్పుడు న్యూ మెక్సికో యూని వర్సిటీ వాళ్ళ వాలెంటీర్లు మమ్మల్ని వాళ్ళ యూనివర్సిటీ అతిథి గృహానికి తీసుకెళ్ళారు. మాకిద్దరికీ వేర్వేరు గదులిచ్చి పుణ్యం గట్టుకున్నారు. దానితో నాకీ దమ్మలాల్ చోప్రాతో వేగాల్సిన పని తప్పింది. సెమినారు జరిగిన మూడురోజులూ యెవరిపార్లల్ సెషన్లలో వాళ్ళుండి పోవడంతో మాకిద్దరికీ కలిసే అవసరం రాలేదు. ఆ తరువాత లోకల్ సైట్ సీయింగ్ కెళ్ళినప్పుడు నేను వెళ్ళిన బస్సులో అతనులేడు. చివరిరోజు ఇండియన్ యెంబసీ వాళ్ళిచ్చిన పార్టీలో డిప్యూటీ అండర్ సెకరట్రీ బ్రిజ్ మోహన్ గుప్తాకు తోకలా వెన్నంటి తిరిగుతూ కనిపించాడు. నాకేసి గంభీరంగా చూస్తూ, మా తిరుగు ప్రయాణపు టికెట్టును యెలాగైనా మార్పించి, అమ్‌స్టర్‌డాం విమానాశ్రయంలో వొకరోజు పడిగాపులు పడాల్సిన ప్రమాదాన్ని తప్పించడానికి ప్రయత్నిస్తున్నానన్నాడు. డిప్యూటీ అండర్ సెకరట్రీ బ్రిజ్‌మోహన్‌గుప్తా నన్ను పలకరిస్తున్నట్టుగా నవ్వి, కెయెల్ యెమ్ వాళ్ళతో మాట్లాడానసీ, యేమాత్రం వీలున్నా మాకు వేరే టికెట్టు యేర్పాటు చేస్తాననీ అన్నాడు. అవసరమయితే అంబాసిడర్‌తోనే ఫోను చెయ్యిస్తానని హామీ యిచ్చాడు. కానీ అరగంట తర్వాత మళ్ళీ నా దగ్గరికొచ్చి తన ప్రయత్నమంతా వృధా అయిపోయిందనీ, ఆమ్‌స్టర్‌డాం యెయిర్ పోర్టులో సెక్యూరిటీ బాగా టయిటైపోయిందనీ, కనీసం అక్కడి యెయిర్‌పోర్టు హొటల్లో గదిగూడా తీసివ్వలేకపోతున్నాననీ చేతులు పైకెత్తేశాడు.

అప్పుడుగూడా దమ్మలాల్ చోప్రా కళ్ళు అరమోడ్చి "వహా అద్భుత్ నికల్‌నా హెూగా! వుస్‌కో కౌన్ బదల్ సక్‌తే!" అని పెద్దగా నిట్టూర్చాడు.

బ్రిజ్‌మోహన్ గుప్తా నన్ను పక్కకు లాక్కెళ్ళి, అద్భుతమంటే యేమిటి? దాన్ని యెవరైనా యెందుకు తప్పించలేరు? – అంటూ మౌలికమైన సందేహాల్ని వెళ్ళగక్కాడు.

జై సల్మీర్‌లో వ్యాపారంచేస్తూ బిజినెస్ మానేజ్‌మెంట్ సెమినారులో పత్ర సమర్పణ చేయడంకోసం మెక్సికోకు వచ్చిన యీ నడివయసు మేధావికి, యేదో అంతపట్టని చోటునుంచీ ఆశ్చర్యకరమైన సంకేతాలు అందుతున్నాయని చెబితే నన్న తను పిచ్చివాడను కోడా? ఆమ్‌స్టర్‌డాం విమానాశ్రయంలోని రెస్టరూంలో బందీ అయిన అనుభవంతో దమ్మలాల్ చోప్రా ఆచోటంటేనే భయపడి పోయాడనీ, అందుకే యెలాగైనా అక్కడ వేచివుండే ప్రమాదాన్ని తప్పించుకోవాలనుకుంటున్నాడనీ చెప్పాను.

“మీరు రావడానికి రెండు రోజులముందు, అంటే ఆగష్టు 23వ తేదీన ఆమ్‌స్టర్ డాంలో పెద్ద గొడవ జరిగింది. అప్పటినుంచీ యెయిర్‌లైన్స్ వాళ్ళు మామాట ఖాతరు చేయడంలేదు” అన్నాడు బ్రిజ్‌మోహన్‌గుప్తా బీహారీయాస స్పష్టంగా కనబడుతున్న యింగ్లీషులో.

ఆగష్టు 23వ తేదీన బొంబాయి వెళ్తున్న నార్త్ వెస్ట్ విమానంలో పన్నెండుమంది ఆసియన్లను అరెస్టు చేశారట! ఆ పన్నెండుమందీ అనుమానాస్పదంగా ప్రవర్తించడంతో విమానంలోని తోటి ప్రయాణీకులు కంగారుపడి యెయిర్‌హోస్టెస్‌లకు పిర్యాదు చేశారట!వాళ్ళు తమ ప్లాస్టిక్ సంచుల్లో యేవో సర్దుకుంటూ, సెల్లుఫోన్లు మార్చుకుంటూ, సీటు బెల్టులు పెట్టుకోమన్న దీపపు గుర్తు వెలుగుతున్నా పట్టించుకోలేదట! అప్పుడా DC10 విమానంలో వున్న యెయిర్ మార్షల్స్ రంగంలోకి దూకి ఆ పన్నెండుమంది అనుమానాస్పదులనూ అదుపులోకి తెచ్చుకున్నారట! యీలోగా ఫైటర్ జెట్ విమానం యెస్కార్టుగా రావడంతో నార్త్ వెస్ట్ విమానం బొంబాయికెళ్ళడానికి బదులుగా వెనక్కు తిరిగి ఆమ్‌స్టర్‌డా చేరిందట! ఆ విమానంలోని 149 మంది ప్రయాణీకులూ ఆరోజు ఆమ్‌స్టర్‌డాం హొటల్లో గడిపి మరునాడు బొంబాయి కెళ్ళారట! ఆ పన్నెండుమంది ఆసియన్లను డచ్ పోలీసులు బేడీలువేసి విచారిస్తున్నారట.

అయితే ఆ పన్నెండుమందీ భారతీయులేనా? వాళ్ళందరూ విద్రోహులేనని యెలా గనుకున్నారు?– అవీ నా సందేహాలు.

ఆ విషయాలు స్పష్టంగా చెప్పే రుజువులేవీ దొరికినట్టు లేదన్నాడు బ్రిజ్‌మోహన్ గుప్తా. దోషులని నిరూపించబడక ముందే వాళ్ళ చేతులకు బేడీలు తగిలించడం జాత్యహం కారపు పని అనీ, అది దుర్మార్గమనీ ‘ఆసియన్ యేజ్’ పత్రిక విలేఖరి రాశాడట! దానికి డచ్ పాఠకులు తమ పోలీసులదేం తప్పులేదనీ, అనుమానితులు విమానపు సిబ్బందికి సక్రమంగా సహకరించలేదనీ, యిప్పుడు విమానాల్లోనూ, విమానాశ్రయాల్లోనూ తరుచుగా జరుగుతున్న ప్రమాదాల్ని కొత్తగా ప్రయాణాలు చేస్తున్నవాళ్ళు సక్రమంగా పట్టించుకోవడంలేదనీ, ప్రయాణీకులు సెక్యూరిటీ విధానాల్ని ముందుగా అర్థం చేసుకునితీరాలనీ, వాళ్ళు తీవ్రవాదులు అయినా కాకపోయినా తమ మూర్ఖత్వానికి

తగిన శిక్షేపడిందనీ వాదించారట! పైగా ప్రపంచంలో యేదేశంలోనైనా యిలా యెవరినైనా ప్రమాదకారులని అనుమానించినప్పుడు బేడీలు తగిలిస్తారనీ, యిదే సంఘటన యిండియాలో జరిగివుంటే బొంబాయి పోలీసులు గూడా విదేశీయులకు యిలాగే బేడీలు వేసి వుంటారని తేల్చిపారేశారట!

మా టికెట్లు మార్పించలేకపోవడానికి యీ గొడవే కారణమయ్యిందని బ్రిజ్‌మోహన్ గుప్తా వాదించాడు. యీ సంగతి తెలిసాక ఆమ్‌స్టర్‌డాంలో వొకరోజు గడపడమన్నది మరింతగా మమ్మల్ని భయపెడుతుందని గూడా అతను తెలుసుకోలేకపోయాడు. యీ సమస్యలంతా తెలిసీ తెలియని అమాయకులకేననీ, మాలాంటి పెద్దచదువులు చదువు కున్నవాళ్ళు జాగ్రత్తగానే వుంటారనీ, అవసరమైతే వోసారి విమానాశ్రయాల్లో పాఠిం చాల్సిన నియమాలను చదువుకొని వెళ్ళమనీ అన్నాడతను. అతనలా నా భుజం చరిచి వెళ్ళిపోగానే దమ్మలాల్ చోప్రా నాదగ్గరికొచ్చి బ్రిజ్‌మోహన్‌గుప్తా అమాయకుడనీ, తన శక్తియుక్తుల నంతా వుపయోగించి మాటికెట్లు మార్చడానికి ప్రయత్నించివుంటాడనీ, అయితే అద్భుతమన్నది ఆవిష్కరించబడాలని నిర్ణయించబడివుంటే దాన్ని మార్చడానికి మానవ మాత్రుల చేతనవదనీ జాలిపడ్డాడు.

యింతకూ మా టికెట్లు మార్పించమని బ్రిజ్‌మోహన్ గుప్తావెంటబడిందీ యితనే! యిప్పుడు ఆపని మానవమాత్రుల చేతసాధ్యంకాదని మాట్లాడుతున్నదీ యితనే!

నేనతడికేసి అదోలా చూడగానే దమ్మలాల్ చోప్రా చిదానందంగా నవ్వి, మానవ మాత్రుడిగా తాను ప్రమాదాన్నుంచీ తప్పించుకోడానికే ప్రయత్నించాననీ, కానీ కనిపించని గొప్ప శక్తులేవో తనను జరగబోయే గొప్ప అద్భుతానికి వాహికగా మార్చుకోదలచు కున్నప్పుడు ఆపడమెలాకుదురుతుందనీ వాదించాడు.

మేము కూర్చున్న లౌంజ్ గాజుగోడకవతల, దూరంగా, చెట్లు గాలివాటుకు తలలాడిస్తున్నాయి. సన్నగా తుంపర రాలుతోంది.

"బరసాత్.... బర్సాత్...." అన్నాడు దమ్మలాల్ చోప్రా వుద్వేగంగా. ఆమ్‌స్టర్ అనేనదికి ఆనకట్టకట్టిన చోట యేర్పడిన నగరం గాబట్టి యీ వూరికి ఆమ్‌స్టర్‌డాం అనే పేరువచ్చిందని, కొత్తగా తానావిషయాన్ని కనిపెట్టినట్టుగా చెప్పనారంభించాడు అతను. అంటే యేమిటి? అటు నది... యిటు ఆనకట్ట... యీ నీళ్ళెప్పుడైనా తొణకవచ్చు. మన్నూ మిన్నూ యేకం గావచ్చు. నీటి ద్వారా వచ్చే సంకేతాలు తారస్థాయికి చేరడానికి ఆమ్‌స్టర్‌డాం కంటే మంచి వేదిక యెక్కడ దొరుకుతుందని ప్రశ్నించాడు చోప్రా. నదులన్నీ కలిసి సముద్రాన్ని తయారు చేసినట్టుగా, సంకేతాలన్నీ కలిసి (లేకపోతే అనుమానాలన్నీ కలిసి) అద్భుతాన్ని తయారుచేస్తాయట!

యింతకూ ఆ అద్భుతం యేమిటి? అదెలా జరుగుతుందని అనుకుంటున్నాడీ వ్యక్తి?

ఆప్రశ్నలే అడిగానతడిని.

# 5

నా ప్రశ్నలకు సమాధానంగా దమ్మలాల్ చోప్రా గుంభనగా నవ్వాడు. తర్వాత బుంగమూతిపెట్టి యేదో పాటపాడుతున్నట్టుగా, "బహుత్ ప్యాసా లగతాహై... యహా పానీ కహామిల్‌తా?" అని రాగం తీశాడు.

నీళ్ళులేనప్పుడు దాహమూ, నీళ్ళుదొరికినప్పుడు సంకేతాలూ కలగలిసి చోప్రాతో దోబూచులాడుతున్నాయేమోననిపిస్తోంది. నేను విసుగ్గా మాముందున్న గాజుగోడకవతల యిప్పుడే వచ్చి ఆగిన నీలితోక విమానంకేసి చూపులు తిప్పాను. వున్నట్టుండి వెనకనుంచీ గాటయిన వాసనొకటి దాడిచేసేసరికి వులిక్కిపడి తలతిప్పిచూశాను.

పత్రికల్లో స్కూటర్‌బార్న్ ఆగంతకులనీ, కార్‌బార్న్ దుండగులనీ రాస్తుంటారుగదా! అలా యెయిర్‌బార్న్‌గా అక్కడో స్త్రీ ప్రత్యక్షమయ్యింది. ఆవిడ నలుపురంగు పాంటుపైన నారింజరంగు బుష్‌షర్టు తొడుక్కుని, దానిపైన యెర్రటి చుక్కలున్న పసుపురంగు కోటును వేలాడేసుకుంది. పొడవాటి తెల్లవానిటీ బాగ్‌ను మోస్తున్న ఆకుపచ్చరంగు ట్రాలీ సూట్‌కేసును లాక్కుంటూ వచ్చి, మా పక్కనుంచీ నడుచుకుంటూ వెళ్ళి, సగంకుర్చీనీ సగం వాలుకుర్చీని కలగలిపి తయారుచేసినట్టున్న చెయిస్ పైన కూచుంది. పెద్ద నల్లకళ్ళజోడు వెనక కళ్ళుదాచుకున్న ఆమె గులాబీ రంగు ముఖంపైన చెమట బిందువులు ముత్యాల్లా మెరుస్తున్నాయి. ఆమె చెవులకు గాజుల కంటే పెద్దవైన రింగులు వేలాడుతున్నాయి. నల్లటి లిప్‌స్టిక్‌తో వున్న పెదవులు ముఖంపైన అతికించినట్టుగా కృత్రిమంగా వున్నాయి. వో చేతికి రెండంగుళాల వెడల్పున్న వెండిగాజూ, మరోచేతికి పసుపురంగు బెల్టున్న గుండ్రాయిలాంటి వాచీ వున్నాయి. ఆమె చెయిస్ లాంగ్ కుర్చీపైన కూచోగానే నేలకుచాపుకున్న ఆమెపాదాలను జానెడు పొడవు హీలున్న నల్లటి తోలుచెప్పులు తమరకొయ్యల్లా పైకెత్తి పట్టుకున్నాయి. యిప్పుడే తలస్నానం చేసివచ్చి నట్టుగా ఆవిడ గోధుమరంగు వుంగరాల జుట్టు గాలిలో నాట్యం చేస్తోంది.

ఆమెను చూసిన సంరంభంలో యెండిపోయిన తనపెదవుల్ని నాలుకతో తడుపు కుంటూ, నాకు మాత్రం వినిపించేలా, "జపానీ?!" అని అడుగుతూ, కొంటెగా కన్ను గీటాడు దమ్మలాల్ చోప్రా. అంతపొడుగ్గా, దృఢంగా వున్న స్త్రీని జపానీ అని దమ్మలాల్ చోప్రా తప్ప మరో వ్యక్తి వూహించలేడని పందెం కాయగలను. నేను నతడికేసి

విడ్డూరపడుతూచూసి, “కాదుకాదు. ఫ్రెంచో, జర్మనో....” అని గొణిగాను. తరువాత మరచిపోయిన విషయమేదో జ్ఞాపకంవచ్చి వులిక్కిపడి, ఆఫ్ఘనిస్తానో, యిరానో అయినా కావొచ్చునన్నాను.

ఆవిడ తన వానిటీ బాగులోంచీ నీళ్ల సీసాతీసుకుని, నోటిపైకెత్తింది. ఆమె నీళ్ళుతాగుతూండగా, ఆవిడమెడలో వయ్యారంగా కదులుతూన్న కండరాలనే గుడ్లప్పగించి చూడసాగాడు చోప్రా. ఖాళీ అయిన సీసాను పక్కనపడేశాక, ఆవిడ చెయిస్‌లాంగ్‌పైన నడుంవాల్చింది. తరువాత పక్కకు తిరిగి, మా యిద్దరికేసి చూస్తూ చిరునవ్వునవ్వింది.

నేను విస్తుపోయాను. చోప్రా వులిక్కిపడి, అంతలో సర్దుకుని టూత్‌పేస్టు ప్రకటనలోని మనిషిలా పళ్ళన్నీ కనబడేలా పెదవుల్ని సాగదీశాడు.

ఆమె బుగ్గలు నొక్కులు పడుతూండగా బలవంతంగా పెదవులు విప్పి “వాటీజ్‌ది టైమ్ నౌ?” అంది.

నేనావిడ చేతికున్న పెద్దగడియారంకేసి కళ్ళు చిట్లించుకుని చూశాను.

“థ్రీ తర్టీన్ లోకల్ టైం...” అని పెద్దగా అరిచాడు దమ్మలాల్ చోప్రా.

మెల్లగా కదలిన ఆమెపెదవుల్లోంచీ ‘త్యాంక్యూ’ అన్న మాట జారినట్టుగా తోచింది.

ఆమె పడేసిన ఖాళీ నీళ్ళ సీసాకేసి చూసి, పెదవులు చప్పరిస్తూ “కితనా సాల్? చెబ్బీస్ యా తీస్...” అని అడిగాడు చోప్రా .

ఆవిడ వయస్సు యిరవయ్యయిదు నుంచీ యాభైవరకూ యెంతయినా వుండొచ్చు.

దమ్మలాల్ చోప్రా సిగ్గుపడుతున్నట్టుగా నవ్వి, వయస్సుతోపనే ముంది లెమ్మనాడు. కాసింత ప్రేమే కదా కావల్సిందని తేల్చిపారేశాడు.

నేను విస్తుపోయి, అతనికెందరు పిల్లలున్నారని అడిగాను. అతను చిలిపిగా నవ్వి, పెళ్ళయ్యేవుంటే పిల్లలెందుకుండరని యెదురు ప్రశ్నవేశాడు. అంటే తనకింతవరకూ పెళ్ళేగాలేదా? తనను చూసి తనకు పెళ్ళయ్యిందో లేదో వూహించమంటూ సవాలు చేశాడతను. చూడ్డానికి యాభై యేళ్ళవాడిలాగున్నాడు గదా యితను! మావూళ్ళోనయితే యిలాకనబడేవాళ్ళు తాతలు గూడా అయ్యారు. నన్ను కాస్సేపు వుడికించాక తనకిద్దరు పిల్లలున్నారనీ, అబ్బాయి తన వ్యాపారపు బాధ్యతలను పంచుకుంటున్నాడనీ, అమ్మాయికి పెళ్ళయి సంవత్సరం దాటిందనీ చెప్పాడు చోప్రా. ‘నేనంతపెద్దవాడిగా కనిపించనుగదా’ అని అడుగుతూ పెద్దగా నవ్వేశాడతను. తనకు యిరవయ్యేళ్ళకంతా పెళ్ళయిపోయిందట! అతడి భార్య అతడికంటే యేడేళ్ళు పెద్దదట! యింతకూ ఆవిడకది రెండో పెళ్ళట! ఆవిడ మొదటి మొగుడు ఆమె పెళ్ళయిన రెండేళ్ళకే బాల్చీ తన్నేశాడట! ఆవిడ యీ

చోప్రా తెలివితేటలకు పడిపోయిందట! ప్రపంచంలో వుండే గొప్ప మేధావులందరూ తనకంటే పెద్దదయిన స్త్రీలనే పెళ్ళాడారట! మంచి వయస్సులో వుండే మొగవాడు తనకంటే పెద్దదీ, మంచి హుమ్మస్సులో వుండేదీ అయిన ఆడదాన్నే పెళ్ళాడాలనీ, తనకు నడివయస్సు వచ్చాక కావాలంటే యింకో స్త్రీని పెళ్ళి చేసుకోవచ్చుననీ, మొగవాడు రెండు మూడు పెళ్ళిళ్ళు చేసుకోవడంలోనే సుఖముందనీ దమ్మలాల్ చోప్రా చెప్పుకు పోయాడు.

అతను చెబుతున్న తీరుచూస్తే, అతను మాట్లాడుతున్నది నాతోనో, లేకపోతే అవతల వాలుకుర్చీలో నడుమువాల్చిన గులాబీ రంగు స్త్రీ తోనో అర్థంగావడంలేదు. ఆవిడ శరీరంపైనే మోహరించిన అతడి చూపులు యిప్పటికిప్పుడు అతను మరోపెళ్ళికి సన్నద్ధమయినట్టేనని చెబుతున్నాయి.

యిప్పుడే లాహోరు నుంచీ వచ్చినట్టు కనబడుతున్న దమ్మలాల్ చోప్రా, యిప్పు డిప్పుడే కాబూల్ నుంచీ దిగుమతయినట్టుగావున్న యీ గులాబీరంగు స్త్రీ, మంచి జోడీనే! వీళ్ళిద్దరూ పక్కపక్కన నిలబడితే యిక్కడి ఆమ్‌స్టర్‌డాం సెక్యూరిటీ ఆఫీసర్లు అనుమానపడకుండా వుండడమే అసాధ్యం.

యేదో నిర్ణయించుకున్నట్టుగా దమ్మలాల్ చోప్రా గబాలున పైకిలేచాడు. ఆ హాలీవుడ్ సుందరి పడుకున్న వాలుకుర్చీకేసి కదిలాడు. నేను కంగారు పడుతూ అతడిచేయిపట్టుకుని వెనక్కులాగాను. అతను నా చేతిని విదిలించిపారేసి ముందుకు వేగంగా కదిలాడు. వాలుకుర్చీ దగ్గరికెళ్ళి నిల్చున్నాక నాకేసి తిరిగి దోరగానవ్వాడు. ఆవిడ నిద్రపోతోందని చెబుతున్నట్టుగా సైగచేశాడు. నేను భయంతో వణుకుతూండగా అతను నెమ్మదిగా వంగాడు. మరోసారి నాకేసి అదోలాచూసి, పళ్లికిలించి నిశ్శబ్దంగా నవ్వాడు. ఆవిడ పక్కనపడేసిన సీసాను చేతికందుకుని పైకి లేచాడు. యిప్పుడే వస్తానన్నట్టుగా సైగచేసి, పక్కకు తిరిగి, లౌంజ్‌దాటుకుని వెళ్ళిపోయాడు.

దమ్మలాల్ చోప్రా యేంచేసేస్తాడోనన్న భయంతో వేగంగా కొట్టుకోవడం మొదలెట్టిన నాగుండె యింకా గీపెడుతూనే వుంది. పెద్దగావూపిరి పీల్చుకుంటూ తేరుకోవడానికి ప్రయత్నించాను.

మేము కూర్చున్న లౌంజ్ విమానాశ్రయంలో వోమూలకు చొచ్చుకుని వచ్చిన లోయలా కనబడుతోంది. మా ముందున్న గాజుగోడ, అవతల తిరుగుతున్న విమానాల నుంచీ వస్తున్న శబ్దాలను యిటువైపుకు రానివ్వడం లేదు. ఆకాశం వరకూ పెరిగినట్టున్న పైకప్పుతో, విశాలమైన ఆ లౌంజ్ వొంటరిగ్రహంలా తోస్తోంది. లౌంజ్ కటు చివరి పిల్లల ఆటస్థలంలోని యినుపకమ్ములగ్లోబు ప్రపంచపు అస్థి పంజరంలా వికృతంగా వుంది. దానికి వేలాడుతున్న ప్లాస్టిక్‌దారాలు సగం తెగిన రక్తనాళాల్లాగున్నాయి.

లౌంజ్‌కిటుచివర వాలు కుర్చీలోపడుకున్న స్త్రీ, హాలీవుడ్ సినిమాల్లోని కథానాయకిలాగా కనబడుతోంది. వికృతమైన అస్థిపంజరంలాంటి గ్లోబు ఆడుకుందాం రమ్మని పిలుస్తు న్నట్టుగా ఆకర్షిస్తోంటే, అందమైన యీ విదేశీ సుందరి నాలో భయాల్నిరేకెత్తి స్తోందెందుకని? నా వొంటరి తనాన్ని రెట్టింపు చేయడంకోసమన్నట్టుగా, హాలీవుడ్ సుందరి దగ్గరినుంచీ సన్నటి గురక మెల్లగా మొదలై, క్రమంగా లౌంజ్‌నంతా పరుచుకోసాగింది.

మా వొంటరి గ్రహంలోకి వస్తున్న అన్యగ్రహవాసిలా, ముఖానికో మాస్కు తగిలించుకున్న సెక్యూరిటీ ఆఫీసరొకడు, భూమరాంగ్ లాంటి పెద్దలోహపు ఆయుధాన్ని చేతబట్టుకుని, గాలిలోనడుస్తున్నట్టుగా  చప్పుడు చేయకుండా, మాలౌంజ్‌లోకొచ్చాడు. నేను భయపడిపోయి, రెప్పలువాల్చకుండా అతడినే చూడసాగాను. అతను నన్ను మనిషి గానయినా భావించకుండా, తన బూమరాంగ్ పరికరాన్ని నా శరీరంపైన పైకీ కిందికీ పాకించాడు. ఆతరువాత దాన్ని మా ట్రాలీ సూట్‌కేసులపైన గూడా నడిపించాడు. మాతో పనయిపోయాక, హాలీవుడ్ సుందరి దగ్గరికెళ్ళాడు.

ఆవిడ గురక తీయడం స్పష్టంగా వినబడుతోంది. తీవ్రవాదులు బాంబుల్ని యెక్కు వగా సూట్‌కేసుల్లోనే తరలిస్తారనీ, యిటువంటి పనులు యెక్కువగా పిల్లలచేతా, స్త్రీల చేతా చేయిస్తారనీ చదివాను. దమ్మలాల్ చోప్రాను ఆకర్షించిన యీ యువతి తీవ్ర వాదెందుకుకు కాగూడదు? సెక్యూరిటీ ఆఫీసర్లు యిదే లౌంజలో వున్న మూడో ప్రయాణీకుడ్ని మాత్రం అనుమానించకుండా విడిచిపెడతారా?

భయంతో నాకు వొళ్ళంతా చెమటలు పట్టసాగాయి. దిగ్భ్రమతో తెరుచుకున్న నా పెదవులూ, నోటిలోపల నాలుకా యెండుటాకుల్లా యెండుకుపోయాయి.

సెక్యూరిటీ ఆఫీసరు మంత్రదండం పటుకున్న మాంత్రికుడిలా నిద్రపోతున్న హాలీవుడ్ సుందరి శరీరం పైన తన యంత్రాన్ని తాకీ తాకనట్టుగా తిప్పాడు. తరువాత ఆవిడ సూట్‌కేసునూ పరీక్షించాక, వెనుతిరిగి, నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

పక్కకు తిరిగిన హాలీవుడ్ సుందరి దగ్గరినుంచీ యిప్పుడు గురక మంద్ర స్థాయిలో వెలువడుతోంది. యింతకూ ఆసెక్యూరిటీ ఆఫీసరు మా లౌంజ్‌నుదాటే ముందు వెనుదిరిగి చూసినట్టుగా అనుమానం కలిగింది నాకు. అతను మళ్లీ వచ్చి తనిఖీ చేయాలను కున్నాడా?

విమానాశ్రయపు సమశీతోష్ణ వాతావరణంలో సైతం నాబట్టలు చెమటతో తడిసి పోయాయి. మాలౌంజ్ కవతలినుంచీ వస్తున్న ప్రతి శబ్దమూ నన్ను మరింతగా భయపెట్టసాగింది.

నీళ్ళ సీసాను జెండాలా పైకెత్తి పట్టుకున్న దమ్మలాల్ చోప్రా తిరిగొచ్చాడు. నాపక్కనున్న కుర్చీలో కూర్చుని తీసుకొమ్మన్నట్టుగా నీళ్ళసీసాను నాకేసి చాపాడు. నేను వులిక్కిపడుతూ వెనక్కు వాలాను. అతను పెద్దగా నవ్వేసి, సీసాలోంచీ గుక్కెడునీళ్ళు నోట్లోపోసుకుని, యేదో ఘన పదార్థాన్ని తింటున్నట్టుగా నెమ్మదిగా నములుతూ మింగాడు. తరువాత అరమోడ్పుకళ్ళతో పరవశంగా చూస్తూ "యేపానీ బహుత్ అచ్ఛాహై! బహుత్ మీటీ మీటీ...." అన్నాడు. మళ్ళీ వోసారి సీసాను తన పెదవులపైకి చేర్చుతూ, నిద్రపోతున్న హాలీవుడ్ సుందరి పెదవులకేసి దోరగా చూడసాగాడు.

అతడిచేతిలోని సీసా కాస్సేపటిక్రితం ఆ హాలీవుడ్ సుందరి దగ్గరుండేది. ఆవిడ చేతి ముద్రలు దానిపైన తప్పకుండా వుంటాయి. అదే సీసాను వాడుతున్న దమ్మలాల్ చోప్రాను ఆవిడ ముఠా మనిషిగా అనుమానిస్తే నాగతేమవుతుంది? యీ నిత్య ప్రేమి కుడితో బాటూ నేనుగూడా యీదేశంగానిదేశంలో యినపకమ్ముల్ని లెక్కబెట్టుకుంటూ కూచోవాల్సిందే గదా!

ఆవిడలేచి చూసిందంటే నీళ్ళు మరింత తీయగా తయారౌతాయి లెమ్మని వెటకారం చేశాను.

"వుట్‌నేదేవ్ బాయ్! వుసీకో బీ యిసీ బాటిల్‌సే పీనేకా మన్‌లగతా!" అన్నాడతను.

ఆవిడ యితగాడు తాగిన సీసాతోనే నీళ్ళు తాగాలని మనసుపడుతుందట! యింతకూ యీ దమ్మలాల్ చోప్రా తనగురించి తానే మనుకుంటున్నాడు? తాను జేమ్స్‌బాండ్‌లా చురుగ్గా, అందంగా వున్నాననుకుంటున్నాడా?

అందం అన్నది చూసే వ్యక్తుల దృష్టిలో వుంటుందన్నాడు చోప్రా నా ప్రశ్నకు సమాధానంగా.

ఆవిడేమో గులాబీరంగులో, పొడుగ్గా, దృఢంగా, యేదో ఆర్యుల తెగకు చెందిన స్త్రీలా కనబడుతోంది. యీ చోప్రా అంతపొడుగూ పొట్టీగాకుండా, యేదో ద్రావిడ జాతివాడిలాగున్నాడు. అందుకే అందం పట్ల ఆర్యులకూ, ద్రావిడులకూ వేర్వేరు అభిప్రాయాలుంటాయని రెట్టించాను.

నా మాటలు వినగానే దమ్మలాల్ చోప్రా పక్కకు తిరిగి, వుత్సాహంగా నా భుజాలు పట్టుకుని వూపేస్తూ "సచ్‌బోలాతుమ్... సచ్‌బోలాతుమ్... వో యిరానీ ద్రావిడ్....,అవుర్ మై యిండియాకా ఆర్య..." అనికేరింతలుగొట్టాడు.

అతడి అరుపులకు హాలీవుడ్ సుందరి కళ్ళు తెరిచి, పక్కకు తిరిగి, తర్వాత అదోలా వొళ్ళువిరుచుకుని, మళ్ళీ కళ్ళుమూసుకొంది. ప్రేమా పిచ్చీ రెండూ వొకటే నని అంటారు.

లేకపోతే యిండియావాణ్ణయిన తనను ఆర్యుడనీ, యిరాన్ నుంచీ వచ్చినట్టున్న ఆవిడ ద్రావిడ జాతనీ పిచ్చివాళ్ళు మాత్రమే అనుకోగలరు. నేను విస్తుపోయి చూస్తూండగా ద్రావిడులు మధ్య ఆసియా నుంచే యిండియాకొచ్చారని తాను చదివి తెలుసుకున్నానని తన్మయంగా అన్నాడు చోప్రా.

యెక్కడి ద్రావిడులు? యెక్కడి మధ్య ఆసియా? యెక్కడి యిరాను? ఆవిడ వినాలని పెద్దగా గొంతెత్తి మాట్లాడుతున్న చోప్రాకు తానేం మాట్లాడుతున్నాడో అర్ధమవుతు న్నట్టులేదు. అయినా యితడి వుత్తర భారతదేశపు హిందీ ఆవిడకేమర్ధమవుతుంది? పంచభూతాలతో మాట్లాడుతున్నానని చెబుతున్న యీ వింత వ్యక్తి, నిజానికి తనతోటి మనుషులతో మాట్లాడ్డానికి కావల్సిన భాషేదో గూడా తెలుసుకోలేకపోతున్నాడు.

“అవుర్ యిస్ బాత్ సునో” అంటూ దమ్మలాల్ చోప్రా యీసారి హరిదాసులా వో పిట్టకథ చెప్పడం మొదలుపెట్టేశాడు. ఆర్యులకు మనువనే మూలపురుషుడుండేవాడట! ఆయనకు అగస్త్యుడనే కొడుకుగూడా వుండేవాడట! ఆ అగస్త్యుడి సంతానమే ద్రావిడుల య్యారట! యిదంతా తాను తన కళ్ళతో చూసినట్టుగా నమ్మకంగా చెప్పాక అసలు యిప్పుడు యెవరు ఆర్యులో, యెవరు ద్రావిడులో తేల్చి చెప్పడం అసాధ్యమని తేల్చిపారే శాడతను. చర్మపురంగూ, వొడ్డూపొడుగూ, దేశమూ మొదలైన కారణాలవల్ల తనను ఆర్యుడిగా యితరులు గుర్తించినా, తానుమాత్రం ద్రావిడులు ఆర్యులకంటే తక్కువ వాళ్ళని సుతరామూ అనుకోనని దమ్మలాల్ చోప్రా బల్లగుద్ది వాదించసాగాడు. హాలీవుడ్ సుందరిని లేపి కూచోబెట్టి ఆవిడతో జాతుల తేడాలసలు లేనేలేవని వొప్పించేలా వున్నాడతను. దక్షిణ భారతదేశంలో వుండిన ద్రావిడులే యెక్కువగా ఆర్యుల వేద సంస్కృతిని కాపాడారని మరోకొత్త వాదనను యింతలో మొదలెట్టాడు చోప్రా. చివరకు జాతి అనే మాటే తప్పనీ, దానికి బదులుగా సంస్కృతి అనే మాటను వాడ్డమే సబబని తేల్చిపారేశాడతను. వొక ఆకర్షణీయమైన స్త్రీ, వొకమగవాడిలో యింతటి సంచలనాన్ని రేకెత్తించగలదని నేనెప్పుడూ వూహించలేదు. యింతటి భిన్నమైన స్త్రీ పురుషుల సంధానమే దమ్మలాల్ చోప్రా మొదటినుంచీ యెదురుచూస్తున్న అద్భుతమే మోనని అనిపించసాగింది.

మాట్లాడీ మాట్లాడీ అలసిపోయిన తర్వాత, దమ్మలాల్ చోప్రా పద్మాసనమేసుకుని కూర్చుని కళ్ళుమూసుకున్నాడు. అతనిప్పుడు కనిపించని శక్తులను ఆవాహన చేస్తు న్నట్టుగా వున్నాడు. వాలుసోఫాలో అటువైపుకు తిరిగిపడుకున్న హాలీవుడ్ సుందరి గురక మా లౌంజ్‌లో సాలెగూడులా అల్లుకుపోతోంది. అటు గాజుగోడకవతలి విమానాల దగ్గరి నుంచీ, యిటు విమానాశ్రయంలోని మిగిలిన లౌంజ్‌ల దగ్గరి నుంచీ శబ్దాలేవీ రావడంలేదు.

యింతలో వున్నట్టుండి మా పైకప్పు పైన్నుంచీ పెద్ద తుపానులా గీపెడుతూ విమానమొకటి దూసుకెళ్ళింది. హాలీవుడ్ సుందరి మూల్గుతూ పక్కకు దొర్లిపడుకుంది.

దమ్మలాల్ చోప్రా కళ్ళు అరవిచ్చుకున్నాయి. అతను ధిగ్గున కాళ్ళు కిందికి దించి, గబాలున వంగి, కిందపడివున్న వస్తువును చేతికందుకున్నాడు. తరువాతపైకిలేచి, గోడచివర ఫ్లాట్‌ఫాంపైనున్న మరో నాణాన్ని వెతికి పట్టుకున్నాడు. దాని కటుపక్కన పామ్ మొక్కున్న కుండీ మొదల్లోంచీ యింకో నాణాన్ని కనిపెట్టాడు. మూడునాణాలూ తీసుకొచ్చి, నా ముందుకు చాపాడు.

ప్రతిగింజపైన దాన్ని తినేవాడి పేరు రాసివుంటుందనే సామెతను గుర్తుకు తెచ్చాడు చోప్రా. అంటే యిప్పుడీ నాణాలపైన వాటిని వుపయోగించబోయే తన పేరు రాసి వుంటుందని అతడి నమ్మకంలాగుంది.

నేనా మూడు నాణాలనూ లాక్కుని, వాటికేసి బెదరుతూచూశాను. మొదటిదానిపైన EURO అనే యింగ్లీషు అక్షరాలూ, పక్కన యాభై సంఖ్యా వున్నాయి రెండోదానిపైన పడవ బొమ్మా, అర్ధంగాని అక్షరాలూ వున్నాయి. మూడోదానిపైన కత్తిపట్టుకున్న సింహపు బొమ్మా, దానికింద 50 RICALS అనే అక్షరాలూ వున్నాయి.

యీ నాణాలతో యిక్కడ తినడానికేమైనా కొనుక్కొస్తానని పైకి లేచాడు దమ్మలాల్ చోప్రా. నేను కంగారు పడుతూ అతడి చేయి పట్టుకుని వెనక్కులాగి, యీ నాణాలలో రెండు విదేశీవనీ, యిక్కడ చిల్లిగవ్వకు గూడా అవి కొరగావనీ చెప్పాను. యిక మూడోది కేవలం అర యూరో డాలరని నచ్చజెప్పడానికి ప్రయత్నించాను. విదేశీ నాణాలను మరోసారి జాగ్రత్తగా చూశాక, యివి యిక్కడి కెందుకొచ్చాయని ప్రశ్నించాడు చోప్రా. వాలుకుర్చీలోపడుకున్న హాలీవుడ్ సుందేరేమైనా పడేసుకుందా అని సైగలతో ప్రశ్నించాడు. ఆ తరువాత “యేసబ్ అచ్చా దేఖో తుమ్!” అంటూ మెల్లగా నాకు మరో పాటాన్ని చెప్పసాగాడు. ఆ రెండు వీదేశీ నాణాలపైన వుండే బొమ్మలు చిత్రంగా వున్నాయన్నాడు. కత్తిచేతబట్టుకున్న సింహంతలా, రెక్కలున్న గుర్రాలూ, యివన్నీ ఆయాదేశాల సంస్కృతిని పరిచయం చేస్తున్నాయని తెలుసుకోమన్నాడు. వీటిద్వారా సంస్కృతీ, శాస్త్రీయతా అనేవి విరుద్ధమైన అంశాలని అర్ధంచేసుకోమన్నాడు. కాస్సేపు మౌనంగా ఆలోచించాక “పూరా దునియాకో యేకీ కరెన్సీ హెూనా! అవుర్ పూరా దునియాకో యేకీ కల్చర్ బనానా!” అన్నాడు దృఢంగా. ప్రపంచానికంతా వొకేరకమైన కరెన్సీ, సంస్కృతి వుంటే, యిప్పటికిప్పుడు హాలీవుడ్ సుందరిని తాను గాంధర్వ వివాహం చేసుకోవచ్చు ననుకుంటున్నట్టున్నాడు చోప్రా. యిప్పుడతను సీసాను పెదవుల మధ్య యిరికించుకుని, పరవశంగా, సవ్వడివినబడేలా నీళ్ళు తాగుతున్నాడు.

గాజుగోడ కవతల యెర్రటి పక్షి బొమ్మున్న పెద్ద విమానమొకటి సుమో పహిల్వానులా గునగునా కదులుతూవచ్చి ఆగింది. ప్రయాణీకులను విమానాశ్రయంలోకి తీసుకొచ్చే వేబ్రిడ్జి వొకటి కొండచిలువలా దాని దగ్గరకు పాకుతోంది.

వున్నట్టుండి కలలో వులిక్కిపడిమేలుకున్నట్టుగా హాలీవుడ్ సుందరి కళ్ళుతెరిచి, లిప్‌స్టిక్‌తో అతుక్కుపోయిన పెదవుల్ని నాలుకతో తడుపుకుంటూ బలవంతంగా విడదీసి "యెక్స్‌క్యూజ్ మీ.... వాటీజ్‌ది టైమ్ నౌ?" అని అడిగింది.

దమ్మలాల్ చోప్రా వెంటనే లౌంజ్ మలుపుదాకా పరిగెత్తి, అక్కడి గడియారాన్ని సంప్రదించాక "ఫోర్‌తర్టీ....లోకల్ టైం!"అని ప్రకటించాడు.

ఆవిడ బద్ధకంగా మూల్గి, మళ్ళీకళ్ళు మూసుకొంది.

దమ్మలాల్ చోప్రా రొప్పుతూవచ్చి తనకుర్చీలో కూర్చున్నాడు. ఆవిడను చూపులతోనే తినేశాలా చూస్తూ, చేతికంత పెద్దగడియారమున్న యువతి తనను టయమెంతని యెందుకడిగి వుంటుందో వూహించమని సవాలు విసిరాడు. నేను విస్తుపోయి, విదేశీ టికెట్లు రిజర్వు చేసిపెట్టే ట్రావెలింగ్ కంపెనీల్లో, గోడలనిండా వేర్వేరు సమయాల్ని చూపెట్టే గడియారాలుంటాయని జ్ఞాపకం చేశాను. అవి వివిధ ఖండాల్లో, వివిధ దేశాల్లో వుండే వేర్వేరు సమయాల్ని చూపెడతాయనీ, ఆవిడ చేతికుండే గడియారంలో ఆవిడ దేశపు సమయమే వుండవచ్చుననీ వివరించాను.

దమ్మలాల్ వెంటనే వెక్కిరిస్తున్నట్టుగా నవ్వి, ప్రేమను కొలిచే గడియారాలుంటాయని నాకు తెలియనే తెలియదని మందలించాడు. తర్వాత "ప్యార్ కియాతో డర్‌నాక్యా? ప్యార్ హమ్‌కర్‌తాహై చోరినహీ..." అని పెద్దగా పాడబోయాడు.

నేనతడికేసి కోపంగా వురిమిచూస్తూ పైకి లేచి, దూరంగా వచ్చికూర్చున్నాను. గాజు గోడ కవతల గ్రద్దలా ఆగిన విమానాన్నీ, దానిచుట్టూ పావురాల్లా అమాయకంగా తిరుగుతున్న ట్రక్కులనూ చూడసాగాను. దూరంగా రన్‌వేలపైన వొకదానితో వొకటి పోలికలేని విమానాలు వచ్చి దిగుతున్నాయి. గాలిలోకెగురుతున్న విమానాలు ముందుగా పక్షుల్లా మారి, ఆతరువాత చుక్కలతో కలిసిపోతున్నట్టున్నాయి.

నేను దూరంగా వచ్చేశాక దమ్మలాల్ చోప్రాలో తెంపరితనం మరింతగా పెరిగిపోయి వుండ వచ్చుకదా! ఆ విషయం స్ఫురించగానే భయపడుతూ వెనుతిరిగి చూశాను. అప్పుడొక విచిత్రమైన ప్రశాంత వాతావరణం కనిపించింది నాకు. కుర్చీలో పద్మాసన మేసుకుని కూర్చున్న దమ్మలాల్ చోప్రా కళ్ళుమూసుకుని ధ్యానముద్రలో మునిగిపోయి వున్నాడు. అతడి ముఖంలో యేదో వింత వుత్తేజం తొణికిసలాడుతోంది. కొంపదీసి, అతనెదురుచూస్తున్న అద్భుతమేదో, యిప్పుడో, యింకాస్సేపటికో యిక్కడికి దిగిరా బోతోందా యేమిటి?

## 6

పొడుగ్గా, ధృడంగా, యూనిఫారాలతోనే పుట్టి, వాటితో బాటూ పెరుగుతున్నట్టున్న సెక్యూరిటీ ఆఫీసరొకడు సరసరా నాదగ్గరికొచ్చి, పైకిలేవమన్నట్టుగా సైగచేశాడు.

అవతల కుర్చీలో కూర్చున్న దమ్మలాల్ చోప్రా యింకా కొంగధ్యానంలోనే వున్నాడు. యివతల వాలుకుర్చీలో పడుకున్న హాలీవుడ్ యువతి కలలలోకం లోనే షికార్లుగొడు తోంది. సెక్యూరిటీ ఆఫీసరు శబ్దంచేయవద్దన్నట్టుగా సైగచేశాడు. అతడి శరీరపు గులాబీ రంగుకూ, అతడి స్వభావంలోని కాఠిన్యానికీ యేమాత్రం నప్పడంలేదు. అతడి నల్లటి నిగనిగలబెల్టు సొరుగులో మరింత నల్లని పిస్టోలు తళతళలాడుతోంది. అతను తనవెంట రమ్మని సైగచేశాక పక్కకు తిరిగాడు.

తన ట్రాలీ సూట్‌కేసును తాను పడుకున్న వాలుకుర్చీకాలుకు యినపగొలుసుతో బిగించి బీగమేసుకున్న హాలీవుడ్ సుందరి నిశ్చింతగా నిద్రపోతోంది. తన సూట్‌కేసును గూడా నా సూట్‌కేసు పక్కన పడేసి, దమ్మలాల్ చోప్రా యిహపరాలను రెండింటినీ నాకే వొప్పగించినట్టుగా ధ్యానంచేసుకుంటున్నాడు. మరో మార్గం కనబడకపోవడంతో రెండు ట్రాలీ సూట్ కేసులనూ లాక్కుంటూ, నిస్సహాయంగా సెక్యూరిటీ ఆఫీసరును అనుసరించాను నేను.

మా లౌంజ్ మలుపు తిరిగాక, వొకవిశాలమైన హాలు చివర్లో పెద్దటేబులు ముందు కూర్చున్న నలుగురు సెక్యూరిటీ ఆఫీసర్లు కనిపించారు. వాళ్ళ పక్కన, మాకు విమానం దిగుతూనే స్వాగతం చెప్పిన లేడీ సెక్యూరిటీ ఆఫీసరు, తన భీకరమైన వేటకుక్కతో బాటూ నిలబడివుంది.

నారాకను గమనించనట్టుగా సెక్యూరిటీ ఆఫీసర్లు తమ ముందున్న ఫైళ్ళలో యేదో వెతుక్కుంటున్నారు. యూనిఫారాల్లో కట్టగట్టినట్టున్న వాళ్ళ శరీరాలు, పాలిపోయిన గులాబీరంగు కుండే వేర్వేరు ఛాయల్ని పరిచయం చేస్తున్నాయి. కుక్కను పట్టుకున్న స్త్రీ తాను బొమ్మగాదని తెలపడంకోసమన్నట్టుగా కనురెప్పల్ని మాత్రం కదిలిస్తోంది.

సెక్యూరిటీ ఆఫీసరొకడు తలపైకెత్తకుండానే నన్ను కూచోమన్నట్టుగా సైగచేశాడు. వాళ్ళటేబులు కిటువైపున, మద్దాయి కోసం యెదురు చూస్తున్నట్టున్న వొంటరి కుర్చీలో దీనంగా కూర్చున్నాను.

మరో సెక్యూరిటీ ఆఫీసరు వో పుస్తకాన్ని నా ముందుకు తోసి, రాగద్వేషాలు పలకలేని యంత్రంలా "వాటీజ్‌దిస్?" అన్నాడు.

నేను పుస్తకాన్ని తీసి, పేజీలు తిప్పిచూశాక అదొకడైరీ అయివుంటుందని చెప్పాను. యింతలో దమ్మలాల్ చోప్రా డైరీ వొకటి యింకా వాళ్ళ దగ్గరేవుందని స్ఫురించడంతో, గబగాబా మొదటిపేజీలు తెరిచిచూసి, "దిసీజ్ హిజ్ డైరీ!" అన్నాను కంగారుగా.

"యూహావ్‌టూ రీడ్ యిట్ ఫార్ అజ్...." యింకో సెక్యూరిటీ ఆఫీసరు గొంతు కీచుకీచుగా పలికింది.

వణుకుతున్న చేతులతో నేనా నలుపురంగు అట్టవున్న డైరీని అందుకుని, పేజీలు తిప్పాను.

ఆడైరీ మొదటి పేజీలో వొక వృత్తమూ, దానిచుట్టూ వొక చతుర్భుజమూ, ఆ రెండింటినీ ఆవరిస్తూ వొక నక్షత్రమూ, ఆమూడింటినీ లోపల యిముడ్చుకున్న అష్టభుజీ గీసారు. ఆబొమ్మలకింద వోం, వేం, మ, బు, మ, క్రీ, ద. అనే అక్షరాలున్నాయి.

'ఆ బొమ్మేమిటి? ఆ అక్షరాలకర్థమేమిటి?' అని మరో సెక్యూరిటీ ఆఫీసరు బొంగురు గొంతుతో ప్రశ్నించాడు.

నాకు తెలియదన్నట్టుగా తల అడ్డంగా వూపాను.

మూడో సెక్యూరిటీ ఆఫీసరు యెవరో తరుముతున్నట్టుగా యింగ్లీషులో వేగంగా యేదో అడిగాడు. మరోసారి అతడి మాటల్ని మననం చేసుకునే ప్రయత్నంచేశాక, ఆడైరీ నాతోటి ప్రయాణికుడిదేనని తనకు తెలుసుననీ, మోసం చేస్తే వుపయోగం లేదనీ,వొళ్ళుదగ్గర పెట్టుకుని అది చదివి చెప్పమనీ, అతను అడిగాడని మాత్రం నాకు చూచాయగా అర్థమయింది.

ఆడైరీని హిందీలో రాశారనీ, నాకు హిందీ అంతబాగా రాదనీ చెప్పడానికి ప్రయత్నించాను. అతను నా మాటల్ని వినిపించుకోకుండా, 'బుద్ధిగా చదివి యింగ్లీషులోకి అనువదించి చెప్పు' అని పాతమాటల్ని మళ్ళీ అదే పాత వుదాసీన ధోరణిలో చెప్పాడు.

నేను పేజీ తిప్పి, Personal Information అనే శీర్షికకింద హిందీలోరాసిన వివరాల్ని కూడీకూడీ చదివేశాను! 'పేరు : దమ్మలాల్ చోప్రా – ఆఫీసు అడ్రస్సు : మనోజ్ యేజెన్సీస్, నెంబర్ 15, సీజీ ఆర్ లేన్, జై సల్మీర్ – 1– యింటి అడ్రస్సు : నెంబరు 94–23/1/A, క్రాస్ నెంబరు పన్నెండు, రాణాప్రతాప్‌సింగ్ నగర్, జై సల్మీర్ ––యీ వివరాలు తప్ప Blood group, Height, Weight, Passport No:Insurence Policies మొదలైన అనేకానేక సమాచారలేవీ అందులో నింపలేదని చెప్పాను.

'యిక డైరీలోకెళ్ళు.... చదివి యింగ్లీషులోకి తర్జుమాచెయ్యి' అంటూ యీసారి కొత్త గొంతుక పలికింది. ఆగొంతుకు యెంతకూ పొంతనకుదరని ఆకారమున్న నాలుగో సెక్యూరిటీ ఆఫీసరు, నావెనకున్న గోడను చూస్తున్నట్టుగా కనిపించాడు.

హిందీని 'తార్డ్ లాంగ్వేజ్' గా నేను పదోతరగతి వరకూ కొంచెం యేడిచాను. అప్పటి మా హిందీ టీచరుకు పిల్లలంటే భలేయిష్టం. ఆయన మావూరి నుంచీ యేడుమైళ్ళ దూరంలో వుండే వాళ్ళవూరినుంచీ రోజూ బస్సులో వచ్చేవాడు. ఆయన వూరొక నాలుగురోడ్లకూడలిలో వుంది. ఆ జంక్షనులో ఆయనకో యిరానీ హొటలుండేది.

రాత్రంతా అక్కడ ఆగే లారీ డ్రయివర్లకు భోజనాలు సమకూర్చవలసి రావడంతో ఆయనకు నిద్రపోయే సమయం దొరికేది గాదు. అందుకని వుదయంనుంచీ సాయంత్రం వరకూ ఆయన మా స్కూల్లో తూగుతూనే వుండేవాడు. ఆ నిద్రమత్తులోనే ఆయన మాకు పాఠాలు చెప్పేవాడు. ఆయనకు హిందీలో అంకెలూ, వారాలూ చెప్పడం వచ్చేదిగాదు. 'సన్ వెయిన్నీ యెనిమిది వందలా యాభైయేడూ మే...' అని చదువుతూ ఆయన 'కదా రాణీ!' అని పలవరించేవాడు. ఆయన పెట్ స్టూడెంటు రాణి 'అవున్సార్!' అనగానే ఆయన పాఠం మళ్లీ నత్తనడక నడిచేది. ఆ అమ్మాయి బదులు పలక్కపోతే ఆయన వులిక్కిపడి, నిద్రమేల్కొన్నట్టుగా 'నువ్వు గూడా నిద్ర పొయినావా రాణీ!', అని ప్రేమగాకసిరేవాడు. ఆ పిల్ల యెప్పుడైనా బడికి రాకపోతే, ఆయన పాఠం గానుగెద్దులా తిరిగిన చోటే తిరుగుతూ వుండేది. అలా నేర్చుకున్న నా వొకటి సగం హిందీ చదువుతో నాకింత జవాబుదారీ పని పడుతుందని నేను కలలో గూడా అనుకోలేదు.

సెక్యూరిటీ అధికారిణి దగ్గర నిల్చున్న సీమకుక్క పెద్దగా వూపిరి పీలుస్తూ నన్ను భయపెడుతోంది. నేనో రెండుపేజీలు తిప్పి చూశాక, అందులో దమ్మలాల్ చోప్రా దినచర్యలు రాయలేదనీ, కేవలం కవిత్వం రాశాడని వినయంగా చెప్పాను.

'చదివి, అనువదించు' అంటూ సెక్యూరిటీ ఆఫీసరు గొంతు మళ్లీ యింగ్లీషులో కసిరింది.

యీ హిందీని చదవమంటే యేదోతప్పుల తడకగా చదవగలనుగానీ, అనువాదం గూడా చేయమంటే యెలాచెప్పండి? పైగా కవిత్వాన్నసలు అనువదించలేమనీ, వొకవేళ కవిత్వాన్ని వేరే భాషలోకి అనువదిస్తే అందులోంచీ జారిపోయేది కవిత్వమేనని విమర్శకులు చెప్పారనీ వీళ్ళకెలా అర్థమయ్యేలా వివరించగలనునేను? చూడబోతే, మానవమాత్రుల కసాధ్యమైన పనులేవో చెయ్యమని చెప్పి, నేను చేయలేకపోయానని సులభంగా నిరూపించి, ఆపైన తమ యిష్టంవచ్చిన శిక్షను అమలు చేయాలని వీళ్ళు ముందుగానే నిర్ణయించుకున్నట్టున్నారు. అయినా వీళ్ళకంత సులభంగా దొరికిపోవడమే తప్పు. వీళ్ళ వలలో పడకుండా వుండాలంటే నేనీ చోప్రా పైత్యాన్ని అనువదించక తప్పదు.

"విశ్వాస్ కరో విశ్వాస్‌కో... ధర్మ్‌కర్‌తే హై ధర్మ్.... అలగ్ అలగ్ హై ముసీబతే..... అలగ్ అలగ్ హై ములాఖతే...."

"ట్రాన్సిలేట్... ట్రాన్సిలేట్..." సెక్యూరిటీ ఆఫీసరు గొంతులో అరిగి పోయిన రికార్డున్నట్టుంది.

నాకొచ్చిన హిందీ నాకొచ్చిన యింగ్లీషుకంటే ఘోరమని యీ యింగ్లీషు సెక్యూరిటీ ఆఫీసర్లకు అర్థమయినట్టులేదు. వొక పరాయి భాషను యింకో పరాయి భాషలోకి

మార్చడమనే యీకొత్త ప్రయోగానికి నేనే ఆది పురుషుడయినందుకు సంతోషించాలో, బాధపడాలో తెలియని వింత పరిస్థితిలో పడిపోయాను. అయినా వీళ్ళకు హిందీ రాదన్న విషయ మొక్కటే యింత యిబ్బందిలోనూ నాకు వూరట కలిగిస్తున్న సంగతి– "మూల మొకటే – ఆదిమూలమొకటే ! అనాది మనిషితో గుహలూ కొండలూ యేమి చెప్పాయి? మరో అనాదివాడితో సంద్రాలూ నదులూ యెలా సంభాషించాయి? గాలిమాటలూ, నీటి మాటలూ నిలుస్తాయా నిజానికి? నీలో నాలో రేగే తుపానుల సంగమమెక్కడ? మన పాత్రలోంచీ జారిపోయిన అనంతుడెక్కడ?"

దమ్మలాల్ చోప్రా యీ అనంతుడనే మాటను మరోసారి రాసి, అక్కడ 'అలా అలా' అని రెండు మాటలు చేర్చాడెందుకో!

'స్టాప్...స్టాప్... రీడిట్ అగైన్...." అని గర్జించాడో సెక్యూరిటీ ఆఫీసరు.

నేనా రెండుమాటల్నీ మరోసారి అనబోయి, అంతలో వాటిని అనువదించకుండా తెలుగులోనే అంటున్నానని స్ఫురించడంతో వులిక్కిపడి, ఆమాటలు వాళ్ళకు 'అల్లా అల్లా' అని వినబడివుంటాయని తోచడంతో మరింతగా కంగారుపడిపోయాను. యింతలో చావుతెలివేదో వచ్చి తోడ్పడంతో "ఆల్మయిటీ... ఆల్మయిటీ..." అని సర్దుకున్నాను.

"షోయిట్..." అన్నాడాఫీసరు.

నేను 'అలా' అన్నమాట కిందవేలుపెట్టి చూపెట్టాను. అతను నాకేసి అదోలాచూస్తూ "కంటిన్యూ!" అన్నాడు.

"నిన్నూ నన్నూ కలిపేదేమిటి? నన్నూ మన్నునూ కలిపిందేమిటి? నిన్నూ మిన్నూ కలిపేదెవరు? తొలి మాటను పలికిందెవరు? మాటను మంత్రంగా వాడిందెవరు?" – దమ్మలాల్ చోప్రా హిందీ రాతల్ని యింగ్లీషులోకి అనువదిస్తూండగా, నాకు అతడు చేసినదేమిటో స్పష్టంగా అర్థమైపోయింది. అతను వాక్యాన్ని విరగ్గొట్టి కవితలా పేర్చాడే గానీ, అదంతా కేవలం వచనమేనని నాకు తోచింది. అందుకే కావాలని 'యీ కవిత్వాన్ని అనువాదంచేస్తూంటే అదంతా వచనమైపోతోందనీ, కవికి అపచారం జరుగుతోందనీ' వాళ్ళకు వీలయినంత వినయంగా విన్నవించుకున్నాను. వాళ్ళు వొకే మాటను మళ్ళీమళ్ళీ వాడే పిచ్చివాళ్ళలా "ట్రాన్సిలేట్... ట్రాన్సిలేట్" అని అరిచారు. ఆపైన నేను అడ్డూ ఆపూలేకుండా ఆరాతల్ని యెడాపెడా అనువాదం చేసి పారేయసాగాను.

"అనంతమెపుడూ యేకవచనమే! అనంతమెపుడూ అద్వయితమే! అనంతానికి మధ్యవర్తులెందుకు? అనంతానికి చేతులెందుకు? అనంతానికి మాటలెందుకు?"

"టెల్ మీ ది ఆన్సర్స్ ఆల్సో!" అంటూ అడ్డుతగిలాడో సెక్యూరిటీ ఆఫీసరు.

యీ ప్రశ్నలకు సమాధానాలు నాకేంతెలుసు? తెలిస్తే గిలిస్తే ఆ దమ్మలాల్ చోప్రాకే తెలియాలి. ఆమాటే చెప్పాను. నాకేసి అనుమానంగా చూస్తున్న సెక్యూరిటీ ఆఫీసర్లను పట్టించుకోకుండా నా అనువాదాల్లోకి నేను కూరుకుపోవడమొక్కటే మార్గాంతరంగా తోచింది. "ప్రతి నడకా తీర్థయాత్ర. ప్రతి మనిషీ పుణ్యక్షేత్రం. శరీరమే ఆలయం. స్నానమే అభిషేకం. వుపవాసమే ద్యానం. వుదయమే వ్యాయామం..." నేను చదువు తున్నది దినచర్యో, కవిత్వమో, వేదాంతమో, జంతుశాస్త్రమో అర్థంగాకపోవడంతో తికమకపడసాగాను. సెక్యూరిటీ ఆఫీసర్లు గూడా అటువంటి పరిస్థితిలోనే వున్నట్టున్నారు. వాళ్ళు బుర్రలుగోక్కుంటూ, గోర్లు కొరుక్కుంటూ, మోచేతులు గోక్కుంటూ చిడుముడి పాట్లు పడసాగారు. వాళ్ళను మరింతగా అయోమయపర్చడంకోసం నేను దమ్మలాల్ కవిత్వానికి నాపైత్యాన్ని గూడా జోడించసాగాను. పేజీ పొడవున్న గొడవను చదివి, దాన్ని మూడంటే మూడు ముక్కలుగా అనువదించిపారేశాను. తరువాతో చిన్నగీత చదివి, దానికి వాళ్ళకు అర్థంగాని సంస్కృతం మాటల్ని చేర్చి, చేంతాడంత పొడవాటి వ్యాఖ్యానం చేశాను.

డాబర్‌మేన్ కుక్క లొల్లుమంది. దాన్ని పట్టుకున్న సెక్యూరిటీ ఆఫీసరుణి నిద్ర మేల్కొన్నట్టుగా మూల్గింది. సెక్యూరిటీ ఆఫీసర్లు వొకరివెంట వొకరుగా ఆవు లించడంలో పోటీ పడసాగారు. చివరికో సెక్యూరిటీ ఆఫీసరు యేడుపుముఖం పెట్టుకుని, రెండు చేతులూముందుకు చాపి, చాలన్నట్టుగా అరిచాడు. ఆమాటకోసమే యెదురు చుస్తున్నట్టుగా మిగిలిన సెక్యూరిటీ ఆఫీసర్లు గూడా పెద్దగా తలలువూపారు. వో అధికారి నా చేతిలోని డైరీని లాక్కున్నాడు. యికవెళ్ళిపొమ్మన్నట్టుగా మరో అధికారి సైగచేశాడు.

యింకా యీవుద్గ్రంథంతో వాళ్ళకేంపనుందో నాకు తెలియలేదు. బహుశా మరోవ్యక్తి దగ్గర చదివించి, నేను సక్రమంగా చదివానో లేదో తెలుసుకుంటారేమో! ఆరెండో వ్యక్తి మాత్రం సరిగ్గా పనిచేశాడనటానికి రుజువే ముంది? అతడిని పరీక్షించాలంటే మరో వ్యక్తి కావాలి! యిదంతా అనుమానాల్ని పెంచుకునే వ్యవహారం లాగుందిగానీ, సత్యా న్వేషణలా యెంత మాత్రమూలేదు.

రెండు అనుమానాల్లాంటి రెండు ట్రాలీ సూట్‌కేసుల్ని లాక్కుంటూ, నేను అక్కడినుంచీ మాపాత లౌంజ్‌లోకి పరుగుపరుగునా తిరిగొచ్చేశాను.

వాలుకుర్చీలో పడుకున్న హాలీవుడ్ సుందరి యింకా నిద్రపోతూనేవుంది. సెక్యూరిటీ అధికారులకు నన్ను యెరగావదలిపెట్టి, దమ్మలాల్ చోప్రా మాత్రం యింకా కొంగధ్యానం చేస్తూనే వున్నాడు. తమనీడల్ని చూసి తామే బయపడుతున్న యిక్కడి సెక్యూరిటీ ఆఫీసర్లకు యీ దమ్మలాల్ చోప్రానే సరయిన గురువులాగున్నాడు. వాళ్ళ భౌతికమైన వెతుకులాటకు లౌకికమైన ఆలోచనల్ని రగిలించి, యితగాడేమో యిక్కడ ప్రేమదేవతను ఆవాహన చేసుకుంటున్నాడు.

నేను నీరసంగా నాకుర్చీలో చేరగిలబడ్డాను. దమ్మలాల్ చోప్రా టక్కున కళ్ళు తెరిచాడు. అతడిదృష్టి నేరుగా వాలుకుర్చీలో నిద్రపోతున్న హాలీవుడ్ సుందరి పైన పడింది. అతడిముఖంలో చిన్న చిరునవ్వు పొటమరించింది. తనతో తాను మాట్లాడు కుంటున్నట్టుగా "అబ్ అద్భుత్ జరూర్ నికలేగా! అబీచ్ నికలేగా!" అన్నాడతను.

నేను విసుగ్గా పెదవులు కొరుక్కున్నాను.

"వహా...హా! వహా..... యేహీ అద్భుత్..." అన్నాడతను.

నేను విస్తుపోయి, చెవులురిక్కించాను.

## 7

ఆమ్‌స్టర్‌డాం విమానాశ్రయపు గడియారం సాయంత్రం యేడుగంటల సమయంతో సంధిచేసుకుంటోంది. ఆసియా ఖండపు సూర్యోదయ సూర్యాస్తమయాలకు అలవాటు పడిన నాకళ్ళను విమానాశ్రయం బయట వున్న యెండ, అది మధ్యాహ్నమో, సాయం త్రమో తేల్చుకోమని కవ్విస్తోంది. గాజుగోడకవతల వచ్చిపోతున్న విమానాలు, లౌంజ్‌లలో కూర్చున్న ప్రయాణీకులను పట్టించుకోవడం లేదు. పగలయినా, రేయయినా వెలగడమే తప్ప విశ్రాంతి తెలియని విమానాశ్రయపు విద్యుద్దీపాలు పాలిపోయిన వెలుతుర్లను బలవంతంగా చిమ్ముతున్నాయి.

పనికిరానిదని దూరంగా పారేసినట్టున్న మా లౌంజ్‌ను యేకచ్ఛాత్రాధిపత్యంగా పరిపాలిస్తున్న చక్రవర్తిలా దమ్మలాల్ చోప్రా రొమ్ములు విరుచుకుని కూర్చుని వున్నాడు. నిద్రపోతున్న మహారాణిలా హాలీవుడ్ సుందరి ఠీవిగా వెలిగిపోతోంది. వాళ్ళిద్దరికీ సేవ చేస్తున్న నౌకరులా నేను మిగిలిపోయినట్టున్నాను. లౌంజ్‌కటు చివర్లోని పిల్లల ఆటల ప్రాంతం పిల్లలకోసం యింకా యెదురు చూస్తూనేవుంది.

"సునాహై తుమ్.... వహీహై!" అన్నాడు దమ్మలాల్ చోప్రా వుద్వేగంగా

విమానమేదో మానెత్తిపైన తుఫానులాంటి శబ్దాల్నిరువ్వేసి వెళ్తోంది. విమానా శ్రయంలో యెక్కడో మైకులసవ్వడి లీలగా వినబడుతోంది. దమ్మలాల్ చోప్రా తల వూపుతూ అదోలా పెదవి విరిచి, కనురెప్పలెగరేశాడు. మా లౌంజ్ కప్పుపైన గాలి సుళ్ళు తిరుగుతోంది. యింకో పదినిముషాల్లో యిక్కడ వాన పడబోతోందన్నాడు చోప్రా.

ఆమ్‌స్టార్‌డాం ఆకాశం యెప్పుడూ కుండను నెత్తిన బెట్టుకుని తిరిగే ఆడపిల్ల లాంటిది. యెంతటి మండు వేసవిలోనయినా ఢబేలుమని వర్షంపడిపోతుందట యిక్కడ! అందుకే యిక్కడి వాళ్ళు యెప్పుడూ గొడుగులూ, రైన్ కోటులూ వెంటబెట్టుకునే తిరుగు తారని చదివానెక్కడో!

"బరస్ బీ సంకేత్ హైనా! అబ్‌హెూగా అద్భుత్..." అన్నాడు చోప్రా

ప్రకృతిని సక్రమంగా అర్థంచేసుకున్నవాళ్ళకు యెప్పుడు వాతావరణమెలా మారుతుందో ముందుగానే తెలిసిపోతుందట! యింకాస్సేపట్లో వర్షం రాబోతుందన్న విషయాన్ని అడివిలోవుండే జంతువులూ, పక్షులూ ముందుగానే పసిగడతాయట! యిందులో దమ్మలాల్ చోప్రా కందిన కొత్త సంకేతమేముంది?

మావెనక నుంచీ బూట్ల శబ్దం వినిపించింది. దమ్మలాల్ చోప్రా పరవశంగా వెనుదిరిగాడు.

యిదివరకూ నన్ను 'క్రాస్ యెగ్జామిన్' చేసిన సెక్యూరిటీ అధికారుల్లోని వాడొకడు యిటే వస్తున్నాడు. మేమిద్దరమూ అతని దృష్టికి ఆననట్టుగా, నేరుగా వాలుకుర్చీలో పడుకున్న హాలీవుడ్ సుందరి దగ్గరికెళ్ళాడు. తన చేతిలోని మెటల్ డిటెక్టర్‌తో ఆమెను కుదిపాడు.

హాలీవుడ్ సుందరి బద్ధకంగా యిటు తిరిగి, విసుగ్గా కళ్ళు తెరిచి, యెదురుగా సెక్యూరిటీ ఆఫీసరు కనిపించగానే వులిక్కిపడి, మళ్ళీ అతుక్కుపోయిన లిప్‌స్టిక్ పెదవుల్ని నాలుకతో యెబ్బెట్టుగా తడుపుకోసాగింది.

"గెటప్... యువార్ వాంటెడ్ దేర్..." అంది సెక్యూరిటీ ఆఫీసరు కీచుగొంతు.

ఆవిడ బలవంతంగా నోరు విప్పి కాసరబీసరమంటూ అర్థంగాని శబ్దాలేవో చేసింది.

సెక్యూరిటీ ఆపీసరు "కమాన్... లెటజ్ గో...." అని కసిరాడు యెంతకూ కరగని కాఠిన్యంతో.

ఆవిడ నిస్సహాయంగా మాయిద్దరికేసి చూసింది.

తరువాత తన వానిటీబాగులోంచీ తాళాలు తీసి, కుర్చీకాలుకు వేసిన బీగాన్ని తీసి, ట్రాలీసూట్‌కేసును దానికి వేలాడుతున్న యినుపగొలుసుతో బాటూ లాక్కుంటూ పైకిలేచింది. ఆవిడ అందాన్నసలు పట్టించుకోకుండా, సెక్యూరిటీ ఆఫీసరు పోస్టుమార్టం చేసే డాక్టరులా ముందుకు కదిలాడు. ఆవిడ కసాయివాడి వెంట నడచే గొర్రె పిల్లలా అతడి వెనక నడిచింది.

"వో అవురత్ హై! హమ్‌వుస్ కో ముసీబత్‌మే చోడ్‌తీ నై...." అన్నాడు దమ్మలాల్ చోప్రా మా యిద్దరి మధ్యా నిలబడిన నిశ్శబ్దాన్ని కత్తితో కోస్తున్నట్టుగా. కాస్సేపటిక్రితం అదే సెక్యూరిటీ అధికారులు నన్నూ యిలాగే పట్టుకెళ్ళి, యితగాడి డైరీల్ని అనువదించే శిక్షను అమలు చేశారు. అప్పుడు కొంగధ్యానం చేస్తూ, నా అతీగతీ పట్టించుకోని యీ

పెద్దమనిషి, ఆ ముక్కూమొహం తెలియని సుందరికోసం తోటరాముడిలా యుద్ధానికే బయల్దేరేటట్టున్నాడు. యితగాడు తానే స్వయంగా ఆ సెక్యూరిటీ వాళ్ళ దగ్గరికెళ్తే, మెయ్యబోయి మెడకు తగిలించుకున్నట్టుగా, తప్పకుండా ప్రమాదాన్ని కొని తెచ్చు కుంటాడు. తనతో కలిసి ప్రయాణం చేస్తున్న నేరానికి నన్నూ నట్టేట్లో ముంచి తీరతాడు.

"భలేవాడివే! ఆవిడెవరనుకుంటున్నావు?" అని కసిగా అడిగాను.

ఆవిడెవరో నాకు మాత్రం యెలా తెలుసునని చోప్రా కన్నుగీటుతూ ప్రశ్నించాడు. నేను కాస్సేపు ఆలోచించాక, యిదివరకూ అతను ధ్యానముద్రలో వున్నప్పుడు, ఆ సెక్యూరిటీ ఆఫీసర్లు నన్నక్కడికి తీసుకెళ్ళి యింటరాగేట్ చేశారనీ, అప్పుడువాళ్ళేనాకు ఆవిడ గురించి చాలా వివరాలు చెప్పారనీ అన్నాను. సూట్‌కేసు బాంబుల్ని తీసుకెళ్ళే ఆడవాళ్ళ నెందరినో వాళ్ళు రెడ్‌హాండెడ్‌గా పట్టుకున్నారని చెప్పాను. సూట్‌కేసును పట్టుకెళ్ళే ఆడవాళ్ళందరూ తీవ్రవాదులే అయివుంటారనుకోవడం మూర్ఖత్వమని తేల్చేశాడు దమ్మలాల్ చోప్రా. యిక యిలాకుదరదని నేను మరిన్ని వివరాలతో అతడిని భయపెట్టే ప్రయత్నంచేశాను. ఆవిడది ఆఫ్ఘనిస్తాన్ అనీ, పెళ్ళయిందోలేదో తెలియదుగానీ యిలా యెప్పుడూ వొంటరిగానే తిరుగుతూవుంటుందనీ, గతనెలలో బ్రిటీషు పోలీసులు యింగ్లాండులో అరెస్టుచేసి పదిహేనురోజులు రిమాండులో పెట్టారనీ, ఆతరువాత యీవిడెలాగో తప్పించుకుని బయటపడిందనీ, యీవిడ వెనక పెద్ద కథే వుంటుందని యిక్కడి సెక్యూరిటీ ఆఫీసర్లు అనుమానిస్తున్నారనీ చెప్పాను.

పచ్చకామెర్లవాడికి లోకమంతా పచ్చగా కనిపించినట్టే, సెక్యూరిటీ అధికారులకు ప్రయాణికులందరూ తీవ్రవాదులుగానే కనబడతారు పొమ్మనాడు చోప్రా. అతగాడెక్కడ సెక్యూరిటీ ఆఫీసర్ల దగ్గరికెళ్తాడో నన్న భయంతో నేను మరింతగా విజృంభించాను – పోయిన నెలలో ప్రమాదకరమైన వస్తువులతో బాటూ యేదో విమానంలో వెళ్తూ పట్టుబడింది యీవిడే నని సెక్యూరిటీ అధికారులు చెప్పారన్నాను. అనుమానంరాగానే యీవిడను యేదో స్పానిష్ యెయిర్‌పోర్టులో దించేశారట! స్పానిష్ అధికారులు ఆవిడ లగేజీలో రెండు సీసాల్లో యేదో ద్రవాన్నీ, రెండు కవర్లలో యేదో పొడరునూ కనిపెట్టారట. పరీక్షలన్నీ ముగిశాక అవి పేలుడు పదార్థాలుకావని తేలిందట. అయినావాళ్ళ అను మానాలు మాత్రం తీరలేదట. ఆవిడను మాంచెస్టరులో దించేశారట. అక్కడ మూడు రోజుల పాటూ రిమాండులో పెట్టారట. ఆమూడు రోజులపాటూ ఆవిడకు సెల్‌లో సరిగ్గా రగ్గులుకూడా యివ్వలేదట! ఆ తరువాత ఆవిడ లాయర్ యీ విషయానికి పెద్ద రాద్ధాంతం చేశాడట!

సెక్యూరిటీ అధికారులు యీ హాలీవుడ్ సుందరే ఆ అనుమానితురాలని అనుమాని స్తున్నారు గానీ, ఆవిడే యీవిడని కచ్చితంగా తెలిసివుంటే యీ 'అట అట' అనే ధోరణి

వుండేదిగాదని చో(పా వాదించాడు. నిస్సహాయురాలైన స్త్రీని అలా వొంటరిగా సెక్యూరిటీ వాళ్ళ కప్పగించి చూస్తూ వూరుకోలేనని తేల్చిచెప్పేశాడు. అతణ్ణి వారించడానికి నాకప్పటికి దొరికిన మార్గమొక్కటే! యెలాగూ యిదివరకే యింటరాగేట్ చేయబడ్డాను కాబట్టి నేనే వెళ్తానని పైకిలేచాను. యింత వరకూ అనుమానాస్పదుడు గాని తనని వాళ్ళ దగ్గరికి పంపడం స్నేహధర్మంగాదని వాదించాను.

ఆనందమూ, అనుమానమూ కలగలిసిన చిత్రమైన నవ్వును నాకేసి రువ్వాడు చో(పా. ఆ హాలీవుడ్ సుందరిని కాపాడ్డానికి నాకు చేతనయిన మార్గాన్ని నేను యెన్నుకోవచ్చునన్నాడు. తాను యిప్పటికిప్పుడు ధ్యానంలోకి వెళ్ళి, ప్రపంచాన్నంతా తనకు అనుగుణంగా మార్చేసుకుంటానన్నాడు. వెంటనే కళ్ళు మూసుకుని, యిహలోకాన్ని పూర్తిగా నాకే అప్పగించేసినట్టుగా, తాను తన ఆధ్యాత్మిక లోకానికెళ్ళిపోయాడు

నా సూట్‌కేసుతో బాటూ అతడి సూట్‌కేసును గూడా కాపాడుకునే బాధ్యత మళ్లీ నాపైనే పడింది. యిహపరాల్లాంటి ఆ రెండింటినీ లాక్కుంటూ నేను మా లౌంజ్ దాటి మలుపు తిరిగాను. సెక్యూరిటీ ఆఫీసర్ల కెదురుగా యిదివరకూ నేను కూర్చున్న కుర్చీలో హాలీవుడ్ యువతి కూర్చునివుంది. పెద్దగా చేతులు తిప్పుతూ వాళ్ళకేదో చెబుతోంది. సెక్యూరిటీవాళ్ళు తమ తెలివితేటలకు తామే మురిసిపోతున్నట్టున్నారు.

నేను వాళ్ళ కళ్ళల్లో పడితే మళ్ళీ వాళ్ళు అనుమానపడి తీరతారు. ఆ ఆలోచన రాగానే నేను కంగారుపడుతూ యెదురుగా కనిపించిన రెస్టురూములోకి దూరేశాను. వాష్ బేసిన్‌ముందు నిలబడి ముఖం కడుక్కుంటూ, యూరినల్స్ దగ్గర నిలబడి నటనలు చేస్తూ యెంతసేపని కాలం తోయగలం చెప్పండి? యిలా కుదరదని వొక టాయిలెట్‌లోకి దూరి, సూట్‌కేసులు రెండింటినీ వోమూల ముద్దాయిల్లా నిల్చోబెట్టి, టాయిలెట్ మూతపైన స్టూలుపైన కూచున్నట్టుగా కూర్చుని, సెకండ్లు లెక్క బెట్టసాగాను. యిప్పుడు నాలోకం నాలుగు యింటూ నాలుగు అడుగుల చిన్నదైపోయింది. అయిదడుగుల పొడవున్న రేకులతో కట్టిన ఆ చిన్నలోకపు గోడలు బయటి నుంచీ గాలీ వెలుతుర్లను యథేచ్ఛగా లోనికి రానిస్తున్నాయి. విమానాశ్రయపు వుద్యోగుల జాగ్రత్తను ప్రతి ఫలిస్తున్నట్టుగా రెస్ట్‌రూం అతి శుభ్రంగా వుంది. యేదో 'రూంప్రెషనర్' వాసన హాయిగా వస్తోంది. అయినా యింత చిన్న లోకంలోకి కుదించుకుపోయా నెందుకు నేను? శనిదేవతకు బయపడి యేదో చెట్టుతొర్రలో దాక్కున్న పరమేశ్వరుడి కథ జ్ఞాపకం వస్తోందినాకు. దమ్మలాల్ చో(పా విశాలమైన లౌంజ్‌లో ధ్యానం చేసుకుంటున్నాడు. హాలీవుడ్ సుందరి సెక్యూరిటీ అధికారుల్ని కవ్విస్తోంది. నేను ప్రకృతి పిలుపు రాకపోయినా యీ భౌతిక శౌచాలయంలో బంధీనైపోయాను. యెక్కడో నీటి చుక్కలు కాలాన్ని కొలుస్తున్నట్టుగా రాలుతున్నాయి. విమానాశ్రయంలోని ప్రయాణీకులెవరూ యీరెస్టురూమును పలక రించడానికయినా రావడం లేదు.

నేను గూడా కళ్ళుమూసుకుని రహస్యసంకేతాలేమైనా వినబడితే విందామని ప్రయత్నించి చూశాను. రెస్టరూంపైన్నుంచీ యెగ్జాస్టఫాను తిరుగుతున్న శబ్దమూ, కొళాయి ల్లోంచీ నీళ్ళు కారుతున్న సవ్వడీ తప్ప మరేమీ వినిపించడంలేదు. యీ వొంటరి శిక్షను అరగంటకంటే యెక్కువ సేపు భరించలేక రెస్టరూం నుంచీ బయటి కొచ్చేశాను.

దమ్మలాల్ చోప్రా యింకా ధ్యానంలోనే వున్నాడు. దూరంగా ఖాళీవాలుకుర్చీ, హాలీవుడ్ సుందరి యింకా తిరిగిరాలేదని వాపోతోంది. నేను రెండు సూట్‌కేసుల్నీ శబ్దమొచ్చేలా అవతలపడేశాను.

దమ్మలాల్ చోప్రా కళ్ళు తెరిచి, ప్రశాంతంగా నవ్వి "ఆమెకేమీ కాదు! నేనున్నాను గదా!" అన్నాడు.

యితగాడు ధ్యానం చేస్తున్నదేమో యిక్కడ! వూళ పెడుతున్నదేమో అక్కడట! యిప్పుడు మేమున్న పరిస్థితెలాంటిదో, యిది యెటువంటి యిబ్బందులకు దారి తీయ వచ్చో యితడికి తెలిసినట్టేలేదు. సెక్యూరిటీ ఆఫీసర్ల మాటల్ని బట్టి హాలీవుడ్ సుందరి కొద్ది రోజులపాటూ రిమాండులో వుండబోతోందని తెలిసిందని కోసాను.

ముందుగా యే సంగతీ నిరూపించకుండా, అలా రిమాండులో వుంచడానికే దేశపు న్యాయమూ వొప్పుకోదని ధీమాగా చెప్పాడు దమ్మలాల్ చోప్రా.

యిలాగే వో అనుమానితుడిని లండన్‌లో సెక్యూరిటీ వాళ్ళు రిమాండులో పెట్టారనీ, అది తప్పని వాదించిన లాయరుకు వాళ్ళు యిరవై యెనిమిదిరోజులపాటూ యే అనుమానితుడినయినా అలా రిమాండులో వుంచే హక్కు పోలీసులకుందని రుజువు చేసి చూపెట్టారనీ వాదించాను. ఆ హాలీవుడ్ సుందరిని యిప్పుడు సెక్యూరిటీ అధికారులు యేదో రహస్య ప్రదేశానికి తరలించబోతున్నారనీ, అక్కడామెను 'క్లోజ్డ్‌డోర్స్'లో ప్రశ్నించబోతున్నారనీ చెప్పాను. పైగా ఆవిడ దగ్గర దొరికిన డాకుమెంట్లను లాప్‌టాప్‌ల సహాయంతో అర్ధంచేసుకోడానికి యెంతలేదన్నా మూడు నాలుగు వారాలు పడుతుందనీ, అంత వరకూ ఆవిడ రిమాండులో వుండాల్సిందేననీచెప్పాను. నా కథలో మసాలా దట్టించడంకోసం, యిప్పుడు సెక్యూరిటీ అధికారులు దమ్మలాల్ చోప్రా డైరీల్లో కవిత్వమెక్కువగా వుందో, లేకపోతే ఆవిడ డాకుమెంట్లలో యెక్కువ కవిత్వముందో తేల్చుకోలేక జుట్టుపీక్కుంటున్నారని చమత్కరించాను.

ఆవిడ డాకుమెంట్లలో కవిత్వమేముంటుందని ముందుగా దమ్మలాల్ చోప్రా విస్తుపోయాడు. ఆఫ్ఘనిస్తాన్ నుంచీ చేతి సంచుల్లో మందుగుండు సామగ్రుల్ని ద్రవ పదార్ధాలుగానూ, ట్యూబుల్లో జెల్లీలుగానూ మోసుకెళ్ళే స్త్రీల డాకుమెంట్లలో యేముం టుంది? ఆల్‌ఖాయిదా సమాచారాలూ, సూయిసైడ్ నోట్‌లూ వుంటాయి. బతకడంకంటే

మరణానంతర జీవితాన్నే గొప్పగా భావించినవాళ్ళ రాతల్లో కవిత్వంగాక యింకే ముంటుందన్నాను నేను?

యీసారి నిజమేనని వొప్పుకుంటున్నట్టుగా తలవూపాడు దమ్మలాల్ చోప్రా .'కంటికి కనిపిస్తున్నదానికీ, మనస్సుకు మాత్రమే కనిపిస్తున్నదానికీ మధ్య కట్టిన మాటల వంతెనేకదా కవిత్వమంటే!' అన్నాడతను. పైగా అంత అందమైన స్త్రీ గాకపోతే యింకెవరు కవిత్వంరాయగలరనీ, ఆవిడ అందమైన వేళ్ళు మాటలతోనే బొమ్మలు గీసే కుంచెల్లాగు న్నాయనీ, ఆవేలికొసల్లోంచీ జాలువారేదంతా నిస్సందేహంగా కవిత్వమే అయి తీరుతుందనీ అన్నాడు. తర్వాత దీర్ఘంగానిట్టూర్చి, తన కవిత్వాన్ని నిజంగా ఆసెక్యూరిటీ ఆఫీసర్లు చదివేవుంటే, వాళ్ళలో తప్పకుండా పరివర్తన వచ్చేవుంటుందని ధీమాగా చెప్పుకుపోయాడు.

భలే కవిత్వమే రాశాడీ పెద్దమనిషి! ఆడైరీల్లో యితగాడురాసిన ఆ అబ్‌స్ట్రాక్ట్, అయోమయపు రాతలకూ ఆల్‌ఖాయిదా డాకుమెంట్లకూ పెద్దతేడాలేదని నిరూపించి పారేయచ్చు. ఆసెక్యూరిటీ ఆఫీసర్లకూ కవిత్వానికీ చుక్కెదురు గావడంతో బతికిపోయాం. నా యీ సహప్రయాణీకుడికి మొదటినుంచీ కార్చిచ్చుతో ఆడుకోవడమే వొక ఆటగా వున్నట్టుంది. అంతటితో వూరుకోకుండా, కొండచిలువను కౌగిలించుకుంటున్నట్టుగా, యిప్పుడీ హాలీవుడ్ సుందరిని కాపాడి తన హీరోయిజాన్ని చాటి చెప్పాలను కుంటున్నాడు. అయినా యితనే గంగలో దూకినా నాకే అభ్యంతరమూ లేదు. నన్నుగూడా ముంచేయా లనుకోడంతోనే పేచీ....

నన్ను నేను కాపాడుకోవడంకోసం చివరిగా పాశుపత్రాన్ని పైకి తీయక తప్పలేదు నాకు– యీ హాలీవుడ్ సుందరి యేదోపెద్ద తీవ్రవాదుల కుటుంబానికి చెందిన వ్యక్తిఅని ఆసెక్యూరిటీ వాళ్ళు నాతో అన్నారని చెప్పాను. ఆకుటుంబంలో యింతవరకూ యెవరికీ సహజమరణమన్నదే రాలేదట! వాళ్ళందరికీ డబ్బులు మాత్రం వద్దంటే వచ్చిపడుతు న్నాయట! వీళ్ళవాళ్ళు అక్కడేమో భూకంపబాధితులకోసమని విరాళాలు వసూలు చేస్తారట! కానీ ఆడబ్బులనంతా యిలా తీవ్రవాద కార్యక్రమాలకే వుపయోగించు కుంటారట!

చెప్పవలసినదంతా చెప్పేశాక, యిప్పుడేమంటావన్నట్టుగా చూశాను. నా ధోరణిలో పడిపోయి అతడెప్పుడు కళ్ళుమూసుకున్నాడో గమనించనేలేదు నేను. దమ్మలాల్ చోప్రా యిప్పుడు ధ్యానం లోలోపలికి దిగిపోతున్నాడు. కళ్ళుమూసుకున్న అతడి ముఖంలో చిన్న ముడతయినా కనిపించడంలేదు. ఆ పెరిగిన గడ్డం గీసేసుకుంటే, ఆ ముఖం బుద్ధుడి ముఖమంత ప్రశాంతంగా కనబడితీరుతుంది.

విమానాశ్రయం చుట్టూ ఆమ్‌స్టర్‌డాం ఆకాశం యెప్పుడు చీకటి తెరల్ని దింపిందో నేను గమనించనేలేదు. విమానాశ్రయంలోకి దిగుతున్న విమానాలిప్పుడు దీపాలు

తగిలించుకుని నక్షత్రాల్లా వెలుగుతున్నాయి. గాజుగోడ కవతల వెలుగుతున్న విద్యుద్దీపాలు ప్రతి వస్తువుకూ నాలుగు నీడల్ని సమకూరుస్తున్నాయి.

హాలీవుడ్ సుందరి యింకా సెక్యూరిటీ అధికారుల దృతరాష్ట్రకౌగిలిలోనే విలవిల లాడుతోన్నట్టుంది. ఆవిడగురించి నేను కల్పన చేసి చెప్పిన విషయాల్లో తప్పకుండా కొన్నయినా నిజాలైవుంటాయి. పత్రికలూ, యింటెర్నెట్లూ, టీవీలూ తీవ్రవాదులంతా యిలాగే వుంటారని కోళ్ళయికూస్తున్నాయి. యిప్పుడు నేను చెప్పిన వివరాలు నిజాలుగావని చెప్పే రుజువులు గూడా లేవు. రుజువులు దొరకనంత వరకూ నిజానికీ, కల్పనకూ తేడా వుండదు. ఆవిడ తప్పకుండా ప్రమాదకరమైన వ్యక్తే అయివుంటుంది. యిప్పుడు యేది నిజం, యేది కల్పన అన్నదిగాదు నా సమస్య. దమ్మలాల్ చోప్రా యే అఘాయిత్యమో చేయకుండా వుండాలంటే, అతడ్ని పూర్తిగా భయపెట్టడమొకటే నాకు గత్యంతరంగా మిగిలింది.

నా కడుపులో పేగులు కేకేస్తున్నాయి. పొద్దున్నెప్పుడో కె యెల్ యెమ్ విమానంలో తిన్న కాసింత తిండి తప్ప మరేమీ తినలేదు. ఆకలెక్కువయ్యేకొద్దీ నాకు కోపమూ, చిరాకూ పెరుగుతూంటాయని నా భార్య భయపడుతూవుంటుంది.

"సునో! దేఖో! అబ్ అద్భుత్ నికల్‌నా హీ పడేగా!" అన్నాడు దమ్మలాల్ చోప్రా వున్నట్టుండి.

నేను వులిక్కిపడ్డాను.

"యే సభీ భీమారోంకో యేకీ దవా! యిస్ కో జవాబ్ నహీ!"

అందరికీ అన్ని జబ్బులకూ వుపయోగపడే దివ్యౌషదమేదో తనకు దొరికి పోయినట్టుగా చెబుతున్నాడతను. అతడి గొంతు స్పష్టంగా, దృఢంగా, మోగుతోంది.

# 8

ముందుగా దూరంనుంచీ పక్షులేవో కువకువలాడుతున్నట్టున్న శబ్దమేదో వినిపించింది. తరువాత అడవి జంతువులేవో పరిగెత్తుకుని యిటే వస్తున్నట్టుగా అనిపించింది. ఆ తరువాత ఆసవ్వడులన్నీ కలిసి ఆకారం ధరించినట్టుగా యిద్దరు పిల్లలు మా లౌంజ్‌లోకి పరిగెత్తుకుని వచ్చేశారు. వాళ్ళు లౌంజ్‌లో కూర్చున్న మా యిద్దర్నిగానీ, గాజుగోడకవతల దీపాలు తగిలించుకుని రాక్షసతూనీగల్లా కిందికి దిగుతున్న జెంబో జెట్ విమానాన్ని గానీ పట్టించుకోకుండా, నేరుగా పిల్లల ఆటస్థలం దగ్గరికికెళ్ళి నిల్చున్నారు. అడ్డదిడ్డంగా బిగించిన కమ్మీలతో, కమ్మీల్ని కలుపుతూ వేలాడుతున్న రంగు దారాలతో, ఆకులు రాల్చుకున్న గున్నమామిడి చెట్టులాగున్న గ్లోబును తదేకంగా చూడసాగారు.

చిన్ననిక్కరూ , వొంటికి అతుక్కుపోయిన టీషర్టూ తొడుక్కున్న కుర్రాడి వయస్సు యేడేళ్ళుండవచ్చు. వాడి చేతులూ, తొడలూ యెర్రగా బలిష్టంగా వున్నాయి. లేత రాగిరంగుజుట్టు వాడి ముఖంపైకి వేలాడుతోంది. సగం విప్పుకున్న పెదవులతో వాడి నోరు యిప్పుడే పగిలిన దానిమ్మ పండును గుర్తుకు తెస్తోంది. వాడి పక్కన నిల్చున నాలుగైదేళ్ళ ఆడపిల్ల వొంటిపైన బనీనూడ్రాయరూ కలగలిసిన మూరెడు వూదారంగు గుడ్డతప్ప మరేమీలేదు. పక్కనున్న కుర్రాడితో పోటీపడుతున్నట్టుగా ఆపిల్ల శరీరంలావుగా, యెర్రగా మినమినా మెరుస్తోంది.

నల్లటితోలు సంచిని మోస్తున్న ట్రాలీ సూట్‌కేసునులాక్కుంటూ, వో నడివయసు మగాడు లౌంజ్‌లోకొచ్చాడు. అతడికి పదిహేనడుగుల దూరంలో అనుసరిస్తూ, వానిటీ బాగ్‌ను వూపుకుంటూ వచ్చిన స్త్రీ దూరంగా కుర్చీలో కాలుపైన కాలేసుకుని కూర్చొంది.

దమ్మలాల్ చోప్రా వాళ్ళిద్దరినీ చూస్తూ "రష్యా?" అన్నాడు. వదులుగా వేలాడుతున్న టీ చొక్కాతో, దాదాపు పైజమాలాగున్న పాంటుతో ఆమగవాడు యెండల దేశం నుంచీ వచ్చినవాడులా కనబడుతున్నాడు. వొంటికి అతుక్కుపోయిన పాంటూ షర్టులపైన వూలు కోటు తొడుక్కున్న ఆ యువతి చలిదేశాల నుంచీ వచ్చినట్టు తెలిసిపోతోంది. వీళ్ళిద్దరూ వొకేదేశం నుంచీ వచ్చారని వూహించడానికే  కష్టంగా వుంది.

పిల్లల ఆటస్థలమనే బోర్డున్న చోట వుండడంతో ఆ యినపకమ్ముల గ్లోబు ఆడుకునే సాధనమని మాత్రం అర్థమవుతోంది. అయితే యెలా ఆడాలో, ఆ ఆటకున్న నియమా లేమిటో ఆపిల్లలకు కూడా తెలిసినట్టులేదు. బహూశా యీలోకంలోకి వచ్చిన మొదటి స్త్రీ, మొదటి పురుషుడూ, యీ భూగోళంతో యెలా ఆడుకోవాలో తెలియకుండా, యిలాగే విస్తుపోయివుంటారు. చూసీ చూసీ విసిగిపోయినట్టుగా, ఆ మగపిల్లాడు గ్లోబు కమ్ములు పట్టుకుని పైకెగబాకి, వో దారాన్ని పట్టుకుని వూయల్లా వూగసాగాడు. ఆడపిల్ల వుత్సాహంగా చప్పట్లు చరిచింది. అదొక హేళగా పిల్లాడు వొకచేతిని వదలిపెట్టి, యింకో చేత్తో వూగసాగాడు. పట్టుజారడంతో కిందపడ్డాడు. కింద అడుగుమందమున్న స్పాంజి పరుపు ఆ పిల్లాడి శరీరాన్నలాగే పైకి విసిరంది. ఆడాల్సిన పద్ధతేమిటో తెలిసిపోయినట్టుగా ఆడపిల్లగూడా గ్లోబుకమ్ముల పైకెక్కి, దారాన్ని పట్టుకుని వూగి, కావాలని కిందికి దూకింది. బంతిలా స్పాంజి పరుపుపైన యెగిరెగిరిపడుతూ కేరింతలు కొట్టసాగింది.

అవతల కుర్చీలో కూర్చున్న మగవాడి జేబులోని మొబైల్‌ఫోను రింగుమంది. అతను తనఫోనును చెవికానించుకుని, మాట్లాడుతూ వెళ్ళి, లౌంజ్ గాజుగోడ దగ్గర నిల్చున్నాడు. ఆవిడ తన వానిటీ బాగ్‌లోంచీ తన మొబైల్‌ఫోను తీసి, యేదో నెంబరు నొక్కి, ఫోనుకే వినిపించనంత మెల్లగా పెదవులు కదపసాగింది.

"యిస్‌కో ఫామిలీ కెహెతేహై బాయ్! జోరూ వుదర్, పతీ యిదర్... అవుర్ బచ్చే యిదర్‌వుదర్..." అంటూ దమ్మలాల్ చోప్రా నవ్వేశాడు.

చోప్రాను వుడికించడంకోసం, వాళ్ళిద్దరూ భార్యభర్తలేనని తనకెలా తెలిసిందని ప్రశ్నించాను. అతను అయోమయంగా చూసి, కాదని చెప్పడానికి మాత్రం రుజువులేము న్నాయని అడిగాడు. యీ చోప్రా నేననుకుంటున్నంత అమాయకుడేంగాడని అర్థమై పోతోంది. ఫోనులో మాట్లాడుతున్న ఆ మగవాడి ముఖంలో చిరునవ్వులు చిందులేస్తు న్నాయనీ, యివతల ఆ స్త్రీ ఫోనులో ప్రేమనుకుమ్మరించేస్తోందనీ, అందువల్ల వాళ్ళిద్దరూ వాళ్ళవాళ్ళ ప్రేమికులతో మాట్లాడుకుంటున్నారనీ వాదించాను. అలా యిద్దరికీ వేర్వేరు ప్రేమలుంటే యిలా యెందుకు కలిసుండాలని చోప్రా దబాయించాడు. అతడికి నిజా నిజాలు విడదీసి చూపడం కోసం, నేను మెక్సికోలో నాకు పరిచయమైన గైడు గురించి చెప్పసాగాను. ఆ మెక్సికో గైడుకు పాతికేళ్ళ వయసుంటుంది. వాడు నెలలో మొదటి ఆదివారం తల్లి దగ్గరికెళ్తాడట! మూడో ఆదివారం తండ్రి దగ్గరికెళ్తాడట! వాడి అమ్మానాన్న పెళ్ళిచేసుకోకుండానే వీడినీ, వీడి అన్ననూ, కన్నారట! వీళ్ళమ్మకువీళ్ళుగాకుండా యింకెవడో వొక కొడుకున్నాడట! వాడినాన్నకు వేరే ఆడవాళ్ళ ద్వారా యెందరు పిల్లలున్నారో వాడికే తెలియదన్నాడు. వాడి అన్నకు ఆడపిల్లలంటే భలే పిచ్చనీ, యెప్పుడూ చేపలుపట్టే పడవుల్లో తిరుగుతూవుంటాడనీ, గత రెండేళ్ళుగా వాడి అతీగతీ తెలియదనీ అన్నాడు. వాడి మాటలు వింటూంటే ఆ అన్న అనేవాడు బతికున్నాడో లేడో ననే అనుమానం వచ్చింది నాకు. నెలలో మిగిలిన సెలవుదినాల్లో వాడు తన గర్ల్‌ఫ్రెండ్సుతో గడుపుతానని సిగ్గయినా లేకుండా చెప్పాడు. పైగా తనకిప్పుడు నలుగురు గర్ల్‌ఫ్రెండ్సు న్నారని హీరోలా చెప్పాడు. యింతా చెప్పాక, యిప్పుడు అవతల ఫోన్లలో రొమాన్సు చేస్తున్న ఆ యువతీ యువకులిద్దరూ యీ బాపతు మనుషులేనని తేల్చిపారేశాను. యింకా కావాలంటే అక్కడ ఆడుకుంటున్న పిల్లలిద్దరినీ జాగ్రత్తగా చూడమన్నాను. వాళ్ళిద్దరిలో వీళ్ళిద్దరీ పోలికలూ లేవు. అంటే ఆపిల్లకు ఆ స్త్రీ పాత ప్రియుడిపోలికలూ, యీ పిల్లాడికి ఆ మగాడి పాత ప్రియురాలి పోలికలూ వచ్చివుండవచ్చునని ముక్తాయించాను.

అంతా విన్నాక 'అయితే ఆ ఆడపిల్ల ఆ మగవాడి కుతూరూ, ఆ మగపిల్లాడు ఆ స్త్రీ కొడుకూ యెందుకు కాకూ'డదని అడిగాడు చోప్రా.

అతణ్ణి ముగ్గులోకి దించినందుకు సంతోషపడుతూ, "నువ్వు భలే తెలివైన వాడివి బాయ్! అయివుండవచ్చు" అని మెచ్చుకున్నాను.

దమ్మలాల్ చోప్రా వంగి, నా భుజంపైన చేయివేసి, "యే ఆద్మీ యా జాన్‌వర్!" అని వాపోయాడు. నేనతడికేసి అనునయంగాచూసి, అంతలో నవ్వేసి "నువ్వలా నన్ను

పట్టుకుంటే మనల్ని యిక్కడి వాళ్ళు హోమోలనుకునే ప్రమాదముంది. యీ విదేశాల్లో హోమోలు మాత్రమే వొకరిపైన వొకరు పడతారు...” అన్నాను. దమ్మలాల్ చోప్రా గబాలున తన చేయి వెనక్కు లాక్కున్నాడు.

మొబైల్ ఫోనులో మాట్లాడుతున్న మగవాడు అలాగే వెనక్కునడచి లౌంజ్‌లోంచీ బయటికెళ్ళిపోయాడు. ఆవిడ ఫోనుకు కాస్త విరామమిచ్చి పిల్లలకేసి చూస్తూ చిత్రమైన శబ్దాల్ని ప్రసారం చేసింది. వాళ్ళిద్దరూ తిరిగి చూడకుండా వూయలలూగుతున్నారు. ఆవిడ తన తోలు సంచిలోంచీ రెండు పెద్ద కవర్లు తీసి గ్లోబు కివతులున్న కుర్చీపైన పెట్టింది. తరువాత ఫోనును మళ్ళీ చెవికానించుకుని, సూట్‌కేసును లాక్కుంటూ లౌంజ్ దాటి వెళ్ళిపోయింది.

దమ్మలాల్ చోప్రా కుర్చీలోని ప్లాస్టిక్ కవర్లను చూస్తూ “పాప్ కార్న్!” అన్నాడు వుత్సాహంగా. తరువాత, “దేఖానా! పహాడ్ మహమ్మద్ కే పాస్ ఆయా!” అని పరవశించి పోసాగాడు. నేను పెద్దగా నిర్ఘాంతపోయాను. అందుకు కారణాలు రెండు. వొకటి పిల్లలకోసం వున్న తినుబండారాలపైన ఆశపడటం. రెండవకారణం మరీ తీవ్రమైంది. తనకోసం ఆహారమే వెదుక్కుంటూ వచ్చిందని చెప్పడానికి యితను మహమ్మద్ దగ్గరికి నడచివచ్చిన పర్వాతాన్ని జ్ఞాపకం చేస్తున్నాడు. యిన్ని అనుభవాలు గడచాక, యింకా తనడైరీ సెక్యూరిటీ ఆఫీసర్ల చేతిలో వుండగానే, యితనింత గట్టిగా ‘మహమ్మద్’ అనే మాటను వుచ్చరిస్తున్నాడు. యింతకంటే ఆత్మహత్యాసదృశమైన పని యింకొకటే ముంది చెప్పండి!

దమ్మలాల్ చోప్రా పైకిలేచి నెమ్మదిగా గ్లోబుకేసి నడవసాగాడు.

లౌంజ్ గాజుగోడకవతల తిమింగలంలా ఆగిన విమానం చుట్టూ జలగల్లాంటి ట్రక్కులు తిరుగుతున్నాయి. దూరంగా పూర్తిగా నల్లనైపోయిన ఆకాశం నగరపుదీపాల్ని మింగడంకోసం చూస్తోంది. యెరుపురంగు దీపాల్ని చేతులకెత్తుకున్న వుద్యోగులు యిద్దరు విమానాన్ని బెదిరిస్తున్నారు. లౌంజ్‌లో ఖాళీగావున్న వాలుకుర్చీ, దాని చుట్టూ మోహరించిన అత్తరూ, హాలీవుడ్ సుందరి లేని లోటును రెట్టింపు చేస్తున్నాయి.

గ్లోబు దగ్గరికెళ్ళి నిల్చున్నాక దమ్మలాల్ చోప్రా తనంతటతానే ప్రేక్షకుడిగా మారిపోయి, చప్పట్లు చరుస్తూ పిల్లల్ని హుషారెత్తించసాగాడు. గ్లోబు పైకెక్కి ఆడు కుంటున్న పిల్లలు ఆడం, యీవ్‌ల లాగానూ, వాళ్ళను మోసం చేయడంకోసం అక్కడి కెళ్ళిన దమ్మలాల్ చోప్రా సాటన్‌లాగానూ కనిపిస్తున్నారు. పిల్లలు తనను పట్టించుకోవడం లేదన్న నమ్మకం కలిగాక, వో ప్లాస్టిక్ కవరు తీసుకుని నాదగ్గరికొచ్చాడు.

“బహుత్ బూఖ్ లగాతాహై బాయ్!” అన్నాడు దీనంగా. పిల్లల దగ్గర దొంగతనమా – అని కోప్పడ్డాను.

ఆపాకెట్లున్న చోట యాభైరూపాయల నోటు పెట్టేసివచ్చాననీ, డాలర్లలోకి మార్చినా ఆ పాప్‌కార్న్ ఖరీదు అంతకంటే యెక్కువ వుండదనీ, అందువల్ల తానుచేసింది దొంగతనం కానేకాదనీ వాదించాడు చోప్రా. యిక నా సమాధానం తన కవసరంలేట్టుగా, పెద్దపెద్ద అడుగులేసుకుంటూ లౌంజ్‌దాటి దూరంగా వెళ్ళిపోయాడు.

పిల్లలిద్దరూ వొళ్ళు మరచిపోయి ఆడుతూనేవున్నారు. కాస్సేపయ్యాక మగపిల్లాడు వచ్చి, పాప్‌కార్న్ పాకెట్టు తీసుకుని, కార్న్ కసకసా నమలసాగాడు. ఆడపిల్ల గూడా వచ్చి పాకెట్టులోంచీ కొంత తీసుకుని తానూ తినసాగింది. వెంటనే పిల్లాడు పాకెట్టుతో బాటూ గ్లోబుకమ్ముల పైకెక్కి కూర్చున్నాడు. వాడినందుకోడం కోసం ఆపిల్ల పరిగెత్తింది. వాడు కోతిలా కమ్ములపైనుంచీ గెంతుతూ, పాప్‌కార్నంతా తానొక్కడే బొక్కసాగాడు. ముందుగా ఆపిల్ల నవ్వుతూనే అడిగింది. తర్వాత బుంగమూతిపెట్టింది. ఆ తర్వాత కోపంగా తరిమింది. వాడు పెద్దగానవ్వుతూ పాప్‌కార్న్ మెక్కసాగాడు. ఆ పిల్ల నేలమీద కూలబడి, చేతులూకాళ్ళూ పెద్దగా ఆడిస్తూ, బిగ్గరగా యేడవసాగింది. యింత గొడవ జరుగుతున్నా ఆ మగాడూ ఆడదీ యిటుకేసి రాలేదు. వాళ్ళిద్దరూ యెటువెళ్ళారో, యే రాచకార్యాలు చక్కబెడుతున్నారో తెలియదు. పిల్లల పాకెట్టును దొంగలించుకెళ్ళిన దమ్మలాల్ చోప్రా యేలౌంజ్‌లో కూర్చుని, లొట్టలేసుకుంటూ పాప్‌కార్న్ తింటున్నాడో! పిల్లల ఆట స్థలం దగ్గర యింత హడావుడి జరుగుతున్నా సెక్యూరిటీ ఆఫీసర్లు యిటు తిరిగి చూడటంలేదు. హాలీవుడ్ సుందరిని యింటరాగేట్ చేయడంలో వాళ్ళు తన్మయులై పోయినట్టున్నారు.

యింతలో దాదాపు పదేళ్ళ వయసున్న కుర్రాడింకొకడు నేల అదిరిపోయేటట్టుగా శబ్దంచేస్తూ పరిగెత్తుకొచ్చాడు. వాడు సన్నగా, పొడ్డుగా, హైబ్రిడ్ వంకాయకు చొక్కా నిక్కరూ తొడిగినట్టున్నాడు. యేడుస్తున్న అమ్మాయీ, వేలాడుతున్న కుర్రాడూ తననెంతకూ పట్టించుకోక పోయేసరికి కొత్త కుర్రాడు వొంటరిగానే ఆడుకోడానికి సన్నద్ధమైపోయాడు.

కొత్తపిల్లాడొకడు కనిపించగానే,ఆపిల్ల తనశృతి తగ్గించి, యేడుపును మూలుగుగా మార్చేసింది. ఖాళీ అయిన ప్లాస్టిక్ కవరును ఆపిల్లపైకి విసిరాక, పాతకుర్రాడు కొత్తవాడ్ని వుడికించడంకోసం వో కమ్మీనుంచీ యింకోకమ్మీపైకి గెంతసాగాడు. కొత్త కుర్రాడు వాడి ఆధిపత్యాన్ని భరించలేకపోయినట్టుగా కావాలని అడ్డం దూరాడు. దానితో పాతకుర్రాడు ధబేలుమని కిందపడ్డాడు. ఆడపిల్ల కసితీరినట్టుగా చప్పట్లు గొడుతూ నవ్వసాగింది. కొత్తకుర్రాడు చరచరా గ్లోబుపైకెక్కుతూ పకపకానవ్వాడు. పాతకుర్రాడు కాస్సేపు యేడవబోయి, అంతలో తేరుకుని, తాను పడడం తనకూ నచ్చినట్టుగా పెద్దగా నవ్వబోయాడు. గ్లోబు కొసనున్న కొత్తపిల్లాడు వెక్కిరిస్తూ కవ్వించాడు. పాతకుర్రాడు టార్జాన్‌లా గ్లోబుపైకి లంగించి, కొత్త పిల్లాడి కాళ్ళుపట్టుకుని బలంగా లాగాడు. వాడు

బలమంతా వుపయోగించి కాళ్ళు విదిలించాడు. యిద్దరూ వొకరి పైన వొకరుగా కిందపడ్డారు. తనకిందపడిన పాతకుర్రాడిని కదల నివ్వకుండా నొక్కిపెడుతూ కొత్త పిల్లాడు బుసలుగొట్టాడు.

వాళ్ళలా కుస్తీ పట్టుతూండగా దమ్మలాల్ చో(్రా తిరిగొచ్చి, గ్లోబు ముందునిలబడి, ఆవాక్కయిపోయి చూడసాగాడు. కిందపడిన పాతకుర్రాడు పైవాడిని వదిలించుకోడం కోసం గాలానికి తగులుకున్న చేపపిల్లలా తపతపా కొట్టుకోసాగాడు. వాడు వూపిరి తిరగకుండా అవస్థపడుతూంటే ఆ ఆడపిల్ల ఆనందంగా గెంతసాగింది. వొక్కసారిగా పాతకుర్రాడు శక్తినంతా వుగ్గబట్టి, విమానాశ్రయమంతా ప్రతిధ్వనించేటట్టుగా కిలారిస్తూ, తనపైనున్న కుర్రాడ్ని అమాంతంగా పైకెత్తి దూరంగా పడేశాడు. వాడి విజయాన్ని సమర్థిస్తున్నట్టుగా దమ్మలాల్ చో(్రా గూడా పెద్దగా చప్పట్లు చరిచాడు. కొత్తకుర్రాడు స్ప్రింగులా పైకిలేచి, పాత కుర్రాడిపైన పెద్దమూటలాపడ్డాడు. పాతకుర్రాడు తనపైన పడిన కొత్త పిల్లాడి గొంతు గట్టిగా పట్టుకున్నాడు. కొత్తకుర్రాడు వూపిరాడకపోవడంతో కాళ్ళుతపతపాకొట్టుకోసాగాడు.

దమ్మలాల్ చో(్రా ముందుకు పరిగెత్తి వాళ్ళిద్దర్నీ వేరుగా లాగి "ఛుప్...ఛుప్...గడ్ బడ్ నక్కో" అని కసిరాడు. మగపిల్లలిద్దరూ పందెపుకోళ్ళలా వొకరిపైకొకరు దూకడాని కోసం వురిమిచూడసాగారు. ఆడపిల్ల సంతోషంగా అరుస్తోంది. దమ్మలాల్ చో(్రా కొడతానన్నట్టుగా ముగ్గురినీ బెదిరించాక" దూర్‌దూర్‌జాకో ఖేలో.... మిలాకర్ ఖేల్‌నక్కో!" అని గద్దించాడు.

పిల్లలిద్దరూ చో(్రాను చూసి బయపడుతూ దూరంగా జరిగారు. చో(్రా పరవశంగా నవ్వి, ఆడపిల్ల బుగ్గగిల్లాడు. తరువాత నా దగ్గరికొచ్చి "యే బచ్చే నహీ! సైతాన్..." అని నవ్వాడు.

కొత్తకుర్రాడు గ్లోబుపైకెక్కి దానికి వేలాడుతున్న రంగుదారాల్ని పరీక్షించసాగాడు. పాతకుర్రాడు స్పాంజి పరుపుపైన వెల్లికిలాపడుకుని, వాడినే గమనించసాగాడు. ఆడపిల్ల మరోవైపు నుంచీ గ్లోబునెక్కసాగింది. కొత్తకుర్రాడీలోగా రెండు కమ్ముల్ని కలిపికట్టిన దారంపైకెక్కికూచుని, సన్నటి రేకులాంటి పరికరంతో దాన్ని కోయసాగాడు. అదే ధ్యాసతోవాడు దారాన్ని కోస్తోంటే పాతకుర్రాడు తదేకంగా చూడసాగాడు. దారం పోగులు పోగులుగా తెగి, చివరకు కుర్రాడి బరువును మోయలేక దబ్బున తెగిపోయింది. కొత్తకుర్రాడు అంత యెత్తునుంచీ కిందకు ధబేలుమని పడ్డాడు. పాతకుర్రాడు పైకిలేచి పడినవాడి దగ్గరికెళ్ళాడు. కొత్త కుర్రాడు శక్తినంతా వుపయోగించుకుని పైకిలేచాడు. యేదో ఘనకార్యం జరిగినట్టుగా పిల్లలు ముగ్గురూ పడీపడీ నవ్వసాగారు.

పిల్లలు ముగ్గురూ కొట్టుకోడానికి బదులుగా, కలిసి ఆడుకుంటున్నారని మెచ్చు కుంటూ దమ్మలాల్ చో(్రాగూడా నవ్వసాగాడు.

బూడిదరంగు సూటు తొడుక్కున్న మగవాడొకడూ, పొడవాటి నల్లరంగు గౌను తొడుక్కున్న స్త్రీ వొకతే ట్రాలీసూట్‌కేసుల్ని లాక్కుంటూ లౌంజ్‌లోకొచ్చారు. కొత్తకుర్రాడు తాను తెంపిన దారాన్ని వాళ్ళిద్దరికీ చూపెడుతూ యేదో చెబుతున్నాడు.

చోప్రా వాళ్ళ సూట్‌కేసులపైనున్న అట్టపెట్టెలను చూపెడుతూ, "సాండ్‌విచ్... హాట్‌డాగ్స్... బర్గర్.... దో ఆద్మీకో వుత్‌నా ఖానా కైకో!" అని వాపోయాడు. తర్వాత తాను తిన్న వొక పాకెట్టు పాప్‌కార్న్ వొకమూలకు గూడా సరిపోలేదనీ, పైగా అది తిన్నాక మరింతగా ఆకలిపెరిగిపోయిందనీ పిర్యాదు చేశాడు.

యిదివరకూ ఫోన్లలో మాట్లాడుకుంటూ వెళ్ళిపోయిన మగవాడూ, స్త్రీ, చోప్రాను మరింతగా వెక్కిరిస్తున్నట్టుగా, రెండుచేతులతోనూ తినుబండారాలున్న అట్టపెట్టెలనూ, కోలాసీసాలనూ పట్టుకుని లౌంజ్‌లోకి అడుగుపెట్టారు.

"వుస్‌కో దేఖో బాయ్!" అంటూ దమ్మలాల్ చోప్రా వాపోవడం మొదలుపెట్టాడు. యివతల యిద్దరు మనుషులు ఆకలితో నకనకలాడుతూంటే, తమకేమీ పట్టనట్టుగా తిండంతా తామే తినడమన్న లక్షణం భారతీయులకుండనే వుండదన్నాడు. యీ జపానీవాళ్ళో, జర్మనీవాళ్ళో తినడంలోనే ఆనందముందనుకుంటున్నారన్నాడు. పొద్దున విమానంలో తిన్న పిడికెడు భోజనమెప్పుడో అరిగిపోయిందనీ, నీరసంతో తనకు స్మారకం తప్పిపోయేలాగుందనీ, మొత్తుకున్నాడు. యీ అడివంత పెద్ద విమానాశ్రయంలో యిన్ని హొటళ్ళున్నా, కొనుక్కొని తినడానికి నాలుగుయూరోడాలర్లయినా తీసుకెళ్ళమని చెప్పని ట్రావిలింగ్ యేజెంటునూ, మెక్సికోలోని యిండియన్ యెంబసీ వుద్యోగులనూ పేరు పేరునా దుమ్మెత్తిపోశాడు. జేబుల్లోవున్న నాలుగువేల రూపాయల యిండియన్ కరెన్సీ యిక్కడ చెల్లకపోవడంపైన అంతర్జాతీయ విప్లవం లేవదీయాల్సిందేనని తీర్మానం చేశాడు. నేనతడి మాటలకు తగినట్టుగా జాలిచూపెడుతూ, సానుభూతిచెబుతూ, కంగారుపడుతూ, వంతపాడుతూనే వున్నాను. కానీ నన్నతను పట్టించుకోకుండా, పూనక మొచ్చి వాడిలా గబాలున పైకిలేచి, గ్లోబు దగ్గరున్న రెండు జంటల దగ్గరికి దూసుకెళ్ళాడు.

కుడిచేతిలో రూపాయలనోట్లు చూపుతూ, యెడమ చేతిని వాళ్ళుతింటున్న ఆహారం కేసి చూపుతూ "ముజ్‌కో ఖానా హొనా! యే దుఖానేవాలా హమారా పైసా లేతానహీ... పాంచ్‌సౌలేవో... చేసౌలేవో... ఖానాదేవో...." అని దీనంగా ప్రాధేయపడ సాగాడు. అతడి హిందీ అర్థంగాకపోవడంతో వాళ్ళు నలుగురూ తికమకపడసాగారు. గౌను తొడుక్కున్న యువతి అదే భాషో అర్థంగాని భాషలో గీపెట్టింది. మగవాళ్ళు గూడా వంతగలిపారు. గోడుగోడుమని చోప్రా, కాసరబీసరమని వాళ్ళూ అరుస్తూండగా సెక్యూరిటీ ఆఫీసరొకడు బెల్టుహొల్డరు లోని నల్లని నిగనిగల తుపాకీని దర్పంగా అరచేత్తో నిమురుతూ మా లౌంజ్‌లోకొచ్చాడు. అతడిని చూడగానే అంతవరకూ అరుస్తున్న అయిదు మందీ నోళ్ళకు బీగాలేసుకున్నారు.

సెక్యూరిటీ ఆఫీసరు లౌంజ్‌లోని పెద్దవాళ్ళనంతా వుదాసీనంగా చూశాక, పిల్లలకేసి తిరిగాడు. ముగ్గురు పిల్లలూ గ్లోబు పైనవేలాడుతున్న దారాలను రేకులతో కోస్తున్నారు. తెగినదారాలు కొన్ని స్పాంజి పరుపుపైన చచ్చిన పాముల్లా పడివున్నాయి. సెక్యూరిటీ ఆఫీసరు పొడవాటి వాకీటాకీని చెవికానించుకుని యేదో గొణిగాడు. తరువాత నన్నూ, దమ్మలాల్ చోప్రానూ తన వెంటరమ్మన్నట్టుగా సైగచేశాడు. చోప్రా నాకేసి నిస్సహాయంగా చూశాడు. నేను భయపడుతూనే రెండు సూట్‌కేసుల్నీలాక్కుంటూ ముందుకెళ్ళాను. సెక్యూరిటీ ఆఫీసరు త్వరగారమ్మనట్టుగా చేయివిసిరాడు.

నీలిరంగు యూనిఫారాలు తొడుక్కున్న విమానాశ్రయపు వుద్యోగులు ముగ్గురు లౌంజ్‌లో కొచ్చారు. వొకతను యినపకమ్ముల గ్లోబుపైకెక్కిన పిల్లలు ముగ్గురినీ కిందికి రమ్మని కసిరాక, దానిముందు "UNDER REPAIR" అనే బోర్డును నిలబెట్టాడు. మరోవ్యక్తి యెర్రని రిబ్బన్లున్న బారికేడ్లను గ్లోబుచుట్టూ అమర్చాక "NO ENTRY - SERVICING" అనే బోర్డు తగిలించాడు. మూడోవ్యక్తి నేలపైనపడేసిన ప్లాస్టిక్ కవర్లనూ, అట్టపెట్టెలనూ చిమ్మసాగాడు. యింకాస్సేపాగితే తమను గూడా అతను చిమ్మేస్తాడేమోనని భయపడినట్టుగా పెద్దవాళ్ళు నలుగురూ తమ సామాన్లతో బాటూ బయటికి వెళ్ళిపోయారు. అంతవరకూ వొద్దికగా దారాల్ని తెగ్గోసిన పిల్లలు, మళ్ళీ యెందుకో కొట్టుకుంటూ పెద్దవాళ్ళ వెంట నడచిపోయారు.

నేను వెనుదిరిగి చూస్తూనే, దమ్మలాల్ చూప్రోతో బాటు సెక్యూరిటీ ఆఫీసరు వెనుక బయల్దేరాను.

హాల్లో హాలీవుడ్ సుందరి యింకా సెక్యూరిటీ ఆఫీసర్ల ముందు కూచునేవుంది. మేము కనిపించగానే చిరునవ్వు నవ్వి "వాటీజ్‌ది టైమ్ నౌ ప్లీజ్" అంది. "గ్యారా!" అన్నాడు చోప్రా వెంటనే, ఆప్రశ్నకోసమే యెదురు చూస్తున్నవాడిలా. నేనతడిని వురిమి చూశాను. నన్ను పట్టించుకోకుండా "యిలెవన్... యిలెవన్" అన్నాడు చోప్రా. ఆవిడ 'థ్యాంక్స్' అన్నట్టుగా తలూపుతోంది.

హాలుమలుపు తిరుగుతూనే సెక్యూరిటీ ఆఫీసరు వేగంగా నడవమంటూ మమ్మల్ని హుంకరించాడు. హాలీవుడ్ సుందరిని అతుక్కుపోయిన తన చూపుల్ని బలవంతంగా వెనక్కులాక్కుంటూ "అబ్ యే ఆద్మీ హమ్‌నే కహా లేజాతాహై బాయ్!" అని కంగారుగా అడిగాడు చోప్రా.

నేనతడికేసి కొరకొరా చూసి "తుమారా అద్భుత్ దిఖ్‌లానేకో!" అన్నాను.

విమానాశ్రయపు గాజుగోడకవతలి నుంచీ పెద్ద సవ్వడేదో వినవస్తోంది. క్రమంగా ఆశబ్దం మానెత్తిపైకి విసురుకొస్తోంది. చోప్రాకేసి భయంగా చూశాను.

‘చూశావా! యిప్పుడు నీకు కూడా అద్భుతం జరగబోతోందన్న నమ్మకం కలిగింది’ అన్నట్టున్నాయి చోప్రాచూపులు.

# 9

మరో రెండడుగులు విసవిసానడచాక, సెక్యూరిటీ ఆఫీసరు గోడపక్క ఆగిన వాహనం కేసి చేయివూపాడు. ట్రాలీకీ, స్కూటరుకూ, ట్రాక్టరుకూ తోబుట్టువులాగున్న ఆ వాహనం నేలపైన జారుతున్నట్టుగా మాదగ్గరికొచ్చి ఆగింది. డ్రైవరు సీటు పక్కనున్న కుర్చీలోకెక్కి కూచుంటూ మమ్మల్నీ రమ్మనట్టుగా చేయి వూపాడు సెక్యూరిటీ ఆఫీసరు. మేము మా ట్రాలీ సూట్‌కేసులతో బాటూ ఆవాహనంపైకెక్కాము. అది సక్రమని పాకుతున్నట్టుగా పరిగెత్తింది. రెండువైపులా వున్న అంగళ్ళను గమనించనివ్వకుండా అది ముందుకు వెళ్ళిపోసాగింది. అయిదునిముషాలలా గున్నయేనుగులా గునగునా పరిగెత్తాక, సన్నటి మలుపుతిరిగి, పెద్దద్వారంలోంచీ దూరి, సవ్వడి చేయకుండా ఆగిపోయింది.

యెదురుగా పొడవాటి రిసెప్షను కౌంటరూ, దానివెనక కంప్యూటర్‌తో మాట్లాడు తున్న బాబ్డ్ హెయిర్ తెల్లపిల్లా, ఆమెపక్కన నీలిరంగు సూట్ తొడుక్కున్న యువకుడూ కనిపించారు. వాళ్ళిద్దరి వెనకున్న గోడపైన, చెక్కతో చేసిన SHERTON అనే అక్షరాల్ని అతికించివున్నారు. కౌంటరుకెదురుగా వున్న సోఫాలకూ, కుర్చీలకూ కుండీలలోని పామ్ చెట్లు పహరా కాస్తున్నాయి.

సెక్యూరిటీ ఆఫీసరు కౌంటరు ముందుకెళ్ళి మౌనంగా నిల్చున్నాడు. గుర్రపుతోక జుట్టున్న అమ్మాయి, వోకార్డు తీసి అతడి ముందుంచింది. యెవరు నొక్కారో తెలియదుగానీ “బీప్” మంటూ శబ్దంవచ్చింది. నీలిసూటు తొడుక్కున్న యువకుడొకడు వెనక గదిలోంచీ వచ్చి మా ట్రాలీసూట్‌కేసుల్ని అందుకున్నాడు. మా పక్కనున్న గోడ తెరుచుకుని లిఫ్టు వొకటి కిందికి వచ్చాకగానీ, అక్కడదివుందని మాకు తెలియలేదు. సెక్యూరిటీ ఆఫీసరు వెనక బుద్ధిగా లిఫ్టులోకి నడిచాం మేమిద్దరమూ. నీలిసూటు వెయిటరు బోర్డుపైన మీటను నొక్కాడు. లిఫ్టు సరసరా పైకెక్కి యేడో అంతస్థులో ఆగింది. మళ్ళీ లిఫ్టులోంచీ బయటికొచ్చాము. వెయిటరు ‘0172’ అనే నెంబరున్న గది తలుపుల్ని తెరిచాడు. కార్డును గోడచట్రంలోకి దూర్చగానే గదిలో దీపాలు వెలిగాయి. వెయిటరు సూట్‌కేసుల్ని గదిమూలలో వుంచేసి వెనుదిరిగి వెళ్ళిపోయాడు.

మమ్మల్నిద్దరినీ కూచోమన్నట్టుగా సైగచేశాక “నౌ యువార్ దిగెస్ట్స్ ఆఫ్ నెదర్లాండ్ … యుకెన్ ఆర్డర్ యెనీఫుడ్ అవయిలబుల్ హియర్…. నోనీడ్‌టూపే…. యెంజాయ్ యువర్ సెల్ఫ్…” అన్నాడతను కోపమూ, తాపమూ ధ్వనించని తాటస్థ్యపు గొంతుతో..

అటు వూరూగాని, యిటు విమానాశ్రయమూగాని యీ అంతర్మధ్యపు కోటలో మమ్మల్నిలా బందీలుగా చేసి యెటువెళ్ళిపోతున్నాడీ పెద్దమనిషి? పైగా మమ్మల్ని

తమదేశానికి అతిథులంటున్నాడు. కావల్సినదంతా తెప్పించుకుని తినమంటున్నాడు. యిక్కడ మేమిలా యెంతసేపుండాలి? "యెక్సుక్యూజ్‌మీ! వై ఆర్యూ లీవింగ్ అజ్ హియర్? వుయ్‌హావ్‌నాట్ డన్ యెనీథింగ్ రాంగ్!" అని పెద్దగా ఆక్రోశించాను.

తలుపులు మూయబోతున్నవాడల్లా ఆగి, మాకేసి పారదర్శకమైన అద్దంలోంచీ అవతలున్నదేదో చూస్తున్నవాడిలా చూసి, "టు యెర్ ఆన్‌ది సైడ్ ఆఫ్ సెక్యూరిటీ" అన్నాడా సెక్యూరిటీ ఆఫీసరు. తరువాత "యువార్‌నాట్ అలౌడ్ టూ కమ్ అవుట్! యిఫ్ యూడిజ్‌వొబై, దేర్‌విల్ బీ డైర్ కాన్సిక్వెన్సెస్.." అన్నాడు.

తలుపులు ధడేలుమని మూసుకుపోయాయి.

నేను నిర్ఘాంతపడిపోతూ దమ్మలాల్ చోప్రాకేసి చూశాను.

నీళ్ళు నిండిన కళ్ళతో చూస్తూ, బొంగురు పోయిన గొంతుతో "వోక్యా కెహతాహై?" అని అడిగాడు చోప్రా.

నాలో చెలరేగుతున్న ఆందోళనను అణచుకోడానికి విఫల ప్రయత్నంచేశాక, బలవంతంగా గొంతుపెగల్చుకుని, అతను సెక్యూరిటీ కోసమని తాము తప్పుచేసినా పరవాలే దంటున్నాడని చెప్పాను.

చోప్రా కాస్సేపు ఆలోచించాక, వాళ్ళిప్పుడు తాము తప్పుచేశామని గ్రహించినట్టు న్నారని అన్నాడు. నన్ను నేను వోదార్చుకోవడం కోసమన్నట్టుగా నేను బింకంగా తలవూపాను.

వెళ్తూవెళ్తూ హోటలు వెయిటర్ యేసీ మీట నొక్కిపోయినట్టున్నాడు. రెండు గదులున్న ఆ సూట్ చల్లగా మారిపోయింది. అవతలి గదికి అటుచివరి గోడనంతా పెద్ద జిలుగుల తెరకప్పేసింది. ఆ తెరపక్కన పెద్దమంచమూ, మంచానికి రెండువైపులా కుర్చీలు రెండూ వున్నాయి. కప్పుపైనున్న ఫాల్స్ సీలింగ్ కన్నాల్లోంచీ వస్తున్న లేత పసుపురంగు వెలుతురు గదిగోడల రంగుతో కలిసిపోతోంది. మా సోఫాకెదురుగా పెద్దటీవీ, దాని పక్కనో చిన్న ఫ్రిజ్ కాచుక్కూచునివున్నాయి. మా గది కటు చివర్లో టేబులూ, కుర్చీ వున్నాయి. వాటికి బారెడు దూరంలోని తలుపు, అవతల టాయిలెట్ వుండవచ్చునని హెచ్చరిస్తోంది.

యెదురుగా టీపాయ్ పైనవున్న జగ్గులోంచీ గ్లాసులోకి నీళ్ళు వంచుకుని, జుబ్బా తడిసేట్టుగా గుటగుటా నీళ్ళుతాగాడు దమ్మలాల్ చోప్రా. తరువాత పైకిలేచి, అవతలి గదిలోకెళ్ళి, నిలువెత్తు పరదాను పక్కకు లాగాడు. యిటే వస్తున్న పెద్ద విమానమొకటి, గోడకవతలున్నది విమానాశ్రయమేనని చెప్పింది.

"టు యెర్ ఆన్‌ది సైడ్ ఆఫ్ సెక్యూరిటీ..." అంటూ సెక్యూరిటీ ఆఫీసరు మాటల్ని గుర్తుకు తెచ్చుకున్నాడు చోప్రా.

సెక్యూరిటీ ఆఫీసర్లు తాము తప్పుచేశామని వొప్పుకుంటున్నారా? లేకపోతే సెక్యూరిటీకోసం తప్పుచేసినా పట్టించుకోమని హెచ్చరిస్తున్నారా? తీవ్రవాదుల్ని యేరి పారేసే పనిలో కొంతమంది నిరపరాధుల్ని శిక్షించినా తప్పులేదని వాదిస్తున్నారా? యింతకూ యిప్పుడు వాళ్ళు మమ్మల్ని గదిలో బంధించారా? లేకపోతే వీళ్ళ దేశపు అతిథిలుగా భావించి గౌరవిస్తున్నారా? యేమో!

టీపాయ్‌పైన పడివున్న మెనూకార్డు తీసి చూశాక 'మనమిప్పుడేదైనా తెప్పించుకుని తింటే బావుండదా?' అన్నట్టు సైగచేశాడు చోప్రా. నేను యిబ్బందిగా నవ్వుతూ సరేన న్నట్టుగా తలవూపాను. తిన్న తర్వాత హోటలువాళ్ళు బిల్లు గట్టమంటే? నాకొచ్చిన సందేహం చోప్రాకు వచ్చినట్టులేదు. ఫోను తీసుకుని రూం సర్వీసు నెంబరు నొక్కి "టూ డిన్నర్.... మేకిట్‌క్విక్... అర్జెంట్" అని ఆర్డరిచ్చాడు. అవతలివాడేదో అడుగుతూంటే "వోకే...వోకే.....క్విక్" అని ఫోనును కిందపడేశాడు.

రూం సర్వీసువాడు యేమేమితేవాలని అడిగాడట. వాడు చెబుతున్న పేర్లు తినేపదార్థాలో, లేకపోతే యింకేమైనా వివరాలో తనకు తెలియలేదు. అందుకే అన్నిటికీ "వోకే" అనే సమాధానాన్నే చెప్పానని చోప్రా నవ్వడానికి ప్రయత్నించాడు. రెండు నిముషాలు గడచాక "యేచమత్కార్ దేఖో బాయ్!" అంటూ చెప్పుకుపోయాడతను. నిజమే! అతను చెబుతున్న విషయంలో కొంతయినా వుత్ప్రేక్షలేదు. మొత్తం మెక్సికోలోని యిండియన్ యెంబసీ అంతా, చివరకా అంబాసిడర్‌తో సహా, తమ శక్తినంతా వుప యోగించి ప్రయత్నించినా, యీ మా తిరుగుప్రయాణపు షెడ్యులు మార్చలేకపోయారు. యీ ఆమ్‌స్టర్‌డాం విమానాశ్రయంలోని హోటల్లో గదయినా రిజర్వు చేయించడానికి ప్రయత్నించి, చివరకు చేతులెత్తేశారు. అయితే మేము త్రీవవాదులయివుంటామనే అనుమానం, దేశాల అంబెసీలే చేయలేని పనిని చిటికెలో చేసి పారేసింది. యిప్పుడిక్కడ మాకు పైసా ఖర్చులేకుండా, అయిదు నక్షత్రాల హోటల్లో వసతీ, భోజనమూ దొరుకుతున్నాయి. యింతకంటే చిత్రమేముంటుంది? మొదటి నుంచీ దమ్మలాల్ చోప్రా చెబుతున్న అద్భుతం యిదేనేమో!

నేను కాళ్ళెత్తి టీపాయ్ పైనపెట్టి, వెనక్కువాలి, బద్దకంగా వొళ్ళు విరుచుకున్నాను. బహుశా, సెక్యూరిటీ ఆఫీసర్లు నిరపరాధులమైన మమ్మల్ని యిబ్బంది పెట్టినందుకు పశ్చాత్తాపపడుతూ, యిలా తమ తప్పును సరిదిద్దుకుంటున్నారేమో! మాకు అదనపు సౌకర్యాలను సమకూర్చడం ద్వారా తమ అపరాధభావం నుంచీ బయట పడదల్చు కున్నారేమో! ఆలోచిస్తూ తలపైకెత్తినవాణ్ణి అలాగే వులిక్కిపడ్డాను. గది పైకప్పుపైన,

రెండు మూలల్లోనూ సీసీ కెమెరాలున్నాయి. అంటే యీ గదిలో మేము చేస్తున్న ప్రతి పనీ వాళ్ళకు కనబడుతుందన్నమాట! మా చేష్టల్ని జాగ్రత్తగా గమనించడంకోసమని, యీ గదిలోకి తోశారన్న మాట! యిలాంటి సీసీకెమెరాలు విమానాశ్రయమంతా వున్నాయి గదా! యిక్కడైతే మరింతగా నిఘాను పెంచడం కుదురుతుందేమో!

"యాద్‌హై మై క్యాకెహా? పహాడ్ మహమ్మద్‌కే పాస్ ఆతాహై!... దానే దానే మే ఖానే వాలాకా నామ్‌హెూతాబాయ్!" అన్నాడు దమ్మలాల్ చోప్రా పరవశంగా.

నేను భయంతో నిలువెల్లా వణికిపోయి, అతడి చెవి దగ్గరికి వొంగి, ఆమాటమళ్లీ అనద్దనీ, సీసీకెమెరాలు మాపైన పహరాగాస్తున్నాయనీ గింజుకున్నాను. చోప్రా కెమెరాలకేసి చూశాక నోరుమూసేసుకున్నాడు.

పెదవులు కదిపితే యెటువంటి మాటలు దొర్లుతాయేమో నన్న భయంతో మేమిద్దరమూ కిముక్కుమనలేదు. గోడపైన టక్కుటిక్కుమంటున్న గడియారమూ, చల్లటిగాలుల్ని గదిలోకి విరజిమ్ముతున్న సెంట్రల్ యేసీ గొట్టాలూ, మా నిశ్శబ్దాన్ని మరింతగా పెంచసాగాయి. సెకండ్లు గంటలుగా, గంటలు యుగాలుగా మారి మమ్మల్ని యిబ్బంది పెడుతూండగా, గోడగడియారం మాత్రం సెక్యూరిటీ అధికారిలా నిష్పూచీగా నెమ్మదిగా కదలసాగింది.

తలుపులు శబ్దంచేస్తూ తెరుచుకోగానే, రూం సర్వీసు వెయిటరేమో ననుకుంటూ పక్కకు తిరిగి చూశాను. యిది వరకూ మమ్మల్నిక్కడ దిగవిడిచివెళ్ళిన సెక్యూరిటీ ఆఫీసరుతల గుమ్మంలోంచీ తొంగిచూస్తూ "గోయిన్‌సైడ్" అంటోంది. గదిలోపలికో వ్యక్తి రాగానే నేను వులిక్కిపడి దమ్మలాల్ చోప్రా కేసిచూశాను. అతను కళ్ళంతా తెరిచి సంభ్రమంగా చూస్తున్నాడు.

హాలీవుడ్ సుందరి మమ్మల్నెప్పుడూ చూడనిదానిలా ట్రాలీ సూట్‌కేసును లాక్కుంటూ లోపలికొచ్చింది. ఆవిడ వెనకనుంచీ సన్నగా పొడుగ్గా వున్న యువకుడొకడు ప్రత్యక్షమయ్యాడు. నూనూగు మీసాలతో దాదాపు ముప్పయ్యేళ్ళ వాడిలా కనబడుతున్నాడతను. జీన్సుపాంటుపైన ఆకుపచ్చరంగు చొక్కా తొడుక్కుని, దానిపైన నలుపురంగు వెదర్ కోటును వేలాడ తీసుకున్నాడు. అతగాడి కోలముఖంలో రిమ్‌లెస్ కళ్ళద్దాల కింద సూదంటు రాళ్ళ లాంటి కళ్ళు చురుగ్గా కదులుతున్నాయి.

"జెంటిల్‌మెన్... దీస్ టూ పీపుల్ ఆర్ ఆల్సో గెస్ట్స్ టూ నెదర్లాండ్...." అంటూ వాళ్ళను మాకు పరిచయం చేశాక "టు యెర్ ఆన్ ది సైడ్ ఆఫ్ సెక్యూరిటీ అగైన్..." అని నవ్వుతూ అటువైపు నుంచీ తలుపులు మూసేశాడు సెక్యూరిటీ ఆఫీసరు.

జీన్సు పాంటు యువకుడు ముఖం చిట్లించుకుంటూ వచ్చి మాకెదురుగావున్న సోఫాలో కూర్చున్నాడు. అతడి చేతిలోచిన్న లాప్‌టాప్ సంచయినా లేదు. హాలీవుడ్ యువతి పేపరునాప్‌కిన్‌తో ముఖం తుడుచుకుంటూవచ్చి, అవతలి సోపాలో మరో చివర్న కూచుంది. ఆవిడ చేతిలోని ముఖమల్ వానిటీబాగు పిల్లిపిల్లలా, ఆవిడ కాళ్ళ దగ్గరి ట్రాలీసూట్‌కేసు కుక్కపిల్లలావున్నాయి. యిప్పుడు మా సూట్‌మొత్తం ఆవిడ బాడీస్ప్రేతో గుభాలించిపోతోంది. గదిలో యింకెవరూ లేనట్టుగా ఆవిడ వెనక్కువాలి కళ్ళుమూసుకుంది. ఆ యువకుడు గదినంతా చూపులతోనే పరీక్షిస్తున్నాడు.

హాలీవుడ్‌సుందరి కళ్ళుతెరవగానే తానే కనబడాలనుకున్నట్టుగా దమ్మలాల్ చోప్రా తదేకంగా ఆమెనే చూస్తున్నాడు.

మరోసారి తలుపులు శబ్దం చేశాయి. లోపలున్న మేమంతా కంగారుగా తిరిగి చూశాము. గంగాళమంత పెద్ద ట్రే నెత్తుకున్న నీలిరంగు యూనిఫాం హెూటలు వెయిటరు లోపలి కొచ్చాడు. మమ్మల్నెవ్వరినీ పలకరించకుండా, ట్రేలోని తట్టలన్నీ తీసి టీపాయ్‌పైన సర్దాడు. సన్నగా, పొడుగ్గా, కొంగ మెడల్లాగున్న రెండు గ్లాసుల్ని వాటిపక్కన నిలబెట్టాడు. తరువాత ఖాళీ ట్రేనెత్తుకుని చక్కా బయటికెళ్ళిపోయాడు.

టీపాయ్‌పైన గిన్నెల చుట్టూ యేదో వెగటువాసన కమ్ముకుంటోంది. తట్టల మూతలన్నీ తెరిచి చూశాక దమ్మలాల్ చోప్రా పెద్దగానిట్టూర్చాడు.

యిక తినమన్నట్టుగా సైగ చేశాను.

దమ్మలాల్ చోప్రా దీనంగా పెదవులు విరిచి, వొద్దన్నట్టుగా తల అడ్డంగా వూపాడు. యింతసేపూ యీ తిండికోసం వెంపర్లాడిన యీ మనిషి యిప్పుడెందుకు తినడంలేదు?

దమ్మలాల్ చోప్రా యేడుపు ముఖం పెట్టుకుని గోడగడియారంకేసి చూపెట్టాడు. సమయం పన్నెండున్నరవుతోంది.

“ఆజ్ తారీఖ్ తీస్ పడా! ఆజ్ మై రొజా!” అన్నాడతను జీరబోతున్న గొంతుతో.

గంట పన్నెండు దాటుతూనే తేదీ మారకుండా వుంటుందా? తేదీ యిరవై తొమ్మిది నుంచీ ముప్పయికి మారగానే యివ్వాళ వుపవాసమనే సంగతి గుర్తుకొచ్చిందట యితడికి! ఆగష్టు 30 వ తేదీ వాళ్ళనాన్న తద్దినమట! గత ముప్పయి సంవత్సరాలుగా వుంటున్న వ్రతాన్ని యిప్పుడు వదులుకోడం మంచిది గాదట!

యీ చోప్రా యిదివరకూ రకరకాల మాంస పదార్థాల్ని చెడ తినేశాడు. అందువల్ల యితడెటు వంటి పరిస్థితిలోనూ బ్రాహ్మణుడయ్యే అవకాశంలేదు. మావైపు బ్రాహ్మణులు మాత్రమే తద్దినాలు, యేకాదశులూ అని వుపవాసాలుంటారు. వీళ్ళ రాజస్థాన్‌లో బ్రాహ్మణులు గూడా మాంసాహారాలు తింటారా? యేమో! నాకు తెలియదు.

"ముజ్‌కో చోడ్‌దే బాయ్! తుమ్‌కావ్!"– అన్నాడు చో(ప్రా. హాలీవుడ్ సుందరినే అతను చూస్తూండడంతో అతడు మాట్లాడుతున్నది గూడా ఆవిడతోనే లాగుంది. ఆవిడ కళ్ళుమూసుకునే వుంది.

"మే ఐ యీటిట్" – యీసారి మాటలు జీన్సు పాంటు యువకుడి దగ్గరి నుంచీ వచ్చాయి. అతను మా సమాధానం కోసం యెదురుచూడకుండా, వోగిన్నెను చేతికెత్తుకుని స్పూనుతో తినసాగాడు.

అతడు తింటున్న పదార్థం సేమియాల్లాగుంది. అందులో తెల్లటి చిన్నచిన్న ముక్కలు న్నాయి. ఆముక్కలు మాంసమో, చేపలో తెలియదు. అది చికెనో, ఫోర్కో, బీఫో అర్థంగావడంలేదు. అదే పదార్థమైతేనేమి? అతనంత ఆబగా తింటూంటే, నాలో అప్పటికే హద్దులు దాటిన ఆకలి మరింతగా విరుచుక పడసాగింది. గిన్నెల మూతలన్నీ తెరిచి చూశాక, తినగలనని అనిపించిన పదార్థాన్ని తీసుకుని తినసాగాను. అది చప్పగా, అదోలా వుంది. దానికి కొంత సాస్ కలుపుకున్నాను.

యింతలో హాలీవుడ్ సుందరి మెల్లగా కళ్ళు తెరిచింది. అందుకోసమే యెదురు చూస్తున్నట్టుగా "హలోమేడమ్! ప్లీజ్ హావిట్...ఐ ఆర్డర్డ్ దిస్.... ఫార్ యూ" అన్నాడు చో(ప్రా.

అబద్దాలు చెప్పడానికైనా వొక పద్దతుండాలి. యీ రూంసర్వీసుకు అతను ఆర్డరిచ్చే టప్పటికి, హాలీవుడ్ సుందరి యిలాయిక్కడి కొస్తుందనే విషయం ఆదేవుడికైనా తెలిసుండదు.

"ప్చ్... "ప్చ్...." అని పెదవులు చప్పరిచాక ఆవిడ మళ్ళీ కళ్ళుమూసుకుంది.

దమ్మలాల్ చో(ప్రా కడుపు పైన చేత్తోరాసుకుంటూ నాకేసిచూశాడు. నిన్న పొద్దు న్నుంచీ మేము వుపవాసమున్నట్టే లెక్క! యిప్పుడు తినకపోతేనే (ప్రమాదం. సందేహించకుండా తినమన్నానతడిని.

చో(ప్రా కావాలని "ప్చ్....ప్చ్" అని పెదవులు చప్పరించి, ఆవిడా, తానూ వొకే పార్టీ అన్నట్టుగా నవ్వాడు.

నేను తింటూనే సీసీకేమెరాలకేసి చూపెట్టాను. యిప్పుడితను తినకపోతే సెక్యూరిటీ వాళ్ళు అనుమానపడే అవకాశముందనీ, యీ వుపవాసాలూ (వ్రతాలూ తీ(వ్రవాదులే యెక్కువగా పాటిస్తారనీ చెప్పాలనుకున్నాను. అయితే ఆమాటల్ని గూడా సెక్యూరిటీ వాళ్ళు వినే (ప్రమాదముందని స్ఫురించడంతో నోరుమూసుకున్నాను.

"మైఫాదర్... వాజ్యే... వెరీగుడ్ పర్సన్..." హాలీవుడ్ సుందరి కోసమన్నట్టుగా దమ్మలాల్ చో(ప్రా యీసారి యింగ్లీషులోనే వివరించాడు. "బహుత్... వెరీ లవబుల్

మాన్...హీడైడ్ ఆన్ తర్టియత్ ఆగష్ట్.. వెన్ ఐవాజ్ వోన్లీ ఫైవ్‌యియర్స్.... సో మై ఫాస్టింగ్ ... అవుర్ అకార్డింగ్ టూది హిందూ కాలెండర్ యిట్ కమ్స్ ఆన్‌ది అనదర్ డేట్... సో ఐపాస్ట్ ఆన్‌ది బోత్ డేట్స్.. ఆగష్టు తర్టియత్..." హాలీవుడ్ సుందరి ధిగ్గున కళ్ళు తెరిచి "తర్టియత్...ఆగష్ట్ తర్టియత్..." అని గొణిగింది. తరువాత తన వానిటీ బాగ్ లోంచీ మొబైల్ ఫోనుతీసి రెండుమూడుసార్లునొక్కింది. తరువాత "యస్... ఆగష్ట్ తర్టియత్.." అనికంగారుపడింది. టీపాయ్ పైనున్న గిన్నెల మూతలన్నీ తెరచిచూశాక విసుగ్గా నిట్టూర్చింది. టీపాయ్‌పైన పడున్న మెనూతీసి, వణుకుతున్న చేతులతో పేజీలు తిప్పింది. రెండు మూడు నిముషాల తర్వాత, గదిలోని ఫోను తీసుకుని "రూం సర్వీస్...యెస్... ఐవాంట్ బీఫ్... యెనీతింగ్ బీఫ్... బీక్విక్... విత్ సమ్‌రైస్... యెస్...క్విక్" అని పెద్దగా అరిచింది. మరచిపోయిన విషయం జ్ఞాపకం వచ్చినట్టుగా "ఫార్ త్రీపీపుల్..." అని ముగించింది.

"త్రీ పీపుల్" అన్నాడు దమ్మలాల్ చోప్రా ఆవిడకు ప్రతిధ్వనిలా.

"దట్స్‌రైట్" అని ఆవిడ అదోలా యేడుస్తున్నట్టున్న నవ్వొకటి నవ్వింది.తర్వాత "ఐవిల్ హొూస్ట్యూ డిన్నర్..." అంది.

గదిలో నలుగురముంటే ముగ్గురికే డిన్నరార్డర్చిందేమిటి? తాను తినదా? లేకపోతే యిప్పటికే మూడు గిన్నెల్ని ఖాళీ చేసిన జీన్సుపాంటు యువకుడ్ని ఆమెలెక్కలోకి తీసుకోలేదా?

"నోనోనో...."దమ్మలాల్ చోప్రా బెదిరిపోతూ చేతులు అడ్డంగా తిప్పాడు. "టుడే... ఐయామ్ ఫాస్టింగ్ ...నో ఫుడ్...ఐడోంట్ టేక్ ఫుడ్...."

ఆవిడ అతని మాటలు వినదలచుకోనట్టుగా ముఖం అవతలికి తిప్పుకుంది. నేను తింటున్న ఆహారం చప్పగా, వెగటుగావుంది.

దమ్మలాల్ చోప్రా నాచెవిదగ్గరికి వంగి "సత్యనాశ్... సత్యనాశ్" అని హిందీలో గొణిగాడు. యిప్పుడు ఆవిడ "బీఫ్" తెప్పించుకుని తినబోతోందనీ, యీ అరాచకాన్ని తానెలా చూడగలననీ వాపోయాడు. యింతకంటే అనాచారం యెక్కడైనా వుందా అని బాధపడిపోసాగాడు.

యిందులో అనాచారమని విచారించవలసిన అవసరంలేదనీ, వొక ప్రాంతం వాళ్ళ ఆచారాలు యింకో ప్రాంతం వాళ్ళకు అనాచారాలుగా కనబడతాయనీ చోప్రాకు చెప్పడానికి ప్రయత్నించాను. అతెందుకు, మావైపున్న ముస్లింకుటుంబాలు, తమపెద్దలు చనిపోయిన తర్వాత దివసాల రోజుల్లో మాంసం వండి, బిర్యానీలు చేసి, విందులు

యేర్పాటు చేస్తారని చెప్పాను. అలాగే కొన్ని కొండ ప్రాంతాల వాళ్ళు, చనిపోయిన వ్యక్తులకు యిష్టమైన పదార్థాలను వండి సంతర్పణలు చేస్తారని చెప్పాను.

"మానాన్న తిధీ... సాంవత్సరీకమూ, యీవిడ గొడ్డుమాంసం తినడమూ... ఛ...ఛ...' అంటూ పెద్దదెబ్బతగిలినట్టుగా దమ్మలాల్ చోప్రా విలవిలలాడి పోయాడు.

బహుశా, యీ రోజున ఆవిడ భర్తదో, తండ్రిదో తిధి అయివుండవచ్చు. అందు కోసమని ఆవిడ ఆ చనిపోయిన వ్యక్తికి యిష్టమైన బీఫ్ విందును యిస్తోంది గావచ్చు. వొకే రోజున చోప్రా తండ్రి తిధీ, ఆవిడకు సంబంధించిన వ్యక్తి తిధీ రావడం గమనించినప్పుడు వాళ్ళిద్దరికీ మధ్య యేదో తెలియని అనుబంధముందని తెలిసిపో తోందని అన్నాను. చోప్రా నన్ను కోపంతో నమిలి మింగేసేలా వురిమి చూస్తూ పక్కకు జరిగాడు.

పెద్దట్రేతో బాటూ వెయిటరు గదిలోపలికొచ్చాడు. టీపాయ్‌పైన ఖాళీ అయిన గిన్నెలను తీసేసి, కొత్తవాటిని సర్దేశాడు.

"గెట్ మీ ది బిల్.." అంది హాలీవుడ్ సుందరి గొంతు నిశ్శబ్దాన్ని వొకదెబ్బతో పగలగొట్టినట్టుగా.

"యిట్ విల్ బీ పెయిడ్ బైది సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్" అన్నాడు వెయిటరు.

"నో నో..." ఆవిడ కోపంగా కసిరింది. "ఐవిల్ పే ఫార్ వాట్ ఐ ఆర్డర్డ్ ... గెట్ మీ దీ బిల్."

వెయిటర్ సరేనన్నట్టుగా తలవూపుకుంటూ వెళ్ళిపోయాడు. దమ్మలాల్ చోప్రా టీపాయ్ పైకొచ్చి చేరిన కొత్త గిన్నెలకేసి బయం బయంగా చూడసాగాడు.

హాలీవుడ్ సుందరి నవ్వడానికి ప్రయత్నిస్తూ" దిసీజ్ మైట్రీట్.. ప్లీజ్ హావిట్.." అంది.

దమ్మలాల్ చోప్రా రెండు చేతులూ ముందుకుచాపి పెద్దగా వూపుతూ "నో నో..." అని అరిచాడు.

ఆవిడ అతనికేసి విచిత్రంగా చూశాక, వో ప్లేటుతీసుకుని తినసాగింది. నేను చోప్రా పక్కకు జరిగి, ఆవిడతో యింగ్లీషులో, యీరోజు అతడి తండ్రి తిధి అని చెప్పాను. యీసారి చోప్రా యేడుపులాంటి నవ్వు నవ్వాడు. సోఫాలో అటు చివరకు జరిగికూర్చుని, ముఖాన్ని అవతలికి తిప్పుకున్నాడు.

జీన్సుపాంటు యువకుడు తదేక ధ్యానంతో తింటున్నాడు. నేను తింటున్న గిన్నెలోని ఆహారం సగం ఖాళీ అయ్యాక దాన్నక్కడపడేసి, టీపాయ్‌పైన మొదటిసారి వచ్చిన

గిన్నెలేవో వెతికి పట్టుకోడానికి ప్రయత్నించాను. యీవంటకాలనంతా మాకు తెలియని యేదో కొత్త నూనెతో తయారు చేసినట్టున్నారు. యీతిండి కడుపులోకెళ్ళిన తర్వాత అసౌకర్యంగా వుంది.

హాలీవుడ్ సుందరి యీసారి పేపర్ నాప్‌కిన్‌తో పెద్దయెముకను పట్టుకుని, దాని చుట్టూ వున్న మాంసాన్ని మునిపళ్ళతో లాక్కుని తింటోంది. జీన్సు పాంటు యువకుడు కట్‌లెట్‌లాంటి ముక్కను కత్తీ  ఫోర్కుల సహాయంతో తింటున్నాడు. నేనేం తినాలో తోచకపోవడంతో పైకిలేచి, అవతలిగదిలోకెళ్ళి, పరదా తీసి, అవతలికి చూడసాగాను. గేట్లదగ్గర ఆగిన విమానాలు కాళ్ళు విరిగిన యెద్దుల్లాగా, వాటి పక్కన తిరుగుతున్న ట్రక్కులు చెవులుకోసిన మేకల్లాగా, యూనిఫారాల వుద్యోగులు రెక్కలు విరిగిన కోడిపిల్లల్లాగా కనబడేసరికి విస్తుపోయి పరదాను మళ్లీ అడ్డంగా లాగేశాను.

అంతవరకూ అదే ధ్యాసతో తింటూన్న జీన్సు పాంటు యువకుడెందుకో దమ్మలాల్ చోప్రాకేసి సూటిగా చూస్తున్నాడు. చోప్రా పెద్ద గా వుచ్ఛ్వాస  నిశ్వాశాలు విడుస్తున్నాడు. అతడి యెద పెద్దగా యెగసెగసి పడుతోంది. యేసీతో గదంతా చల్లబడిపోయినా అతడి శరీరం చెమటతో తడిసిపోయివుంది. నేను హడావుడిగా అతడి దగ్గరకొచ్చి "బాయ్... బాయ్..." అనిపిలిచాను.

జీన్సుపాంటు యువకుడు పేపరునాప్‌కిన్‌తో చేయితుడుచుకుంటూ దమ్మలాల్ చోప్రా దగ్గరికొచ్చి, అతడి చేయిపట్టుకుని నాడిచూశాడు. తరువాత అతడి కనురెప్పల్ని బలవంతంగా పైకెత్తి కళ్ళను పరీక్షగా చూశాడు. "నాట్ వెల్... మేబీ లోబీపీ... హీహాజ్‌టూ యీట్ సంతింగ్ యిమ్మీడియట్లీ!" అన్నాడు. టీపాయ్ పైనున్న మిల్క్‌షేక్ గ్లాసు తీసుకుని, చోప్రా పెదవుల్ని బలవంతంగా విడదీసి, స్పూనుతో గ్లాసులోని ద్రవాన్ని, లోపలికి పోశాడు. దమ్మలాల్ చోప్రా గొంతుదగ్గరి ముడి నెమ్మదిగా కిందికి ఆడింది. కాస్తకాస్తగా గ్లాసులోని ద్రవాన్నంతా చోప్రా నోటిలోకి పోసేశాడతను.

"హీ హాజ్ నాట్ యీటన్ యెనీతింగ్ ఫార్‌ది లాస్ట్ ట్వంటీ అవర్స్" అన్నాను. అంతలో బుర్రగోక్కుని "యెక్సెప్ట్ యేస్మాల్ పాకెట్టాఫ్ పాప్ కార్న్" అని నన్ను నేను సరిదిద్దుకున్నాను.

జీన్సుపాంటు యువకుడు తనతోతాను మాట్లాడుకుంటున్నట్టుగా "పీపుల్ లైక్ హిమ్ షుడ్‌నాట్ ఫాస్ట్... ఐతింక్ హీయీజ్ యే డయాబెటిక్.."అని గొణిగాడు. తరువాత నాకేసి అదోలా చూసి "హీ మేబీ అల్‌రయిట్ నవ్.. ఆస్క్‌హిమ్ టూ యీట్ సంతింగ్ ఆఫ్టర్‌వర్డ్స్" అన్నాడు. మధుమేహాలూ, రక్తపోటులూ చోప్రా వ్రత దీక్షనేమీ చేయలేవని ఆయువకుడికి చెప్పాలనిపించింది. అయితే యీ సంగతులన్నీ గమనించినప్పుడు ఆ యువకుడు డాక్టరో, సైంటిస్టో అయివుంటాడన్న అనుమానం వచ్చింది. తీవ్రవాదయిన

శాస్త్రజ్ఞుడూ, అతీంద్రియ శక్తుల్నినమ్మే విద్యావంతుడూ.... ఆ జీన్సు పాంటు యువకుడూ, యీ దమ్మలాల్ చోప్రా యిద్దరికిద్దరేనని స్ఫురించి, మౌనంగా వుండిపోయాను.

మా సంగతులేవీ పట్టనట్టుగా హాలీవుడ్ సుందరి మరోమాంసం ముక్కను నములుతోంది. జీన్సుపాంటు యువకుడు ఆపినచోటే ఆరంభించినట్టుగా మరో గిన్నెను ఖాళీ చేస్తున్నాడు.

చోప్రాకు చెమటలు పట్టడం తగ్గింది. అతనిప్పుడు సవ్వడిరాకుండా నెమ్మదిగా గాలిపీలుస్తున్నాడు. అతడి ముఖంలోని చిడుముడిపాటు క్రమంగా తగ్గుతోంది.

"థ్యాంక్యూ..." అన్నాను

తల వంచుకుని తింటున్న జీన్సుపాంటు యువకుడికి నామాటలు వినిపించాయో లేదో తెలియలేదు.

"థ్యాంక్యూ మైడియర్ ఫ్రెండ్" అన్నానీసారి పెద్దగా

యింకా తలవంచుకునే వున్న అతను మెల్లగా నవ్వుతూ, సరేనన్నట్టుగా తలవూపినట్టు తోచింది.

చేతులు కడుక్కోవడం కోసం లేచి టాయ్‌లెట్‌కెళ్ళాను.

టాయిలెట్ అప్పుడే కాగితం విప్పిన కొత్తసోపులా మెరిసిపోతోంది. సింకు మల్లెపూల పొట్లంలా గుమగుమలాడుతోంది. కొళాయిలపైన పడిన దీపాలకాంతి చిట్లి నక్షత్రాలై మెరుస్తోంది. పొడవాటి స్నానాలతొట్టీ, దానిపైన కమ్మీకి రెండు తెల్లటి తువ్వాళ్ళూ, స్నానం చేయడానికి రమ్మని ఆహ్వానిస్తున్నాయి. కొళాయిని తిప్పగానే నీళ్ళు నురగలు గక్కుతూ బయటకొచ్చాయి. కొత్త సోపుతో చేతులు కడుక్కుని, టర్కిష్ టవలుతో తుడుచుకుంటూ బయటికొచ్చాను.

జీన్సుపాంటు యువకుడు తినడం ముగిసినట్టుంది. అవతలిగదిలోని పరదాను తొలగించి, విమానాశ్రయంలో ఆగిన విమానాలకేసి చూస్తున్నాడు. హాలీవుడ్ సుందరి అరిచేతిలోని అద్దంలోకి చూసుకుంటూ లిప్‌స్టిక్ దిద్దుకుంటోంది. దమ్మలాల్ చోప్రా ప్రశాంతంగా నిద్ర పోతున్నట్టున్నాడు. నేను సోఫాలో కొచ్చికూర్చున్నాను. నిశ్శబ్దాన్ని మా మౌనం విస్తరిస్తోంది. విమానాశ్రయాన్ని గమనిస్తూ ఆయువకుడూ, లిప్‌స్టిక్ రాసుకుంటూ యీ యువతీ యిలాగే యుగాంతం వరకూ వుండిపోతారేమోననిపించింది.

దడదడమంటూ మా గదితలుపులు తెరుచుకున్నాయి. సెక్యూరిటీ ఆఫీసరులోపలికి తొంగిచూసి" యెమిరిటస్ ఫ్లయిట్ నెంబర్ 687 బోర్డింగ్ బిగాన్..." అన్నాడు. ఆ

మాటకోసమే యెదురుచూస్తున్నట్టుగా, జీన్సుపాంటు యువకుడు చకచకాబయటికెళ్ళి పోయాడు. హాలీవుడ్‌సుందరి తన ముస్తాబులోంచీ తలపైకెత్తలేదు. సెక్యూరిటీ ఆఫీసరు ఆవిడకేసి వురిమిచూశాక తలుపులుమూసుకుని వెళ్ళిపోయాడు.

హాలీవుడ్ సుందరి చిన్న బంతి లాంటి సాధనంతో ముఖమంతా పౌడరు రాసుకుంది. తరువాత తాపీగా పైకిలేచి నిల్చుని, సోఫాలోపడుకున్న దమ్మలాల్ చోప్రాకేసి చూసి చిరునవ్వునవ్వింది. తరువాత నాకేసి తిరిగి "బై బై ... టేక్కేరాఫ్ యువర్ ఫ్రెండ్..." అంది. తన ట్రాలీసూట్‌కేసును లాక్కుంటూ నెమ్మదిగా, వయ్యారంగా, అడుగులో అడుగేసుకుంటూ గది తలుపులు తెరుచుకుని, బయటికెళ్ళిపోయింది.

తలుపు టపీమని మూసుకోగానే టక్కుమని లేచికూచున్నాడు దమ్మలాల్ చోప్రా. అయితే యింత సేపూ దొంగ నిద్ర పోతున్నాడన్నమాట! నేను కోపంగా చూశాను. అతనూ నాకోపాన్ని నాపైకే పరావర్తనం చేస్తున్నట్టుగా హుంకరించి "మేరా రోజా కైకో తోడ్ దియా?" అన్నాడు. అతడి గొంతింకా బలహీనంగానే వుంది.

యీ ఆమ్‌స్టర్‌డాంలో సమయం మా యిండియాకంటే నాలుగ్గంటలు ఆలస్యంగా నడుస్తుంది. యిక్కడ రాత్రి యెనిమిదయినప్పుడు మా ఢిల్లీలో రాత్రి పన్నెండు దాటుతుంది. అంటే ఢిల్లీలో ఆగష్టు 30వ తేది యిక్కడ రాత్రి యెనిమిదయినప్పుడే వచ్చేసివుంటుంది. సరిగ్గా అప్పుడే యీ దమ్మలాల్ చోప్రా పాప్‌కార్న్ మెక్కాడు. అంటే యితనెప్పుడో వుపవాసాన్ని భగ్నంచేసేసుకున్నాడనే గదా అర్థం! ఆమాటే చెబుతూ అతడ్ని వేళాకోళం చేశాను.

చోప్రా నన్ను మింగేసేలా చూస్తూ యెప్పుడు యేదేశంలో వుంటామో, ఆదేశపు సమయాన్నే పాటించాలనీ, నేను వితండవాదం చేస్తున్నాననీ మందలించాడు.

చోప్రా తండ్రి చనిపోయిందేమో భారతదేశంలో.... అది గూడా యెప్పుడో ముప్పయి నలభై సంవత్సరాలక్రితం... ఆవ్యక్తి సాంవత్సరీకం యిప్పుడు జరుగుతున్నది ఆమ్‌స్టర్ డాంలో... అదీ యిక్కడి కాలమానం ప్రకారం... స్థలమూ, కాలమూ, మనిషినింత కంటే యెక్కువగా అపహాస్యం చేసే సందర్భం యింకొకటెక్కడుంటుంది చెప్పండి!

"వుస్ చోక్రా బడా చలాకీ దిక్ తాహైనా! డాక్టర్ హోగా!" అని జీన్సుపాంటు యువకుడ్ని మెచ్చుకున్నాడు చోప్రా. తరువాత టెలిఫోను తీసుకుని, రూం సర్వీసు నెంబరునొక్కి "దోగ్లాస్.... వోకేవోకే.... టూ గ్లాసెస్ మిల్క్.... సైతో టూ గ్లాసెస్ ఫ్రెష్ జ్యూస్" అని ఆర్డరిచ్చాడు. తరువాత నాకేసి చూసి, సిగ్గు పడుతున్నట్టుగా నవ్వి "వుపవాస్ మే లిక్విడ్ పీనా మంజూర్ హై!" అంటూ తన వ్రత దీక్షకు కొత్త సవరణను చేర్చాడు.

"తిథీ అవుర్ బీఫ్ ఖానా.. కితనా బేవకూఫ్ కామ్.. యిస్‌కో పాప్ నహీ చోడతే!" అన్నాడతను కసిగా, అంతవరకూ మరచిపోయిన విషయం అప్పుడే జ్ఞాపకంవచ్చినట్టుగా.

బహుశా బీఫ్ ఆవిడ చనిపోయిన భర్తకు యిష్టమేమో! అందుకని ఆ పదార్థాలే ఆవిడ స్వంత డబ్బులతో తెప్పించిందేమో! యింతకూ ఆజీన్సుపాంటు యువకుడికీ, ఆమెకూ మధ్య సంబంధమేమైనా వుందా! ఆవిడ మొదటి భర్త చనిపోయాక మళ్ళీపెళ్ళి చేసుకుందేమో! ఆ యువకుడు ఆవిడ రెండో భర్తగావచ్చా! యేమో! వాళ్ళిద్దరూ మా ముందు మాట్లాడుకోకపోవడమూ, కావాలని వేర్వేరుగా గదిలోంచీ వెళ్ళడమూ - యిదంతా యేదయినా ప్రణాళిక ప్రకారం జరిగిన తంతేమో! ఆలోచించే కొద్దీ వాళ్ళిద్దరూ యెంతకూ అర్థంగాని ప్రపంచానికి ప్రతీకల్లా కనిపిస్తున్నారు. వాళ్ళ గురించిన సత్యమేది? నాకు అర్థమయిన సంగతుల్లో నిజమెంత? అబద్దమెంత?

దమ్మలాల్ చోప్రా పైకి లేచి టాయిలెట్ లోకెళ్ళి తలుపులు మూసుకున్నాడు. యెంత సేపయినా బయటకు రాలేదు. లోపల తనేమైనా స్పృహతప్పి పడిపోయాడేమో ననిపించి కంగారుపడిపోయాను. టాయిలెట్ తలుపులు విరిగేలా బాదాను. అతను తలుపులు వోరగా తీసి “డర్ నక్కో బాయ్! మై స్నాన్ కర్‌తాహూ!” అన్నాడు.

యూనిఫాం వెయిటరు మూడు గ్లాసులు తీసుకొచ్చి లోపలపెట్టి వెళ్ళాడు. స్నానం చేసి, మళ్ళీ అవేదుస్తులు తొడుక్కుని బయటికొచ్చిన దమ్మలాల్ చోప్రా “యిస్‌కో హమ్ బ్రహ్మముహూర్‌త్ కెహతే!” అన్నాడు.

అప్పుడు సమయం మూడున్నరవుతోంది. యీ తెల్లవారుజామును వాళ్ళు బ్రహ్మ ముహూర్తమంటారట! యీ సమయంలో యేపని ప్రారంభించినా అది దిగ్విజయంగా ముగుస్తుందట! కాస్సేపటి ముందు తాను స్పృహ తప్పిపడిపోయానని మేమందరమూ కేవలం భ్రమపడ్డామట! ఆ సుషుప్తి స్థితిలో అతనప్పుడు నేరుగా తన తండ్రి ఆత్మతో మాట్లాడాడట! యిప్పుడు శుభ్రంగా స్నానంచేసి, ధ్యానంలోకెళ్ళి, మళ్ళీ తన తండ్రి ఆత్మతో అవే ముచ్చట్లు కొనసాగించబోతున్నాడట! యీ విషయాలు చెబుతూ చెబుతూ చోప్రా మూడుగ్లాసుల తాజాపళ్ళరసాన్నీ తాగేశాడు. అతడి ధోరణి చూస్తే, యిప్పుడే యిక్కడ మటమేసుకుని కూర్చుని, దెయ్యాన్నీ భూతాన్నీ ఆవాహన చేయడంకోసం మోడెత్తేలాగున్నాడు. నేనోసారి సీసీ కెమరాలను చూపెట్టి, యిక్కడేమైనా వింత చేష్ట చేస్తే ఆపైన పదహారుకమ్ములే గతని పెద్దగామందలించాను. చోప్రా చిన్మయంగా నవ్వి, కాదలచిన కార్యం గంధర్వులే తీర్చినట్టుగా, యీ వూపిరాడని కొంపలోంచీ వెళ్ళిపోమని సీసీ కెమరాలే చెబుతున్నాయని అన్నాడు. పైకిలేచి, గది తలుపులు తెరుచుకుని, బయటికెళ్ళిపోయాడు.

గది దాటిపోతే తీవ్రపరిణామాలుంటాయని సెక్యూరిటీ ఆఫీసరు హెచ్చరించే వెళ్ళాడు. యిప్పుడీ దుడుకు మనిషి అన్నంత పనీ చేస్తున్నాడు. అలా యెక్కడికెళ్ళి యేగొడవ చేస్తాడో! నేను గదితలుపులు తెరిచే కార్డుతీసి జేబులో పెట్టుకుని, బయటి

కొచ్చాను. అప్పటికే చోప్రా అవతలున్న మెట్లెక్కుతున్నాడు. నేను గదితలుపులు వేసేసి గబగబా అతడి వెనకే పరిగెత్తాను.

ఆ హొటల్లో యేడు అంతస్థులే వున్నట్టున్నాయి. పైకివెళ్ళగానే ఖాళీ డాబా వచ్చింది. దూరంగా విశాలమైన చుక్కల ఆకాశం కింద, దమ్మలాల్ చోప్రా పలచటి నీడలా కదలాడుతున్నాడు. నేనంతదూరంలోవుండగానే "అబ్ పూరాలోక్ జమాహువాహై!" అన్నాడతను వుద్వేగంగా. పాంచ భౌతికమైన అతడి శరీరంతోయిప్పుడు పంచభూతాలు అనుసంధానమవుతున్నాయట! యిప్పుడు బయటి ప్రపంచానికీ, తనలోని చేతనకూ మధ్య అడ్డుగోడ లేవీ లేవట! యిప్పుడే, యీ ఆమ్‌స్టర్‌డాం ఆకాశం కింద, గొప్ప అద్భుతం తయారుగాబోతోందట! యీ అద్భుతాన్ని చూసే అరుదైన అవకాశం నాకొక్కడికే దక్కుతోందట! లేకుంటే నేననేవాడు అలా అక్కడికి రాగలిగే వుండేవాణ్ణిగాదట!

దూరంగా దీపాలు వెలుగుతున్న విమానాశ్రయమూ, పైన మినుకుమినుకు మంటున్న నక్షత్రాల ఆకాశమూ, రకరకాల చీకటి ఛాయల డాబా, వున్మాదమో వుద్రేకమో వుత్తేజమో తెలియని స్థితిలో దమ్మలాల్ చోప్రా మాటలూ.... నాబుర్ర మొద్దుబారినట్ట పోయింది.

యేం జరగబోతోందిక్కడ?

# 10

ఆకాశంలోంచీ సగంచుక్కలు నేలపైకి రాలి పడినట్టుగా దూరంగా ఆమ్‌స్టర్‌డాం నగరం వెలుగుతోంది. నగరంలోంచీ దారితప్పి తిరుగుతున్న చుక్కల్లా విమానాశ్రయాని కవతలున్న రోడ్డుపైన వాహనాలు తిరుగుతున్నాయి. దీపాలు తగిలించుకుని పైకెగురుతున్న విమానాలు చుక్కల్లో కలిసిపోతూండగా, దిగివస్తున్న విమానాలు రాలిపడుతున్న చుక్కల్లా గున్నాయి.

హొటలు డాబాపైన నేనూ, దమ్మలాల్ చోప్రా చీకటి నీడల్లా నిలబడివున్నాము. మమ్మల్నీ స్థితిలో చూస్తే యెవరైనా తీవ్రవాదులనే అనుకుంటారు. మెక్సికోకు వెళ్ళడానికి నాకో తోడుకావాలని నేనెందుకనుకోవాలి? యీ దమ్మలాల్ చోప్రా లాంటి నూటికో కోటికో వొకడైన వ్యక్తే నా సహ ప్రయాణికుడెందుకవ్వాలి? యిన్ని విమానాలు తిరుగు తూనే వుండగా మాకు మాత్రం వెంటనే యిక్కడి నుంచీ విమానమెందుకు దొరకలేదు? లౌంజ్‌లో బుద్ధిగా కూచున్న మాపైన యీ సెక్యూరిటీ వాళ్ళకెందుకు అనుమా నమొ చ్చింది? వాళ్ళుండమన్న హొటలు గదిలో హాయిగా పడుకుని నిద్రపోకుండా దమ్మలాల్ చోప్రా నన్నిక్కడికెందుకు లాక్కొచ్చాడు? నేనయినా గదిలో వుండకుండా యెందుకిలా పిచ్చివాడిలా యీడాబాపై కొచ్చాను? కథలన్నీ కంచికే తిరిగొచ్చినట్టుగా నా ఆలోచనలన్నీ తిరిగితిరిగీ 'అద్భుతం' దగ్గరికే తిరిగొస్తున్నాయి.

నా ఆలోచనలతో సంబంధంలేదన్నట్టుగా దమ్మలాల్ చోప్రా, డాబాపైన పద్మాసన మేసుకుని కూర్చున్నాడు. అతను కళ్ళు మూసుకున్నాడో లేదో తెలియడంలేదు. అతడి శరీరంలో యేమాత్రం కదలికాలేదు.

డాబాపైన చలిగాలి వాయించిపారేస్తోంది. యీ చలికి వొళ్ళు బిగుసుకుపోయి, వూపిరాడకుండా పోతుందేమోనని భయంగా వుంది. రాత్రి తిన్న వెర్రితిండి కడుపునిండా వున్నట్టుంది. అంతటి చలిలోనూ నిద్ర ముంచుకొస్తోంది. నేనూ డాబాపైన కూచుని, బలవంతంగా కళ్ళు తెరుచుకుని, దమ్మలాల్ చోప్రానే చూడసాగాను.

గదిలో మేము లేమని సీసీ కెమరాలు చెప్పే వుంటాయి. సెక్యూరిటీ ఆఫీసర్లు మాకోసం వెతుకుతూనే వుంటారు. యిక్కడికొచ్చి యేం చేస్తున్నారని అడిగితే వాళ్ళకేమని సమాధానం చెప్పాలి?

నాకు మావూళ్ళోని నా భార్యా పిల్లలూ, నా తల్లిదండ్రులూ, స్నేహితులూ, పదేపదే గుర్తుకొస్తున్నారు. మావూర్లోయిప్పుడు అర్ధరాత్రయివుంటుంది. మా వాళ్ళందరూ హాయిగా నిద్రపోతూవుంటారు. నాకేమో యిక్కడ యిలా జాగరణ చేయాలని రాసిపెట్టివుంది. యీ వొంటరి ఆకాశం కింద నన్ను వొంటరితనం కమ్మేస్తోంది. యీ ప్రపంచమంతా శూన్యమైపోయి, నేనొక్కడే మిగిలిపోయినట్టు భ్రమకలగసాగింది. నాతో బాటూ యీ చీకటి యెడారిలో ప్రయాణంచేస్తున్న మరోవ్యక్తి యిక్కడే యెక్కడో చీకటిలో కూరుకుపోయినట్టూ, నేనతడి కోసం పిచ్చిపట్టినవాడిలా వెతుకుతున్నట్టూ అనిపించింది. యింతకూ నేను మేలుకునేవున్నానో, లేకపోతే నిద్రపోయి కలగంటున్నానో తెలియలేదు. వులికులికిపడుతూ, నిద్రలోకి జారిపోకుండా వుండడం కోసం వొకటి నుంచీ వెయ్యి వరకూ సంఖ్యలు లెక్కబెట్టసాగాను.

"చోప్రా! పైకిలే! లేచిరా! మనంకిందికెళ్ళాలి! యెవరైనా చూస్తే ప్రమాదం!" అని పెద్దగా అరిచాను. నాకెవరూ బదులుపలకలేదు. మరోసారి హిందీలోనూ, యింకోసారి యింగ్లీషులోనూ కేకలేశాను. చోప్రా చీకటి కుప్పలా కనబడుతున్నాడు.

పైన ఆకాశంలో నలుపురంగులోంచీ నీలిరంగు పలచగా పైకుబుకుతోంది. క్రమంగానీలిరంగు పరచుకుంటోంది. దానిలోంచీ అనేక రంగులు పుడుతున్నట్టుగా వున్నాయి. అక్కడేదో రంగులమేళా జరుగుతున్నట్టుంది. దూరంగా దిగంతాల దగ్గర భూమ్యాకాశాల్ని వేరుచేసే రేఖ వొకటి సనసన్నగా మొదలై చివరకు గాఢంగా నిలబడింది. కాస్సేపటి తర్వాత దానిపైన యెర్రటి బిందువొకటి పుట్టింది. మెలమెల్లగా అది పెద్దదయ్యింది. యెర్రటి సూర్యుడక్కడ చిన్న కనురెప్పలా తొంగి చూశాడు. చూస్తూండగానే ఆ సూర్యుడు బింబమై పైకి లేచాడు.

యెర్రటి లేతకాంతి లోకాన్నంతా ఆవరించింది. దూరంగా వూరూ, ఆతర్వాత విమానాశ్రయమూ, చీకటి దుప్పట్లు తీసేసి వెలుతురులోకి వస్తున్నాయి. విమానా శ్రయంలోని గడ్డిమైదానాలు జేవురు రంగుతో సిగ్గుపడుతున్నాయి.

సుదూరంలో చిన్న మూలుగులాంటి శబ్దం వినపడింది. నెమ్మదినెమ్మదిగా అదిపెరగ సాగింది. అది దమ్మలాల్ చోప్రా దగ్గరినుంచే వస్తోంది. నేను చెవులు రిక్కించాను. అతడేదో మాట్లాడుతున్నట్టున్నాడు.

"తుమ్ సత్యహెూ! ధర్మ్‌హెూ! చిత్‌హెూ... ఆనంద్‌హెూ!..."

అతనెవరితో మాట్లాడుతున్నాడో తెలియదు. "మేరా జీవన్ ధన్య హెూగయా! ముజ్‌కో రస్తా దిఖలాయా!" అంటున్నాడతను.

నేను విసుగ్గా, తలవిదిలించుకుంటూ లేచి నిల్చున్నాను. యిక పర్వాలేదు. యిప్పు డెవరైనా సెక్యూరిటీ వాళ్ళువచ్చి అడిగితే, మేము వుదయపు వ్యాయామాలు చేస్తున్నా మనీ, సూర్యనమస్కారాలు చేసుకుంటున్నామనీ చెప్పొచ్చు. ప్రమాదంలో యేకొంత తగ్గినా మేలే!

"వుదర్ అంధకార్.... యిదర్ జ్వాలా...." చోప్రా యింకా తన సంధిప్రేలాపన కొనసాగిస్తున్నాడు.

అప్పుడు తనకళ్ళు కనబడలేదట! యిప్పుడు వెలుతురొచ్చి పడిపోయిందట.... నిన్నటివరకూ అడవి, యిప్పుడేమో రహదారి... అప్పుడు ముళ్ళూ రాళ్ళూ.... యిప్పు డేమో పూలూ పళ్ళూ..... – యిలాగే సాగిపోతోంది అతడి ప్రేలాపన.

లేత వెలుతురులో దమ్మలాల్ చోప్రా కంచు విగ్రహంలా కనబడుతున్నాడు. అతడి చూపులు సూర్యుడి కవతలి ఆకాశంలో చిక్కుబడిపోయినట్టున్నాయి.

"హూ! హూ! వోం..... వోం...." దమ్మలాల్ చోప్రా దగ్గరినుంచీ యిప్పుడు మాటలకు బదులుగా చిత్రమైన శబ్దాలు వెలువడుతున్నాయి. కొంపదీసి మళ్ళీ లోబీపీ రాలేదు గదా! యిప్పటికిప్పుడు యితనిక్కడ యీడిగిల బడితే ఆపైన నాగతి అధోగతే! యెవరో తరుముతున్నట్టుగా ముందుకు పరిగెత్తాను. "చోప్రా! చోప్రా! యేమయ్యిందినీకు? కళ్ళుతెరు!"" అని గొంతుచించుకున్నాను.

అతడి యెద పెద్దగా యెగసిపడుతోంది. పెద్దగా శబ్దమొచ్చేలా గాలిపీలుస్తున్నాడు.

"కిందికెళ్దాంపద!" అంటూ అతడి శరీరాన్ని రెండు చేతులతోనూ పైకెత్తడానికి ప్రయత్నించాను. యెంతబరువున్నాడితను! శక్తినంతా చేతుల్లోకి తెచ్చుకుని అతడ్ని పైకిలేపాను. అతనలాగే కిందికి వాలిపోయాడు.

గబగబా మెట్లదగ్గరికి పరిగెత్తి "హెల్ప్! హెల్ప్!" అని అరిచాను. యూనిఫారం వెయిటరొకడు పైకొచ్చాడు.

"వుదయం సూర్యనమస్కారాలు చేసుకోడం కోసం పైకొచ్చాము. నాస్నేహితుడికి స్పృహతప్పింది" అన్నాను ఆదుర్దాగా.

అతను నాకేసి అయోమయంగా చూశాడు. అప్పటివరకూ తెలుగులో మాట్లాడానని స్ఫురించింది. వెంటనే అదే విషయాన్ని యింగ్లీషులో చెప్పాను. అతను తలవూపుతూ వచ్చి చోప్రా శరీరాన్నటువైపున యెత్తిపట్టుకున్నాడు. యిద్దరమూ కలిసి కష్టపడుతూ అతణ్ణి మెట్ల మీదుగా కిందికి తీసుకొచ్చాము. కార్డుతో నేను గది తలుపులు తెరిచాను. చోప్రా శరీరాన్ని పడకపైకి చేర్చాక వెయిటరు వెళ్ళిపోయాడు.

చోప్రా పెద్దగా గుర్రుపెట్టసాగాడు. అతడిదివరకటిలా పెద్దగా గాలిని పీల్చడంలేదు. అతడి ముఖం ప్రశాంతంగావుంది. నిద్రపోయిలేచాడంటే సరిపోతుందనిపించింది. రూం సర్వీసుకు ఫోనుచేసి రెండుమూడు రకాల పళ్ళరసాలు తెమ్మన్నాను.

నాకు వొళ్ళంతా తిమ్మరెక్కి నట్టుంది. టాయిలెట్‌కెళ్ళి కాలకృత్యాలు ముగించాను. వేడినీళ్ళు చూసేసరికి ప్రాణం లేచివచ్చింది. నేను స్నానం ముగించి బయటపడే సరికి చోప్రా పళ్ళరసం తాగుతూ కనిపించాడు.

నేనుగా అతడినెందుకు పలకరించాలని, నేను మౌనంగా వోగ్లాసు పళ్ళరసంతాగుతూ కూచున్నాను....

రెండోగ్లాసు కూడా ఖాళీచేశాక, వొళ్ళు విరుచుకుంటూ, భలేనిద్ర పట్టిందనీ, వొళ్ళే తెలియలేదనీ అన్నాడు చోప్రా.

నేనుపైకిలేచి "యిప్పుడుగంట యెనిమిది. ఫ్లయిటు పదిన్నరకు... మనంగేటు దగ్గరికెళ్ళాలి.... యిప్పుడో యింకాస్సేపటికో బోర్డింగు ప్రారంభిస్తారు" అన్నాను.

అతను పైకిలేచి, తనట్రాలీ సూట్‌కేసును పట్టుకుని "మై రెడీ.." అన్నాడు.

గదిని మూసేసి, లిఫ్టుమీదుగా కిందికొచ్చాము. గదికార్డును రిసెప్షను ముందున్న ముసలి అమ్మాయి ముందు పడేశాను. ఆవిడేమైనా సెక్యూరిటీవాళ్ళకు ఫోనుజేస్తుందేమో! లేకపోతే తిరిగి గదికి వెళ్ళమని కేకలేస్తుందేమో! ఆవిడకేసి జాలిగా చూశాను. ఆవిడ తలపైకెత్తకుండా... "వోకే...గుడ్ బై... బాన్‌వాయేజ్...సీయూ" అంది. ఆ వొక్క సమాధానం కోసమే యెదురుచూస్తున్నట్టుగా నేను హొటల్లోంచీ యివతలికి వురికాను. దమ్మలాల్ చోప్రా ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ, నెమ్మదిగా బయటికొచ్చాడు.

"గేటునెంబరు 14" అనుకుంటూ దారిని చూపెట్టే బోర్డులకోసం తిరిగి చూశాను...

“ఆమ్‌స్టర్‌డాం... అద్భుత్...కౌన్‌రోకేగా” అన్నాడు చోప్రా

నేను వులిక్కి పడ్డాను. దమ్మలాల్ చోప్రా చూపులు దూరంగా ఆకాశంలోకి పాకుతున్నాయి.

“ఆమ్‌స్టర్‌డాం మే అద్భుత్...” అంటూ మళ్ళీ అవే మాటలు పేలుస్తున్నాడు చోప్రా.

నేను కార్చిచ్చునుంచీ పారిపోయే వాడిలా “యిదే దారి... త్వరగా వెళ్దాం రా! యిప్పటికే ఆలస్యమై పోయింది” అంటూ ముందుకు పరిగెత్తాను.

# 11

మా కెయెల్‌యెమ్ విమానానికి బోర్డింగు ప్రారంభించేవరకూ నేను దమ్మలాల్ చోప్రాకు దూరంగా కూర్చున్నాను.

తీరా బోర్డింగుక్యూలో నిల్చున్నాక వోసారి తలగుండ్రంగా తిప్పి, విమానాశ్రయాన్నంతా కళ్ళార్పకుండా చూసి “ఆమ్‌స్టర్‌డాం విమానాశ్రయంలో యిరవై గంటలు” అనుకున్నాను. కానీ యిక్కడికి యెప్పుడో పూర్వజన్మలో వచ్చినట్టుంది. పురాణాల్లో గంగలో మునిగిన నారదుడికి వో జన్మకు సరిపోయేంత కల వచ్చిందని చెబుతారు. అలాగుంది నా పరిస్థితి. నేను నా వెనక నిల్చున్న దమ్మలాల్ చోప్రాకేసి చూడనైనా చూడ్డంలేదు.

బోర్డింగు పాస్ తీసుకుని, సెక్యూరిటీ చెక్‌లూ, లగేజీ స్కానింగ్‌లూ దాటుకుని, విమానంలో కెళ్ళేసరికి వొక యుగం గడచినట్టుంది. యెయిర్ హెూస్టెస్ “M వన్ అండ్ టూ” అంటూ దారి చూపెట్టింది. నేను కుర్చీలో సర్దుకుని కూచున్న కాసేపటి తర్వాత వచ్చిన దమ్మలాల్ చోప్రా “మేరీ షూబీ నికాల్‌నా పడా! వుస్ కోబీ స్కానింగ్ కర్‌దియా?” అన్నాడు నవ్వుతూ. తన బూట్లు విప్పించి, వాటిని స్కానింగ్ మిషన్లో పరీక్షించడం ద్వారా తనకు అదనపు సన్మానమేదో జరిగిందనుకుంటున్నాడతను. ఆ సన్మానం నాకూ జరిగిందన్న సంగతినయినా అతను గమనించినట్టేలేదు. యింతకూ అప్పుడితను యే పరధ్యానంలో వున్నాడో?

కిటికీలోంచీ ఆమ్‌స్టర్‌డాం విమానాశ్రయమంతా బోసిపోయినట్టుగా కనబడుతోంది. హాలీవుడ్ సుందరితో బాటూ జీన్సుపాంటు యువకుడు గూడా యెమిరిటస్ విమానంలో వెళ్ళిపోయారేమో! యీ వూర్లోనే యెక్కడో చైతన్య, అతడి స్నేహితులూ ఐటీ కాందిశీకుల్లా జీవిస్తూ వుంటారు. అతడి వాలెట్ దొరికిందో లేదో! ‘అంతములేని యీ భువనమంత పురాతన పాంథశాల’ అన్నాడో కవి. కాదు కాదు, యీ లోక మొక సత్రం కానే కాదు. యిదొక ప్రయాణం. నిలుపూనిదానంలేని నిరంతర ప్రయాణం.

విమానంలోని టీవీ, సెక్యూరిటీ బెల్టునెలా వాడాలో నాలుగోసారి చూపెడుతోంది. సీట్లలో సర్దుకుని కూచున్న ప్రయాణీకులు విమానం కదలడంకోసం కాచుక్కూచున్నారు.

నా సీటు వెనక కూచున్న అరవాయిన యీ విమానం యెందుకిలా టేకాఫ్ కాకుండా ఆలస్యం చేస్తోందని విసుక్కుంటున్నాడు. ఢిల్లీకెళ్తున్న విమానమని తెలిసేటట్టుగా భారతీయ భాషలన్నీ విమానంలో ముచ్చట్లాడుతున్నాయి. మెరుస్తున్న కళ్ళతో విమానాశ్రయాన్నే చూస్తున్న దమ్మలాల్ చోప్రాకు మా ప్రయాణం ఆలస్యమైపోతోందన్న స్పృహే వున్నట్టులేదు.

నీలిదుస్తుల యెయిర్‌హోస్టెస్ రెండోసారి కూల్‌డ్రింక్సు పంచుతూ వస్తోంది. మా ముందుసీటు దగ్గరికొచ్చాక ఆగి, పక్కన కూచున్న కుర్రాడితో నవ్వుతూ మాట్లాడుతోంది. తరువాత కిచిన్‌లోకెళ్ళి చిన్న పాకెట్టేదో తీసుకొచ్చి వాడికిచ్చింది. యూనిఫాంతో పైలట్‌లాకనబడుతున్న వ్యక్తి వచ్చి, ఆ కుర్రాడి బోర్డింగుపాసు తీసుకుని చూశాడు. తరువాత వాడి భుజంపైన చేయివేసి,నవ్వుతూ మాట్లాడుతూ, ద్వారం దగ్గరికి తీసుకెళ్ళాడు.

మా విమానం బయట కారేజీలు తగిలించుకున్న బండరోకళ్ల లాంటి ట్రక్కులూ, వొళ్ళంతా యినపరజను అతికించుకున్న అయస్కాంతాల్లా మనుషులనెక్కించుకున్న జీపులూ యెటుపడితే అటు తిరుగుతున్నాయి. విమానాశ్రయంలోపల ప్రయాణికులు తిరగడం గూడా స్పష్టంగానే కనబడుతోంది. దూరంగా రన్‌వేపైన విమానాలు టేకాఫ్ అవుతూనే వున్నాయి. మావిమానం మాత్రం యెందుకో మొరాయించినట్టుగా కదలడం లేదు. జరుగుతున్న ఆలస్యాన్ని పట్టించుకోకుండా, నిర్వికారంగా కూచున్న వ్యక్తి దమ్మలాల్ చోప్రా వొక్కడే!

కుర్చీల మధ్యనున్న దారిలో ట్రాలీని తోసుకుంటూ వచ్చిన యిద్దరు యెయిర్ హోస్టులు ట్రేలతో పలహారాన్ని ప్రయాణికుల కందివ్వసాగారు. ప్రయాణికుల ధ్యాస పలహారంపైన కంటే ఆలస్యానికి కారణమేమిటో తెలుసుకోవడంపైనే యెక్కువగావుంది. వాళ్ళు పదేపదే అడుగుతన్న వొకే వొక ప్రశ్నకు యెయిర్ హోస్టులు “వుయార్ అబవుట్టూ టేకాఫ్” అని చెప్పిన సమాధానాన్నే మళ్ళీమళ్ళీ చెబుతున్నారు.

నాకు యెడమవైపున కూచున్న ముసలాయిన తన భార్యతో “మేబీ యే టెక్నికల్ హెజార్డ్..” అని జీరబోయిన గొంతుకతో సముదాయిస్తున్నాడు.

‘అంతే అయివుంటుంది’ అనుకున్నాను. ఆ ఆదుర్దాలో ఆమాటే పైకే అన్నట్టున్నాను. దమ్మలాల్ చోప్రా దగ్గరినుంచీ “క్యాహై?” అన్న మాట వినవచ్చింది. చాలాసేపటి తర్వాత అతడి దగ్గరి నుంచీ మాట వినరావడంతో, వులిక్కిపడి, అంతలో సర్దుకుని, యేదో సాంకేతిక యిబ్బందివల్ల విమానప్రయాణం ఆలస్యమవుతోందని అతడి కర్థమయ్యే హిందీలో వివరించాను.

"యే సబ్ బక్వాస్ హై! అబ్ యే వుడాన్ వుడ్‌తేనహీ!" అన్నాడతను అరటి చెట్టును పదునైన కత్తితో కోసినంత కరకుగా!

నేను వులిక్కి పడ్డాను. యిదేమిటి యిలా గంటున్నాడితను? యీ విమానం యెగరక పోవడానికీ, యీ వ్యక్తికీ సంబంధమేముంది? యితడేం చెబుతున్నాడు?

దమ్మలాల్ చోప్రా కిటికీ లోంచీ చూడమన్నట్టుగా సైగచేశాడు. మధ్యాహ్నం పన్నెండుగంటల యెండలో యేటవాలుగా తుంపరపడుతోంది. దూరంగా ఆకాశం దగ్గర యేడురంగుల యింద్ర ధనస్సు విరిసింది.

దమ్మాలాల్ చోప్రా తనకుర్చీలో పద్మాసనమేసుకుని కూర్చున్నాడు. చేతులు రెండూ ముందుకుచాచి, అరిచేతులొక దానిపైన వొకటి పెట్టుకున్నాడు. అతడి కళ్ళు సగం దాకా మూసుకుపోయాయి.

"అబ్ ముజ్‌కో బతానా పడా! అవుర్ తుమ్ సునానా హెూగా! యెహీ హై హమారా కామ్... యేకామ్ హెూనేతక్ హమ్‌నే యిస్ ఆమ్‌స్టర్‌డాం చోడ్‌తే నహీ!...." అంటూ మంద్రంగా నాకు స్పష్టంగా వినబడేలా చెప్పుకుపోసాగాడు దమ్మలాల్ చోప్రా.

రాత్రంతా దాదాపుగా నిద్ర లేకపోవడంతో విమానంలో కెక్కుతూనే నాకు ఆవులింతలు మొదలయ్యాయి. అయితే విమానం ఆలస్యమెందుకవుతోందనే ఆందోళనలో ఆనిద్ర అప్పుడే యెగిరిపోయింది. యిప్పుడు దమ్మలాల్ చోప్రా మాటలు వింటూంటే యికపైన యీజన్మలో నాకు నిద్రపోయే అవకాశం కలిగేటట్టులేదు.

యీ విషయాలన్నీ భారతదేశం వెళ్ళాక, తీరికగా యెప్పుడైనా చెప్పాలనుకున్నాడట! అయితే యీ విషయం తాను నాకు చెప్పేవరకూ మా విమానాన్ని కదలనివ్వకుండా ఆమ్‌స్టర్‌డాం నేల గట్టిగా పట్టుకునేసిందట! యిప్పుడు తానిక చెప్పక తప్పదట! అలాగే నాకూ వినకతప్పదట! యిదివరకూ మాట్లాడిన హిందీకి భిన్నమైన కొత్త హిందీలో అతను చెప్పుకుపోసాగాడు. నావెనక కుర్చీల్లో వున్న వాళ్ళకుగానీ, నా పక్కన కూర్చున్న వాళ్ళకుగానీ వినబడకుండా, నాకు మాత్రం స్పష్టంగా వినబడేలా అతడెలా మాట్లాడు తున్నాడో నాకర్థంగాలేదు. అతడు మొదలుపెట్టిన కాస్సేపటికే నాకు, అతనుతప్ప మిగిలిన ప్రపంచమంతా మాయమైపోయినట్టు భ్రమకలిగింది. నాముందు బోధిస్తూ అతను, అతడి ముందు వింటూ నేనూ... మేమిద్దరమే యీలోకంలో మిగిలినట్టు అనిపించింది.

దమ్మలాల్ చోప్రా మాటల్ని యధాతథంగా తెలుగులోకి అనువదించి చెప్పే శక్తి నాకులేదు. నా శక్తియుక్తులు సహకరించినంతలో నాకు అర్థమయిన సంగతలుయివి: "యివ్వాళ వుదయం ఆమ్‌స్టర్‌డాం ఆకాశం కిందికి చేరినప్పుడు నాతో మాట్లాడింది నాతండ్రి ఆత్మగాదు. అది మొత్తం లోకానికీ, సర్వసృష్టికీ తల్లీ తండ్రయిన ఆత్మది....

ఆశక్తి నన్ను అనునయంగా తన వొడిలోకి తీసుకుని, పాలుతాగించే తల్లిలాగా, యీ మాటల్ని నాకు వినిపించింది. ఆ శక్తి యిలా చెప్పింది – నేను ఆది, మధ్యా, అంతమూ, అన్నీ! నన్ను చాలా మంది చాలా పేర్లతో పిలిచారు. నన్ను రకరకాలవాళ్ళు రకరకాలుగా నిర్వచించారు. కానీ యెవరూ నన్ను సమగ్రంగా అర్థంచేసుకోలేకపోయారు. ఆసంగతి తెలిసి వచ్చిన తర్వాత గూడా నన్ను తెలుసుకోవాలనీ, అర్థంచేసుకోవాలనీ ప్రయత్నాలు చేస్తూనే వున్నారు. యిదంతా వాళ్ళ మూర్ఖత్వం. అయినా నన్ను అర్థం చేసుకుంటే మాత్రం, తెలుసుకుంటే మాత్రం వాళ్ళకు వొరిగేదేముంది? యేమీలేదు. యేమీవుండదు. అందువల్ల అర్థంగాని వాటిని వదలి పెట్టి అవసరమైన వాటిని అర్థం చేసుకోండి. మీ కోసం భౌతిక, పారభౌతిక అంశాలలో యెంత అవసరమో అంతే తీసుకుని కొత్త మందు తయారు చేస్తున్నాను. యిప్పుడు మిమ్మల్ని పీడిస్తున్న అన్ని జబ్బులకూ యిది వొకేవొక మందు. యిది దివ్యౌషధం. అందరు మనుషులూ – అన్ని రంగులవాళ్ళూ, అన్ని ప్రాంతాల వాళ్ళూ, అన్ని మతాలవాళ్ళూ – పుట్టకముందు వొకే పరిస్థితిలో వుండేవాళ్ళు. మరణించాక వొకేస్థితిని చేరుకుంటారు. పుట్టకముందు, మరణించిన తర్వాత యేమి జరిగిందో, జరుగుతుందో మీరు తెలుసుకోలేరు.

నన్ను తెలుసుకోడానికీ, నన్ను అర్థం చేసుకోడానికీ వున్న వొకేవొక మార్గం – సుఖంగా బతకడాన్ని యెన్నుకోవడమే! బతకడమంటే నేనూ మీరూ ఆడుకునే ఆట.... అదొకహేళ! అదొక పండుగ!

అందుకే ఆనందంగా ఆడుకోండి. విలాసంగా వినోదించండి. మరో వ్యక్తికి యిబ్బందికలిగించకుండా, మీరెంత సుఖాన్ని తాగుతారో అంతా తాగండి. నిన్నను మరవకండి. రేపును గుర్తుపెట్టుకోండి. నేటిని మీకవసరమైన రీతిలో మలచుకోండి. మీరందరూ నాకు సమానులే! బలహీనులకు బలమిచ్చేదే బలం. నిస్సహాయులకు సహాయం చేయడమే సహాయం... మరింత మనుషులుగా యెదగడమే యెదగడం. యీలోకమే నా ఆలయం. నేను చెప్పినట్టుగా వుండడమే ప్రార్థన. మీకోసమే యీలోకాన్ని తయారుచేసింది నేను. యిది మీ స్వంతం. యిది మీ అందరిదీ... అందరూ సమానంగా పంచుకోండి! పాత గోడలు పగల గొట్టుకోండి. కొత్త చెట్లునాటుకోండి...”

దమ్మలాల్ చోప్రా మాట్లాడుతున్నంత సేపూ నేను నోరు తెరుచుకుని వింటూ వుండి పోయాను. యింతకూ యితను చెబుతున్నదేమిటి? కవిత్వమూ? వేదాంతమా? లేకపోతే పైత్యమా?

సెక్యూరిటీ ఆఫీసరొకడు నాదగ్గరికొచ్చి బోర్డింగు పాసును చూపెట్టమన్నప్పుడు గానీ చోప్రా ప్రసంగం ఆగలేదు. సెక్యూరిటీ ఆఫీసరు మిగిలిన ప్రయాణికుల బోర్డింగు పాసుల్ని గూడా తనకీ చేస్తూ ముందుకెళ్ళిపోయాడు.

నా పక్కనకూచున్న ముసలాయిన పైకిలేచి, విమాన ద్వారం వరకూ వెళ్ళి వచ్చినట్టున్నాడు. తను తెలుసుకున్న సమాచారాన్ని భార్యకు చేరవేస్తున్నాడు – అతను పదిహేను రోజులక్రితం లండన్ గాట్‌విక్ విమానాశ్రయంలో మోనార్క్ యెయిర్ లైన్స్ విమానమెక్కి లిస్బేన్‌కు వెళ్ళాడట! విమానం బయల్దేరే ముందు ప్రయాణికులకు స్నాకులూ, డ్రింకులూ యిస్తూ, పాస్‌పోర్టూ, వీసాలేకుండా విమానమెక్కిన కుర్రాడి నొకడ్ని యిలాగే విమాన సిబ్బంది పట్టుకున్నారట! వాడికి బోర్డింగ్ పాసెలా దొరికిందో అర్థంగాక వాళ్ళు బుర్రలు బద్దలుగొట్టుకున్నారట! అతడి వివరాలు తెలిసేంతవరకూ విమానం కదల్లేదట! ఆకుర్రాడు యింగ్లాండులోని యేదో 'కేర్‌హోమ్' నుంచీ పారిపోయి వచ్చాడట! ఆకుర్రాడి తల్లి సెక్యూరిటీకి దొరక్కుండా వాడెలా విమానమెక్కాడని అందరినీ నిలదీసిందట! విమానాల్లో వెళ్ళే తీవ్రవాదులు యిలా అమాయకులుగా వుండే పిల్లలకోసం వలేసుకుని వుంటారనీ, వాళ్ళచేత తమకు కావల్సిన సామాన్లను విమానాల్లోకి చేరేసుకుంటారనీ వాదించిందట! ఆతర్వాత తనకొడుకు – పదేళ్ళయినా లేని పిల్లవాడు – రోడ్డుపక్కన ఆగివున్న ట్రక్కును దొంగతనంగా నడుపుతూ, వొకవూరి నుంచీ యింకో వూరికి చేరాడని గర్వంగా ప్రకటించిందటలెండి! అది వేరే సంగతి! సెప్టెంబరు తొమ్మిది తర్వాత, యిప్పుడున్న యీ ప్రమాదకరమైన పరిస్థితిలో, ఆకుర్రాడెలా విమానంలోకెళ్ళ గలిగాడని, సెక్యూరిటీవాళ్ళు తలలుపట్టుకుని కూచున్నారట! దాంతో ఆరోజు ఆ విమానాశ్రయం నుంచీ వెళ్ళాల్సిన చాలా విమానాల్ని రద్దు చేశారట! మిగిలిన విమానాలు బాగా ఆలస్యంగా నడచాయట! యింతా చెప్పాక ఆ ముసలాయిన యిదివరకూ సెక్యూరిటీ వాళ్ళు తీసుకెళ్ళిన కుర్రాడు గూడా యీ బాపత్తేనని తేల్చాడు.

ఆ తరువాత అతను పక్కకు తిరిగి నన్నూ, దమ్మలాల్ చోప్రానూ గూడా ఆదోరకంగా చూడసాగాడు. నిజమేమరి! యిన్ని సంగతులు తెలిశాక, యేపుట్టలో యేముందోనని అనుమానంరావడమే సహజం! అందులోనూ దమ్మలాల్ చోప్రా ప్రవర్తన చూశాక అనుమానపడకుండా వుండగలగడమే అసాధ్యం.

అప్పుడే ప్రాణమొచ్చినట్టుగా టీవీల తెరలపైన యేవో గీతాలు మొలిచాయి. యిప్పుడే మొదటి సారిగా చెబుతున్నట్టుగా విమానం ప్రయాణికులకు ఆహ్వానం పలుకుతోంది. మళ్ళీ వాళ్ళ విమానంలో వుండే అదనపు సౌకర్యాలూ, మళ్ళీ సేఫ్టీ బెల్టుపెట్టుకునే విధానమూ...ప్రయాణికులందరూ ముఖాలు తిప్పుకుని నీరసంగా తూలుతున్నారు. యింతలో విమాన మొక్కసారిగా కదిలింది. ప్రయాణీకులందరూ వులిక్కిపడి, మేలుకుని, కుర్రాడు ఖాళీచేసి వెళ్ళిన సీటు కేసి చూడసాగారు. విమానపు స్పీకర్లలోంచీ "గుడాఫ్టర్ నూన్ లేడీస్ అండ్ జెంటిల్‌మాన్.." అంటూ ప్రకటన మొదలయ్యింది. నా పక్కసీటు ముసలాయిన "అండ్ చిల్డ్రన్" అని మాట జోడించాడు. ఆలస్యానికి చింతిస్తున్నా మనీ, విమానపు సాంకేతిక సమస్య పరిష్కారమయ్యిందనీ, యిప్పుడిక నిజంగా టేకాఫ్

అవుతున్నామనీ పైలట్ వినయంగా చెబుతున్నాడు. ప్రకటనలను నమ్మడం మానేసిన ప్రయాణికుల దగ్గరికొచ్చి, యెయిర్‌హోస్టులు బెల్టులు తగిలించుకోమని హెచ్చరిస్తున్నారు.

విమానం పక్కకు తిరిగి రన్‌వేపైకొచ్చింది. రెండు మూడు మలుపులు తిరిగాక ఆగింది. "నౌ వుయార్ టేకింగ్ ఆఫ్" అన్నాడు పైలట్... విమానం ముందుకు పరుగెత్తి, తరువాత పైకి లేచింది. చెట్లూ, రోడ్లూ, యిండ్లూ, వూరూ క్రమంగా కిందికి వెళ్ళిపోసాగాయి. విమానాశ్రయంలోని పొడవాటి భవనాలు వీడ్కోలు చెబుతున్న పిల్లల చేతుల్లా కనిపిస్తున్నాయి. చుట్టూ నదులు క్రమ్ముకుంటూండగా, వాటి మధ్యలో వ్యాపించిన ఆమ్‌స్టర్‌డాం నగరం కన్నీళ్ళు నింపుకున్న కన్నులా చూస్తోంది.

"ఫేర్‌వెల్ టు ఆమ్‌స్టర్‌డాం! ఫైనలీ!" అంటూ దమ్మలాల్ చోప్రాకేసి చూశాను.

"ఫేర్‌వెల్ టు ఆమ్‌స్టర్‌డాం! విచ్‌గేవ్ అజ్ అన్‌ఫర్‌గెటబుల్ అద్భుత్!" అన్నాడు చోప్రా వెంటనే.

నేనతడికేసి విస్తుపోయి చూడ్డం యిది యెన్నోసారో!

## 12

విమానం ఆకాశంలోకెళ్ళిన తర్వాత నేను దమ్మలాల్ చోప్రాకు సెక్యూరిటీ వాళ్ళు తీసుకెళ్ళిన కుర్రాడిది వరకూ కూర్చున్న కుర్చీని చూపెట్టాను. తరువాత నెమ్మదిగా నా పక్కసీటు ముసలాయిన చెప్పిన సంగతులనంతా వివరంగా చెప్పాను. ఆ కుర్రాడి దుందుడుకు చేష్టవల్లే విమానం ఆమ్‌స్టర్‌డాం నుంచీ ఆలస్యంగా బయలుదేరిందని అన్నాను.

దమ్మలాల్ చోప్రా నాకేసి కళ్ళు పెద్దవి చేసి చూశాడు. తరువాత ఆ కుర్రాడు మా విమానమే యెందుకెక్కాడనీ, తాను తన అద్భుతజ్ఞానాన్ని నాకు బోధించిన తర్వాతే విమానమెందుకు కదిలిందనీ ప్రశ్నించాడు. నేను యింకా వెలుతురులోకి రాలేకపోతున్నందుకు విచారించాడు. యివ్వాళ పొద్దున ఆమ్‌స్టర్‌డాం విమానాశ్రయపు హోటలు డాబాపైన నాకు చల్లగాలి వీచడమూ, తెల్లవారడమూ, సూర్యుడు పుట్టడమూ మాత్రమే తెలిసిందనీ, తనకు అప్పుడొక గొప్ప దివ్యానుభవం కలిగిందనీ అన్నాడతను. చూస్తూండగానే యీ సృష్టినంతా కప్పిన తెరలన్నీ జారిపోయి, వాటి వెనక జ్యోతిలా వెలుగుతున్న అద్భుత సత్యమేదో సాక్షాత్కరించిందట! ఆ మహత్తర అనుభవాన్ని మోసే శక్తి లేకపోవడం చేతనే తన శరీరం మూర్ఛపోయిందట! అయితే తన అంతర్నేత్రం తెరుచుకుని అంతా స్పష్టంగా చూసిందట!

దమ్మలాల్ చోప్రా ప్రవక్తల కథలూ, అవదూతల వ్యవహారాలూ, ఆధ్యాత్మిక రచనలూ బండ్లు బండ్లుగా చదివి పారేసినట్టున్నాడు. రకరకాల మార్మిక అనుభవాల్ని నమిలి

మింగేసినట్టున్నాడు. అందుకే సరిగ్గా అలాంటి అనుభవమే తనకూ వచ్చిందని గట్టిగా నమ్మేస్తున్నాడు.

అయితే యే మాట కామాటే చెప్పుకోవాలి. అతను నన్ను శిష్యుడిగా భావించుకుని, చెప్పిన ఆ తొలి బోధనలో గొప్పవిషయాలే వున్నాయి. ప్రపంచమంతా అలా మారితే బాగుండుననే కాలజ్ఞానమేదో అందులో వుంది. కానీ యిందులో అతను చెప్పిన కొత్త విషయాలు మాత్రం యేమీలేవు.

కిటికీ పక్కకూచున్నా బయటికి చూడకుండా, కళ్ళు మూసుకుని తనలోకి తానుచూసుకుంటున్నట్టుగా వున్నాడు చోప్రా. గత రెండు రోజులుగా నన్ను రకరకాలుగా వేధించి, తీరా యిప్పుడు నాపైనే తన ప్రయోగాల్ని మొదలు పెట్టాడీ పెద్దమనిషి! నన్ను చిన్న పిల్లాడనుకుంటున్నట్టున్నాడు. అతడి చేయి పట్టుకుని కుదిపి, 'యిదివరకూ నువ్వు చెప్పిన మాటల్ని నువ్వయినా పాటిస్తావా?' అని వ్యంగ్యంగా అడిగాను.

దమ్మలాల్ చోప్రా ప్రశాంతంగా నవ్వాడు. "చూస్తూండు! నేనేగాదు. నువ్వుగూడా మారతావు. నువ్వేగాదు, యీ ప్రపంచంలో వుండే అందరు మనుషులూ మారతారు... మారి తీరతారు. మారేలా చేస్తాను" అన్నాడు.

చివరిమాట వినేసరికి నేను వులిక్కిపడ్డాను. యేంచేస్తాడితను?

మరోసారి కళ్ళు అరమోడ్చుకుని నా ప్రశ్నకు సమాధానం చెప్పనారంభించాడు చోప్రా – యిప్పుడతను చెబుతున్న విషయాలు అతను ఆలోచించి చెబుతున్నవి గావట! యేదో తెలియని శక్తికి తాను కేవలం వాహికగా మారిపోయివున్నాడట! అందువల్ల విషయాలు వాటంతట అవే బయటికొస్తున్నాయట!

దమ్మలాల్ చోప్రా యిదివరకటి ధోరణిలోనే మళ్లీ చెప్పుకుపోసాగాడు –:

"–మంచేదో చెడేదో ప్రతి మనిషికీ తెలుసు ననుకుంటే పొరబాటే! మంచేదో కొద్దిమంది గొప్పవాళ్ళకే తెలుస్తుంది. వాళ్ళు ఆ మంచిని తప్పనిసరిగా, అవసరమైతే బలవంతంగానైనా, యితరులపైన రుద్దాల్సిందే!

–నేను చెబుతున్నది మతంగాదు. ధర్మం. ముందుగా నేను కొందరు శిష్యుల్ని తయారుచేసుకుంటాను. వాళ్ళు నా బోధనలను ఆచరిస్తూ, యితరులందరూ అలా చేసేలా వొప్పిస్తారు. వొప్పుకోని వాళ్ళను శిక్షిస్తారు. అందుకోసం వాళ్ళు ప్రాణ త్యాగానికైనా సిద్ధపడతారు. శాశ్వతమైనదీ, గొప్పదీ అయిన గొప్ప ఆదర్శం కోసం, అవసరమైతే దుర్మార్గమైనదీ, కఠినమైనదీ అయిన మార్గాన్ని యెంచుకోవడంలో తప్పులేదు–

–యింతవరకూ వున్న ప్రార్థనాలయాలన్నీ యికపైన కేవలం చారిత్రక ప్రదేశాలై పోతాయి. తన కర్తవ్యాన్ని తాను చేయడమే ప్రార్థన. పాత మత గ్రంథాలన్నీ గ్రంథాల యాల్లో చారిత్రక అవశేషాలుగా మిగిలిపోతాయి.

–యికపైన మనుషులెలా బతకాలో వివరిస్తూ కొత్త పవిత్ర గ్రంథమొకటి రాబోతోంది. అతీత శక్తి నా ద్వారా దాన్ని రాయించబోతోంది. ఆ గ్రంథంలో రాసినట్టుగా, యథాతథంగా ప్రవర్తించి తీరాలి. అలా ప్రవర్తించని వాళ్ళని యేరిపారేయడం ద్వారా గొప్ప సమాజాన్ని తయారుచేస్తాను. అందుకోసం ప్రాణ త్యాగానికైనా వెనుకాడని గొప్ప సైనికుల్ని రూపొందిస్తాను."

క్రమంగా అతణ్ణి చూస్తోంటే నాకు భయం పెరిగిపోసాగింది.

నేనతడి చేయి పట్టుకుని లాగాను. కలలోంచీ మేలుకున్నట్టుగా దమ్మలాల్ చోప్రా కళ్ళు తెరిచాడు. తన ఆలోచనలు బాగున్నాయిగానీ వాటిని ఆచరణలోపెట్టడానికి, శాంతియుతమైన వేరే మార్గాన్ని దేన్నయినా ఆలోచించమని ప్రాధేయపడుతున్నట్టుగా అడిగాను.

"– నా ఆలోచనలకు భిన్నంగా మాట్లాడడమే పాపం! వినడమొక్కటే నీ కర్తవ్యం. నేను చెప్పినట్టుగా చేయడమే నీ ధర్మం. నా మాటలు వినే స్థాయికి యెదగడమే నీ లక్ష్యం. గొప్ప విప్లవానికి యిదే ప్రారంభం. నా మాటలు పాఠించని వాళ్ళంతా కలుపుమొక్కలు. వాళ్ళను పీకి పారేయాలి. అది హింసకాదు. అది పునరుజ్జీవనం... యీ లోకంలో నా మాటలు వినని వాళ్ళు జీవించలేరు. అది నా శాసనం..."

ఆపైన అతడిమాటలు వినే అర్హత నాకుందో లేదో తేల్చుకోమన్నట్టుగా దమ్మలాల్ చోప్రా మౌనంగా వుండిపోయాడు. కళ్ళు మూసుకుని తన లోకంలోకి తానెళ్ళిపోయాడు.

పైకి మంచుముద్దలా ప్రశాంతంగానే కనబడుతున్నాడతను. అయితే అతడిలోపల మండుతున్న అగ్ని పర్వతాన్నేం చేయాలి? యింత చరిత్రను చూశాక, యిన్ని గుణపాఠాలు నేర్చుకున్నాకగూడా అతడిలో మార్పురాకపోవడమే పెద్ద అద్భుతం! అతను చెబుతున్న పరమధర్మ మేమో గొప్పదే! కానీ దాన్ని అనుసరింపజేయడానికి యితను మళ్ళీ హింసామార్గాన్నే యెన్నుకుంటున్నాడు.

యీ లోకంలో యిప్పుడిలాంటి గురువులకు లోటులేదు. నూర్లునూర్లుగా వున్న యీ గురువులకు వేల లక్షలమంది శిష్యులూ చేరిపోతున్నారు. ఆ గురువుల బోధనల్ని పాఠించడమే తమ జీవిత ధ్యేయంగా భావిస్తున్న శిష్యులెందరో వున్నారిప్పుడు. చూడబోతే యీ దమ్మలాల్ చోప్రా తన వూరికి వెళ్ళగానే, తన పాత జీవితాన్ని వదలిపెట్టి, యీ కొత్త గురువు (లేకపోతే ప్రవక్తా?) అవతారాన్ని ప్రారంభించబోతున్నట్టే వున్నాడు. రెండు మూడేళ్ళలో యితడికి వేలమంది శిష్యులూ దొరకవచ్చు. యీయనగారి బోధనల్ని

అమలులో పెట్టడంకోసం వాళ్ళందరూ కత్తులు పట్టుకుని యుద్ధంలోకి దిగితే యేమవుతుంది?

నాకు వెన్నులో చలీజ్వరం పుడుతున్నట్టుంది. భయంతో చెమటలు పోయసాగాయి. అలా యెంతసేపు వణుకుతూ కూచున్నానో, చివరికెప్పుడు ఆదమరిచి నిద్రలోకి జారిపోయానో నాకే తెలియదు.

పదిగంటలా యిరవై నిముషాలు – అదీ ఆమ్‌స్టర్‌డాంనుంచీ ఢిల్లీకి రావడానికి విమానానికి పట్టేకాలం.

యింకో పదిహేను నిముషాల్లో ఢిల్లీ రాబోతోందనగా దమ్మలాల్ చోప్రా నాభుజం పట్టుకుని వూపి" హోల్‌కైసాహైజనాబ్!" అన్నాడు. నేనతడికేసి విస్మయంగా చూస్తూ నవ్వడానికి ప్రయత్నించాను.

"అవుర్ తోడీదేర్‌కే బాద్ ఢిల్లీ! ఆమ్‌స్టర్‌డాంమే అద్భుత్ నికల్ గయా! అబ్ ఢిల్లీమే ఆవిష్కార్‌హెూగా!" అన్నాడతను. బహుశా అతనూ నిద్రపోయినట్టున్నాడు. నిద్రపోయి లేచినా మునుపటి చిత్తభ్రాంతి తగ్గినట్టులేదు.

"నిజమే! ఆమ్‌స్టర్‌డాంలో అద్భుతమే జరిగింది. సెప్టెంబరు పదకొండు తర్వాత అన్ని విమానాశ్రయాల్లోనూ తీవ్రవాదుల భయం పెరిగిపోయింది. మనం ఆమ్‌స్టర్‌డాంలో యిరవైనాలుగు గంటలు గడపడానికి సరిగ్గా పదిహేను రోజులముందు, పన్నెండుమంది భారతీయుల్ని అనుమానితులని అరెస్టు చేశారు. యిప్పుడెవరు తీవ్రవాదులో, యెవరుకారో తెలుసుకోలేక సెక్యూరిటీవాళ్ళు యిబ్బంది పడుతున్నారు. అందుకే పొరబాటున అమాయకుల్ని అరెస్టుచేసి, శిక్షించినా, అందులో తమతప్పులేదని వాళ్ళునమ్ముతున్నారు. దాన్నే వాళ్ళు 'యెర్రింగ్ ఆన్ ది సైడ్ ఆఫ్ సెక్యూరిటీ' అని తేల్చిపారేస్తున్నారు. యింత ప్రమాదకరమైన పరిస్థితుల్లో, చివరకు సెక్యూరిటీ వాళ్ళు మనల్ని అనుమానించినా, తప్పకుండా తీవ్రవాదులే అనిపించే వ్యక్తులతో బాటూ మనం కలిసి తిరగవలసివచ్చినా, యిలా తప్పించుకుని, తిరిగీ మనం మనదేశానికి చేరుకుంటు న్నాం చూడూ, అదీ, అదీ, అద్భుతం!" అన్నాన్నేను.

"పక్కన నేనుండగా నిన్నెవరు పట్టుకోగలరు?" అన్నాడు దమ్మలాల్ చోప్రా గంభీరంగా. అంటే యింకా తనలో మానవాతీతమైన శక్తులున్నాయని అతను నమ్ముతూనే వున్నాడన్న మాట!

యీదమ్మలాల్ చోప్రా చూడ్డానికి పాకిస్థానీగానో, ఆఫ్ఘనిస్తాన్ వాడుగానో కనబడ తాడనీ, అందువల్ల నా భయమంతా యితడితో కలిసి ప్రయాణం చేయవలసి రావడం చేతనే అనీ, ట్రావిలింగ్ యేజెంట్ గాబ్రియల్ ముండా నన్నిలా యిరింకించడమే దుర్మార్గమనీ, యిప్పటికైనా అతడికి స్పష్టంగా చెప్పాలనిపించింది.

"నీలాంటి వాడితో ప్రయాణమంటే ప్రమాదమే ననుకో! నేనూ మొదట్లో కంగారు పడ్డాను. మొదటి నుంచీ నీపైన నాకు అనుమానం వుంది. తర్వాత మెక్సికోలో ఆ అనుమానం నిజమని తేలింది. కానీ నిన్నప్పుడు నట్టేట్లో ముంచెయ్యాలనిపించలేదు. యెలాగైనా కాపాడాలను కున్నాను. దానికోసం నా శక్తులన్నీ వుపయోగించాల నుకున్నాను.. పైగా నువ్వు నా ప్రథమ శిష్యుడు కావాలని నిర్ణయించబడివుంటే, దాన్ని ఆపగలవారెవ్వరు?" అన్నాడు దమ్మలాల్ చోప్రా ప్రసన్నంగా నవ్వుతూ.

అతడిమాటలు నాకు విడ్డూరంగా వున్నాయి. నేను కోపంగా యేదో చెప్పబోయాను. "నువ్వు ముస్లిమువని తెలుసునాకు. వాళ్ళకు ముస్లిములపైన్నే అనుమానం" అన్నాడతను.

నాపైన కొండ చరియేదో విరుచుకపడినట్టుగా నిలువెల్లా వణికిపోయాను. "నేను ముస్లిమునని నీకెవరుచెప్పారు?" అని అడిగాను.

"తిరుపతి యూనివర్సిటీలో నాకో స్నేహితుడున్నాడు. అతడూ నేనూ యిలాగే సెమినార్లలో కలుసుకుంటూ వుంటాం. అతడికి యీమెయిలిచ్చాను. అతడి సమాధానం నేను మెక్సికోలో వుండగా అందింది" అన్నాడు చోప్రా.

మా నాయిన నేను పదో తరగతి చదువుతూవున్నప్పుడు నా సర్టిఫికెట్టులో 'ముస్లిం – దూదేకుల' అని దిద్దించాడు. అంతవరకూ నేను 'హిందూ–దూదేకుల'నే! మాతాతా అవ్వా హిందువులుగానే బతికారు. మా అవ్వ పెద్దబొట్టు పెట్టుకుని తిరగడం నాకు బాగాగుర్తు. అయితే యీ రెండు పడవలపైన ప్రయాణం యిబ్బందయిపోయి, అటు వెళ్ళడం సాధ్యంగాక పోవడంతో, యిటే వచ్చేశాడు మానాయిన. మాపూర్వీకులంతా మునుపు హిందువులే అనీ, తరువాతెప్పుడో తప్పనిసరై యిలా దూదేకుల వాళ్ళయ్యారనీ మా పెద్దవాళ్ళు చెప్తూ వుంటారు. యిప్పటికీ నేను హిందువో, ముస్లిమో నాకే స్పష్టంగా తెలియదు. అయినా యీ గొడవంతా యిప్పుడు దమ్మలాల్ చోప్రాకు చెప్పడం వల్ల లాభమేముంది? అతడితో కలిసి ప్రయాణం చేసినందుకు నేను భయపడినేట్టే, తానూ నాతో కలిసి ప్రయాణం చేసినందుకు భయపడ్డాడు. యిందుకు మేమిద్దరమూ కారణంగాదు. మరెవరు కారణం?

ఢిల్లీలో విమానం దిగబోతోందని పైలట్ ప్రకటించాడు. బెల్టులు తగిలించుకోమని హెచ్చరించాడు. విమానం క్రమంగా, నేలకు చేరువై, ఢిల్లీ రన్‌వే పైకొచ్చింది.

"ఆమ్‌స్టర్‌డాం మే అద్భుత్ ... ఆమ్‌స్టర్‌డాంమే అద్భుత్!" అన్నాడు దమ్మలాల్ చోప్రా వుద్వేగంగా!

నిజమే! ఆమ్‌స్టర్‌డాంలో అద్భుతం జరిగింది– దమ్మలాల్ చోప్రా దృష్టిలో వొక రకంగా! నా దృష్టిలో మరో విధంగా!

❖❖❖

# భరతవాక్యం

*'ఆమ్‌స్టర్‌డాంలో అద్భుతం' అనే యీ నవల ఆత్మకథ గానీ, చరిత్ర గానీ కాదు; కేవలం కల్పనా సాహిత్య రచనే! అయితే యీ నవలలో కొంత ఆత్మకథా, చాలా వరకూ చరిత్రా వున్నాయి. కల్పనా సాహిత్యంపైన వున్న గౌరవంతో, చివరిదాకా చదివిన పాఠకులు యీ రచనలో ఆత్మకథ, చరిత్ర యే నిష్పత్తిలో చోటు చేసుకున్నాయో తెలుసుకోవాలనుకోవడం సహజమే! ప్రతి రచనలోనూ రచయిత ఆత్మకథ యెంతో కొంత, యేదో వొక రూపంలో వుండనే వుంటుంది గనుక ఆ విషయాలేవో ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం వుండదు. రెండు మూడు దశాబ్దాలుగా ప్రపంచంలో జరుగుతున్న పరిణామాలను వార్తా పత్రికల్లోనూ, టీవీల్లోనూ పరిశీలిస్తున్న వాళ్ళకు యీ నవల్లోని చారిత్రక నేపథ్యాన్ని వివరించాల్సిన అవసరమూ లేదు. అయితే అలా గమనించని పాఠకుల కోసం మాత్రమే యీ చిన్న 'వుపసంహారం' రాస్తున్నాను.*

*2006 ఆగస్టు 22వ తేదీన కేంద్ర సాహిత్య అకాడమీ వాళ్ళు మెక్సికో దేశానికి పంపిన తొలి సాహిత్య ప్రతినిధి వర్గంలో సభ్యుడుగా నేను ఆ దేశానికి బయల్దేరాను. నాతోబాటూ లక్నో నుంచీ అఖిలేశ్వర్‌కుమార్ అనే హిందీ రచయిత కూడా వచ్చారు. మరో భారతీయాంగ్ల నవలా రచయిత కిరణ్ నాగర్కర్ బెర్లిన్ నుంచీ మెక్సికోకు వచ్చి, ఆ తరువాత అటే మళ్ళీ బెర్లిన్‌కు వెళ్ళిపోయారు. తిరుగు ప్రయాణంలో నేనూ, అఖిలేశ్వర్ ఆగస్టు 28వ తేదీన ఆమ్‌స్టర్‌డాం విమానాశ్రయంలో 22 గంటలు వేచి వుండవలసి వచ్చింది. మెక్సికోలోని భారత యెంబసీ వాళ్ళు మాకు సహాయం చేయడానికి గట్టిగా ప్రయత్నం చేసినా మా ప్రయాణాయాసంలో మార్పు రాలేదు. ఆమ్‌స్టర్‌డాంలో 22 గంటల నిరీక్షణ తర్వాత, విమానమెక్కాం. యేదో సాంకేతిక సమస్య వల్ల మరో ఆరు గంటల సేపు విమానం కదల్లేదు. అలా మేము దాదాపు 30 గంటలు ఆమ్‌స్టర్‌డాం విమానాశ్రయంలో కట్టుబడిపోయాం.*

*మేము మెక్సికోలో వున్న సమయంలో, ఆగష్టు 23వ తేదీన ఆమ్‌స్టర్‌డాం విమానాశ్రయంలో కొందరు భారతీయుల్ని నిర్బంధంలోకి తీసుకున్నారు. వాళ్ళు అదే*

*రోజున నార్త్ వెస్ట్ యెయిర్‌లైన్స్ విమానంలో ముంబాయికి బయల్దేరినవాళ్ళు. విమానం ఆకాశంలో ప్రయాణం చేస్తూండగా వాళ్లల్లో కొందరు సీటు బెల్టులు పెట్టుకోమని హెచ్చరించినా వినలేదట! పైగా సెల్‌ఫోన్లు మార్చుకోసాగారట! యెయిర్ మార్షల్స్ వాళ్ళను బలవంతంగా అదుపులోకి తీసుకుని, విమానాన్ని అది బయల్దేరిన అరగంటలోపే తిరిగీ ఆమ్‌స్టర్‌డాం విమానాశ్రయానికి తీసుకొచ్చేశారు. అప్పుడు ఆ విమానంలో 149 మంది ప్రయాణికులున్నారట! మరునాడు వుదయం అనుమానితులుగా కనిపించిన 12 మందిని తప్ప, మిగిలిన ప్రయాణికులందరినీ మరో విమానంలో ముంబాయికి పంపేశారు.*

*నిర్బంధించబడిన 12 మంది ప్రయాణికుల్ని ఆ తరువాత విచారణ చేశారు. హింసాత్మకమైన విధ్వంసం సృష్టించబోతున్నారనడానికి కావల్సిన సాక్ష్యమేమీ దొరకలేదని చివరకు అక్కడి పోలీసులు తేల్చేశారు. భారతదేశ సంతతికి చెందిన ఆ పన్నెండు మంది ప్రయాణికులు తీవ్రవాదులయివుండే (Potential Terrorists) అవకాశ ముందని డచ్ పోలీసులు భావించారు. వాళ్ళు తమ సూచనలను పాటిస్తున్నట్టుగా కనిపించినా, అనుమానాస్పదంగానే ప్రవర్తించడం చేత, వాళ్ళను నిర్బంధించి, విచారణ చేశారు. యీ విషయానికి స్పందించిన 'ఆసియన్ యేజ్' అనే పత్రిక విలేఖరి యిలా భారతీయులను నిర్బంధించడానికి కారణం డచ్ వాళ్ళకుండే జాత్యహంకారమేనని విమర్శించాడు. అయితే యిలా వొకరిద్దరు రక్షణాధికారులు చేసిన పనికి మొత్తం డచ్ ప్రజలనంతా నిందించడం భావ్యంగాదని డచ్ పత్రికలు సమాధానం చెప్పాయి. విమాన ప్రయాణాలు చేసే యాత్రికులు యిటీవల జరుగుతున్న విపత్కర పరిణామాలను గురించి తెలుసుకుని తీరాలనీ, అందరూ నియమబద్ధంగా ప్రవర్తించక తప్పదనీ గుర్తు చేశాయి. ఆ పన్నెండు మంది భారతీయులూ నిర్దోషులే అయినా, తమ అమాయకత్వానికి తగిన మూల్యం చెల్లించారని తేల్చిపారేశాయి. విచారణ ముగిసే వరకూ వాళ్ళు ప్రమాదకరమైన వ్యక్తులు కారని తెలిసే వరకూ, అప్రమత్తతతో వాళ్ళకు బేడీలు వేయక తప్పదని ప్రకటించాయి. యిదే పని ముంబాయి విమానాశ్రమంలో జరిగితే, అక్కడి పోలీసులు గూడా, యేదేశపు ప్రయాణికులనైనా, యిలాగే నిర్బంధిస్తారని డచ్ పత్రికలు వాదించాయి.*

*ఆమ్‌స్టర్‌డాంలో యీ గొడవ జరిగినప్పుడు మేము మెక్సికోలోనే వున్నాం. తిరుగు ప్రయాణంలో ఆమ్‌స్టర్‌డాం విమానాశ్రయంలో జాగ్రత్తగా వుండమని మమ్మల్ని హెచ్చరించిన వాళ్ళు, యీ వుదంతాన్ని గురించి మాకు స్పష్టాస్పష్టంగానే చెప్పారు. మరింతగా తరచి అడిగితే యేం వినవలసి వస్తుందోనన్న భయంతో మేమూ యేమీ అడగలేదు. ఆమ్‌స్టర్ డాం విమానాశ్రయంలో 22 గంటలు మాకైతే ప్రశాంతంగానే గడచింది గానీ లోలోపల అలజడులు చెలరేగుతూనే వున్నాయి. భారతదేశానికి తిరిగొచ్చిన తర్వాత యింటర్నెట్ సహాయంతో జరిగిన సంగతులన్నీ తెలుసుకున్నాను.*

*విమానాశ్రయాల్లో జరుగుతున్న హింసాత్మక సంఘటనలన్నీ వొకదానివెంట వొకటిగా తెలిసి వచ్చాయి. రోజురోజుకూ పెరుగుతున్న మత తీవ్రవాదపు పరిణామాలేమిటో అర్థమయింది. ఈ ఆందోళనల్లో సామాన్యుడి జీవితమెంత అతలాకుతలంగా తయారవుతుందో చూపెట్టడంతో బాటూ, దీనికంతా మూలకారణమైన మతం, దాని పుట్టుక, స్వభావం గురించిన అన్వేషణగా కూడా నేనీ నవలను రాయడానికి పూను కున్నాను.*

*యిందులోని పాత్రలు కల్పితాలే అయినా వివరించిన పరిస్థితులేవీ కల్పనలుగావు. యిందులో జరిగిన సంఘటనలన్నీ, యేదో వొక రూపంలో, యేదో వొక చోట, యదార్థంగా జరిగినవే! వొక చారిత్రక నేపథ్యంలో జరిగిన కాల్పనిక రచనే యి నవల. అయితే ఆ కల్పనకు గూడా స్పష్టమైన చారిత్రక భూమిక వుందన్న విషయాన్ని సహృదయ పాఠకులకు గుర్తు చేయడం మాత్రమే యిప్పుడు నా బాధ్యత అని నేను భావిస్తున్నాను.*

**– మధురాంతకం నరేంద్ర**



Amsterdamlo Adbhutham
a novel by Madhuranthakam Narendra



తనకు మార్మిక సంకేతాలు అందుతున్నాయని నమ్మే వ్యక్తికి, నేడు హద్దుల్లేకుండా పెరుగుతున్న టెక్నాలజీ ప్రపంచంలో అప్రతిభుడైపోతున్న మరో వ్యక్తికీ విశాలమైన అమ్‌స్టర్‌డాం విమానాశ్రయంలో ఎదురైన వింత అనుభవాల హాస్యవల్లరి ఈ నవల. వాస్తవికతతో సంబంధం తక్కువగా ఉంచుకొనే భారతీయ మనస్తత్వానికి రచయిత చేసిన భాష్యం ఇది. కఠిన వాస్తవికతను చిత్రిస్తూనే జీవితపు చలన సూత్రాలను ఈ నవల ప్రతిభావంతంగా ఆవిష్కరిస్తుంది.

– ఆర్.వసుంధరాదేవి

ఈ నవల లోని ప్రతి వ్యక్తీ స్థానభ్రంశం చెందినవాడే! తమ తమ స్థానాలకు తిరిగి రావడం కోసం స్థానభ్రంశమైన వ్యక్తులు ప్రయత్నించే తీరును వివరించే నేపథ్యంలో, సందర్భంలో, మతం, దాని పుట్టుక, ప్రాచుర్యం, ప్రభావం, దాని పర్యవసానాలను చక్కగా వివరించే రచన ఇది. పాఠకుడు సూక్ష్మంగా, తరచి తరచి, అణువు అణువును, మెల్లమెల్లగా, జాగ్రత్తగా, అప్రమత్తంగా చదవవలసిన నవల.

– అద్లూరు రఘురామరాజు



